సాహితీ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 189 పేజీలు: 12 వెల: 6.50


మెడికో కేసు: ఇద్దరు నిందితుల అరెస్టు 2లో

నీట్: 13మందిపై సిబిఐ ఛార్జిషీటు

# క్వారీలకు వస్తా..కొరడా తీస్తా

## ఇసుక మాఫియాకు సిఎం చంద్రబాబు తీవ్ర హెచ్చరిక

## కలెక్టర్, మైనింగ్ అధికారులకు నెల రోజులు గడువు



**చీరాల టౌన్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాల అంశంపై తీవ్రంగా స్పందించారు. ఇసుక మాఫియాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేసిన ఆయన, అధికారులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. సభ వేదికపైనే బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తోపాటు మైనింగ్ శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమాలపై పూర్తి స్థాయి వివరాలతో కూడిన నివేదికను నెలరోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. అక్ర మాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు >>2

# త్వరలో బిసి చట్టం



శుక్రవారం చీరాల నియోజకవర్గం కొత్తపేటలో చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

## ముసాయిదా సిద్ధంగా ఉంది..

### నేతన్నలకు మేలు చేసేది కూటమి ప్రభుత్వమే

### చీరాలలో 'నేతన్న సేవలో' ప్రారంభించిన సిఎం చంద్రబాబు

**కుటుంబానికి రూ.25వేల చొప్పున 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు జమ**

**చీరాల, ఆగస్టు 7 ప్రభాతవార్త:** బిసిల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని, దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బిసి సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్లజిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సిఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థికసాయాన్ని సిఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179కోట్లను >>2



# జంతర్‌మంతర్‌ను 'బందీ'ని చేయొద్దు

## నిరసనలకు దూరంగా ఉంచండి: ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** నిరసనల కారణంగా జాతీయ రాజధానిని 'బందీగా పెట్టలేం' అని వ్యాఖ్యానిస్తూ, జంతర్ మంతర్ వద్ద గానీ, నగరంలోపల గానీ నిరసనలు జరగకపోవడమే ఆదర్శప్రాయమని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ మహాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నగరంలోపల నిరసనలు జరగడం వల్ల రోడ్లు, అంబులెన్సులు వంటి సాధారణ ప్రజల కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందని, అందువల్ల తాను వ్యక్తిగతంగా అలా భావించడం లేదని జస్టిస్ మహాజన్ పేర్కొన్నారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలనే డిమాండ్‌పై ఆగస్టు 10న జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసనకు అనుమతి కోరుతూ దాఖలైన పిటి >>2

# డోలీల్లేని ఊళ్లు చూడాలి

## అడవితల్లిబాట తొలిదశలో 1,069 కి.మీ. రహదారుల అభివృద్ధికి శ్రీకారం

### రెండోదశలో 2,310 కి.మీ నిర్మాణం, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షలో డి.సిఎం పవన్

**విజయవాడ.ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి గిరిజన గ్రామం డోలీ రహితం కావాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. అడవితల్లిబాట పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించిన పవన్ కళ్యాణ్ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో డోలీరహిత గిరిజన గ్రామాలు లక్ష్యంగా చేపట్టిన అడవితల్లి బాట పనులు స్పష్టమైన పురోగతి దిశగా సాగుతున్నాయి. అడవితల్లి బాట తొలి దశలో రూ. 1,005 కోట్ల అంచనా వ్యయంతో 1,069 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తూ అడవితల్లిబాట 2.0ను ప్రారంభించడం జరిగింది. ఈ విస్తరణతో మొత్తం ప్రాజెక్టును రూ. 2,078 కోట్ల అంచనా వ్యయంతో 2,310 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి విస్తరించడం జరిగింది. ఇందులో ఇప్పటికే 905 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం పూర్తైంది. అడవితల్లిబాట కార్యక్రమం మొదటి రోజు నుంచి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పనులు వేగంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా పవన్ కళ్యాణ్ సూచనలు చేస్తున్నారు.

**సవాళ్ల నడుమ రోడ్డు నిర్మాణం:** అడవితల్లిబాట కార్యక్రమంలో భాగంగా చాలా గ్రామాలకు రోడ్డు వేయడం కంటే ముందు దారి నిర్మించేందుకు సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రోడ్ల నిర్మాణంలో భాగంగా పెద్ద పెద్ద గుట్టలను కంట్రోల్డ్ బ్లాస్టింగ్ ద్వారా బ్రేక్ చేసి, రాళ్లు పగలగొట్టి దారి ఏర్పాటు చేశారు. ఆ దారిపై రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. దారులు వేసిన తర్వాత కొన్ని ప్రాంతాలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక నిర్మాణ సామాగ్రి చేరుకోవడం కష్టతరంగా మారింది. అలాంటి సవాళ్ల మధ్య గిరిశిఖర గ్రామాలకు సైతం డోలీ కష్టాలనుంచి విముక్తి కల్పించాలన్న దృఢ సంక >>2



అడవి తల్లిబాటలో గిరిజన ప్రాంతంలో నిర్మించిన రహదారి (ఇన్‌సెట్) డి.సిఎం పవన్ కళ్యాణ్



# తిరుమల మొదటి ఘాట్‌లో కారు బోల్తా: కర్ణాటక భక్తుని మృతి

**తిరుమల,ఆగస్టు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్‌రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఘోరప్రమాదం జరగడంతో ఒకరు మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. >>2

# అమిత్‌షాతో స్పీకర్ ఓం బిర్లా భేటీ 5లో

## మాజీ మంత్రి సీదిరికి బెయిలు తిరస్కృతి



**శ్రీకాకుళం, ఆగస్టు 7 ప్రభాతవార్త:** కాశీబుగ్గ పారిశ్రామిక వాడ వద్ద గత నెల 10వతేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎ3 ముద్దాయిగా రిమాండ్‌లో ఉన్న మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బెయిల్ ఫిటీషన్ సొంపేట కోర్టు తిరస్కరిం చినట్లు తెలిసింది. మాజీ మంత్రి అప్పలరాజు ఇప్పటికే 15రోజులుగా జిల్లా జైలులో ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నారు. ఇటీవల పలాస కోర్టు లో మాజీమంత్రి డాక్టర్ అప్పలరాజుకు పోలీసు విచారణకు అనుమతి ఇవ్వాలని కాశీబుగ్గ పోలీసుల కోరడంతో ఆయనకు 4వ తేదిన పలాస పోలీస్ స్టేషన్‌లో విచారించేందుకు కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో కాశీబుగ్గ పోలీసులు ఈ నెల 4వ తేదిన మాజీ మంత్రి అప్పలరాజుకు జిల్లా జైలు నుంచి కాశీబుగ్గ పోలీస్ స్టేషనుకు తీసుకువచ్చి సాయంత్రానికి మళ్లీ జిల్లా జైలుకు పంపించారు. ఈ నెల 5వ తేది నాటికి అప్పలరాజుకు 14 రోజులు రిమాండ్ పూర్తి కావడంతో 5వ తేదిన జిల్లా జైలు నుంచే మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజుకు వర్చువల్‌గా హాజరు పరచగా పలాస న్యాయమూర్తి యు.మాధురి మరో 14 రోజులు రిమాండ్‌విధించారు. ఈ నెల 5వ తేదిన సొంపేట కోర్టులో అయన తరువు న్యాయవాది వరిశ బాలక్రిష్ణ మరో మారు బెయిల్ పిటిషన్ దాఖలు చేసి >>2

# భారీగా ఐఎఎస్‌ల బదలీ

## పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం తదితర కీలకశాఖల్లో 22 మంది మార్పు

**విజయవాడ,ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టింది. మొత్తం 22మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొత్త పోస్టింగ్‌లను కేటాయించింది. పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం, హౌసింగ్, టీటీడీ, వీఎమ్ఆర్‌డీఏ, ఏపీ టూరిజం తదితర కీలక శాఖల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రావత్ నియమితులమవ్వగా.. పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్యామలరావు, రవాణా శాఖ కార్యదర్శిగా కోన శశిధర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం సురేశ్ కుమార్, భరత్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.జయకృష్ణ, ఏపీఎస్ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శివప్రసాద్ నియమితులయ్యారు. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆమ్రపాలిని రిలీవ్ చేసిన ప్రభుత్వం ఆమెను సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అలాగే.. తేజ్ భరత్, బి.అనిల్ కుమార్ రెడ్డిలను కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని సూచించింది. పి.రవి సుభాష్‌కు ఎపీటీడీసీ ఎండీగా బాధ్యతలప్పగించింది. ఇకపురావస్తు శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజు, ఆరోగ్య శాఖ కమిషనర్‌గా చక్రధర్ బాబుకు అదనపు బాధ్యతలు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా అరుణ్ బాబు నియమితులయ్యారు. విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కమిషనర్‌గా ప్రఖర్ జైన్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ప్రభల గోపీనాథ్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పద్మావతి నియమితులయ్యారు. అదేవిధంగా హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా హెప్సిబా రాణి, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బి.సునీల్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ భారీస్థాయి ఐఏఎస్ బదిలీలతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. పలు ముఖ్యశాఖలకు కొత్త అధికారులను నియమించడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలో మరింతసమర్థవంతమైన పాలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# రణస్థలానికి తోటపల్లి నీరు తెస్తా

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం, 15 లోగా పంటల బీమా నమోదు చేసుకోవాలి, ఎపి ఎఐ ఐఎంఎస్ యాప్ ద్వారా సేవలు

### వేల్పురాయిలో 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 7, ప్రభాతవార్త :** రైతుల సంక్షేమం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రణస్థలం మండలం వేల్పురాయి గ్రామంలో నిర్వహించిన 'రైతన్నా.. మీకోసం' అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యల్పంగా భూగర్భ జలాలు ఉన్న మండలాల్లో రణస్థలం ఒకటని, వందల అడుగుల లోతుకు బోర్లు వేసినా నీరు పడని తీవ్ర పరిస్థితి ఇక్కడ నెలకొందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తోటపల్లి ప్రాజెక్టు నీటిని రణస్థలం మండలానికి తీసుకువచ్చే బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల సహకారంతో 9 రకాల విత్తనాలతో కూడిన ప్రత్యేక కిట్లను రైతులకు తక్కువ ధరకే పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలకు రక్షణ కల్పించేందుకు పంటల బీమా గడువును ఈ నెల 15వ తేదీ వరకు ఖరారు చేశామని మంత్రి తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంక్ మేనేజర్లే బీమా చెల్లిస్తారని, రుణాలు తీసుకోని రైతులు స్వయంగా ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఈ బీమా ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. రైతుల సౌకర్యార్థం 'ఏపీ ఏఐఐఎంఎస్' రిజిస్ట్రేషన్ యాప్ లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ యాప్ ద్వారా భూమి వివరాలు, వేసే పంటలు, మార్కెట్ ధరలు, విక్రయించే ప్రాం తాల సమాచారంతో పాటు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరిక రాలను సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ వారం రోజుల కార్యక్ర మంలో వ్యవసాయ అధికారులు ప్రతీ రైతుతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. రణస్థలం, లావేరు, జి.సిగడాం మం డలాల్లో మొక్కజొన్న సాగుచేసే రైతులు ఎదుర్కొంటున్న నీటి >>2



# విశాఖ రైల్వేజోన్ రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అతిస్వల్ప కాలంలోనే రికార్డు స్థాయి పురోగతి సాధించి, వార్షికంగా రూ.2,493 కోట్ల రాబడితో వెల్లడించింది. దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా నిలిచిందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.54,000 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, మరో రూ.71,000 కోట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయని పేర్కొంది. విశాఖ రైల్వే యార్డ్ ఆధునికీకరణ కోసం రూ.300 కోట్లు కేటాయించామని, అందులో భాగంగా 6 కొత్త ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేసింది.

అలాగే గుంతకల్‌బళ్లారి నాలుగు లైన్ల విస్తరణకు రూ.1,205 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. రైళ్ల భద్రత కోసం 100 ఇంజిన్లలో 'కవచ్' వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపింది. ఏపీ వ్యాప్తంగా 300కు పైగా ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, అమృత్ భారత్ కింద 70కి పైగా స్టేషన్ల అభివృద్ధి, విజయవాడలో స్లీపింగ్ పాడ్స్, రాబోయే గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లతో రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను వేగంగా ఆధునీకరిస్తున్నట్లు వివరించింది.




# ప్రసవాలు

## వైద్యమా! వ్యాపారమా?

### కాసులకోసం కత్తెర..

### తల్లుల ప్రాణాలతో చెలగాటం!

### కుటుంబాలపై లక్షల్లో భారం..

### ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ప్రైవేటు ఆసుపత్రులు



**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** ప్రసవం వైద్య అవసరమా... లేక వ్యాపార అవకాశమా? యాదాద్రి భువనగిరి జిల్లాలో గత పదేళ్ల ప్రసవాల గణాంకాలు ఈ ప్రశ్నను బలంగా ముందుకు తెస్తున్నాయి. ప్రభుత్వం సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలు, ఉచిత చికిత్స, ప్రత్యేక వైద్య బృందాలు అందుబాటులోకి తీసుకొస్తున్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రం సిజేరియన్ కాన్పులే ఆదాయ వనరుగా మారాయనే ఆరోపణలు అధికారిక గణాంకాలతోనే బలపడుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ బర్త్ పోర్టల్‌లో నమోదైన వివరాల ప్రకారం 2016-17 నుంచి 2025-26 వరకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగిన ప్రతి 100 ప్రసవాల్లో దాదాపు 87 ప్రసవాలు సిజేరియన్‌లే కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వైద్య అవసరం ఉన్నప్పుడే చేయాల్సిన శస్త్రచికిత్సలు ఇప్పుడు సాధారణ ప్రక్రియగా మారిపోయాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.పదేళ్లకాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 33,935 ప్రసవాలు జరిగాయి. అందులో 13,527 సాధారణ ప్రసవాలు, 20,408 సిజేరియన్ ప్రసవాలు నమోదయ్యాయి. మరోవైపు ప్రైవేట్ ఆసుప >>2

# పిడుగుల వానలు!

## బంగాళాఖాతంలో అల్పపీడనం

**విజయవాడ.ఆగస్టు7, ప్రభాతవార్తప్రతినిధి:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో 24 గంటల్లోపు అంటే శనివారం సాయంత్రానికి వాయువ్య బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీరప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో రానున్న రెండురోజులు రాష్ట్రంలో మేఘావృతమైన వాతావరణంతోపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శనివారం శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.శనివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం, విశాఖ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపిఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

8-8pg2exHMNWJQE_8-8pg2exHMNWJQE.qxd 08/Aug/26 12:13 AM Page 1



# త్వరలో బిసి చట్టం

>> సిఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంఅభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని, ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలని 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తి కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆదరణ ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాం. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మోడల్ సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కుఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూరు రూల్‌లో చేనేత,హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నం లో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సస్టెర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది" అని సిఎం చంద్రబాబు అన్నారు.

"బిసిలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బీసీల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బీసీలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేల సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లలో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్ని గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం. రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి- ఉపాధి కల్పించేలా పారిశ్రామిక వృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా గడచిన 2 ఏళ్లలో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లలో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

**మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం:** "చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.

అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పని తీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. చక్కగా పని చేసిన వారిని ప్రజలు అభినందించాలని సూచించారు. సంతృప్తికరంగా పని చేయని అధికారులు పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను సిఎం చంద్రబాబు సందర్శించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.




శుక్రవారం చేనేత దినోత్సవంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి సవిత

# రణస్థలానికి తోటపల్లి నీరు తెస్తా

>> ఎద్దడి, మద్దతు ధరల సమస్యలపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు మాట్లాడారు. మడ్డువలస కాలువ నీటిని బుడుమూరు చెరువుకు మళ్లించి పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. 50వేల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉన్న తోటపల్లి ప్రధాన, పిల్ల కాలువలను బాగు చేసి టైల్ ఎండ్ భూములకు నీరందిస్తామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.20వేలు అన్నదాత సుఖీభవ సకాలంలో ఖాతాల్లో జమ కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మొక్కజొన్న రైతులకు దళారుల దోపిడీ నుంచి విముక్తి కల్పించేలా ముందస్తు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**పప్పుధాన్యాలు ఎంత పండిస్తే అంత కొంటాం:** కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. వరికి ప్రత్యామ్నాయంగా కందులు, మినుములు ఎంత మేర పండిస్తే అంత ఉత్పత్తిని కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రాగులు వంటి చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని, రాష్ట్రంలో రైతులు పండించే రాగులను ప్రభుత్వమే సేకరించి పంపిణీ చేస్తుందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రతి పొలానికి వెళ్లి రైతులకు ప్రత్యామ్నాయ సాగుపై చైతన్యం తీసుకురావాలని స్పష్టం చేశారు.

**నవధాన్యాల సాగుతో భూసారం పెంచుకుందాం:** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వాతావరణ మార్పులను తట్టుకుని రైతులకు నిలకడైన రాబడి అందించేందుకు నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. హెక్టారుకు కేవలం రూ.600 విత్తన వ్యయంతో భూసారాన్ని పెంచుకోవచ్చని, సీఆర్‌పీల ద్వారా విత్తన పెల్లెటైజేషన్‌పై క్షేత్రస్థాయిలోనే శిక్షణ ఇప్పిస్తామన్నారు. నవధాన్యాల వల్ల యూరియా వాడకం తగ్గుతుందని, ప్రతికూల వాతావరణంలోనూ రైతులకు కనీస ఆదాయం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' కింద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అంతకుముందు మంత్రి అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని పంట పొలంలో నాట్లు వేసిన వరి పొలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఇతర అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## మెడికో ప్రియాంకను కారుతో ఢీకొట్టిన కేసు

# ఇద్దరు నిందితుల అరెస్టు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు7,ప్రభాతవార్త:** వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన కేసులో అరెస్టు చేసిన ఇరువురు నిందితులను పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారిద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించారు. ఈమేరకు రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్ సిఐ బాజీ లాల్ తెలిపారు. ఈనెల మూడో తేదీన ప్రసాదిత్య మాల్ వద్ద జరిగిన కారు ప్రమాద ఘటనలో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ విద్యార్థి మలి వెంకట దుర్గా సాయి ఉమేష్ హాస్పిటల్ స్టేట్మెంట్ ప్రకారం అలాగే ప్రసాదిత్య మాల్ మేనేజర్ విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితుడు సురావరపు ద స్వంత మద్యం మత్తులో కారును నిర్లక్ష్యంగా నడిపి స్కూటర్ను వెనకనుంచి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి మెయిన్ రోడ్డు పై బలంగా గుద్దడంతో ప్రియాంక అక్కడికక్కడే రోడ్డుపై పడిపోయి తీవ్రగాయాలు పాలయ్యింది. ఉమేష్ కూడా గాయాలు కావడంతో వారి ఇద్దరిని స్వతంత్ర హాస్పిటల్ లో జాయిన్ చేశారు. ప్రియాంక పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. ఆమెకు హైదరాబాద్ లోనే వైద్యం అందిస్తున్నారు. ఈ కేసులో సురావరపు దస్వంత్, ఆంద్రు జోసెఫ్ ఆడ్ వర్డ్స్ లపై ప్రకాష్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రియాంక, ఉమేష్ ఇద్దరు స్నేహితులు. ఇద్దరు సోమవారం ప్రసాదిత్య మాలలో మొదట షో సినిమా చూసి వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. రాజమహేంద్రవరంలో వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఏలూరు రేంజ్ డిఐజితో మాట్లాడి ప్రమాద ఘటనను సీరియస్ గా తీసుకోవాలన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థులు ప్రియాంక ,ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ ప్రమాద ఘటనపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ గా తీసుకున్నారు. ప్రియాంకకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా

# ప్రధాని మోడీకి మంగళగిరి చేనేత వస్త్ర బహూకరణ

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్, సానా సతీష్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేష్ తదితర ప్రముఖులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మన సాంప్రదాయ చేనేత కళాకారుల శ్రమను, నైపుణ్యాన్ని అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్‌కే తలమానికమైన, అలాగే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ప్రసిద్ధ చేనేత వస్త్రాన్ని వారు ప్రధాని మోడీకి అందించారు.ఆయనను మంగళగిరి చేనేత దుశ్శాలువాతో సత్కరించారు.ఇక కూటమికి చెందిన ఎంపీలందరికి ప్రధాని నరేంద్ర మోడీ ఆత్మీయ అతిధ్యం ఇచ్చారు. జనసేన,టీడీపీ,బిజెపి ఎంపీలతో కలిసి ఆయన విందులో పాల్గొన్నారు.



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని చేనేత వస్త్రాలతో సత్కరిస్తున్న టిడిపి, జనసేన ఎంపీలు

# జంతర్‌మంతర్‌ను 'బందీ'ని చేయొద్దు

>> షన్‌పై విచారణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ, శాంతిభద్రతలు తమ పరిధిలోకి వస్తాయి కాబట్టి ఈ విషయంపై ఢిల్లీ పోలీసులే నిర్ణయం తీసుకుంటారని కోర్టు పేర్కొంది. ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ (ఎఐడిసిఆర్‌పిసి) దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారిస్తోంది. ఈ కమిటీ తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ ఘోస్ వాదించారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన కోసం గుమిగూడనున్న 75 మంది వ్యక్తుల బృందం కోసం అనుమతి కోరుతున్నామని, ఈ అనుమతి దరఖాస్తుపై ఢిల్లీ పోలీసులు నిర్ణయం తీసుకోవాలని మాత్రమే తాను అభ్యర్థిస్తున్నానని ఘోస్ సమర్పించారు. "నగరాన్ని బందీగా పెట్టవద్దు. ఈ విషయంపై పోలీసులను నిర్ణయం తీసుకోనివ్వండి" అని జస్టిస్ మహాజన్ వ్యాఖ్యానించారు.

తాను ప్రజాస్వామ్య నిరసనలకు వ్యతిరేకం కాదని, వాటి వల్ల సాధారణ ప్రజా జీవనం స్తంభించకూడదనే అంశాన్నే ప్రస్తావిస్తున్నానని జస్టిస్ మహాజన్ చెప్పారు. షాహీన్‌బాగ్ కేసులో సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కును గుర్తించిందని సంజయ్ ఘోష్ గుర్తు చేయగా.. 'అవును.. కానీ నగరాన్ని బందీగా మార్చకూడదు కదా' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అనంతరం ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ దాఖలు చేసిన నిరసన అనుమతి దరఖాస్తుపై ఆగస్టు 8లోగా నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

# సాయికృష్ణ కేసులో కొనసాగుతున్న కానిస్టేబుళ్ల విచారణ

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో కీలక నిందితులను గత మూడు రోజులుగా కస్టడీలో తీసుకుని విచారిస్తుంది. ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితులు బాబూరావు, సాంబయ్యలను కూడా సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా, చెప్పాల్సింది ఏమీ లేదని వారు తెలిపారు. అయినప్పటికి సిట్ వారిని ప్రశ్నించి,నిజాలు రాబట్టే ప్రయత్నం చేస్తుంది.ఇప్పటి వరకు హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నానిలను సిట్ విచారిస్తున్న క్రమంలో వారు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు సాంకేతిక కారణాలతో తిరస్కరించింది. కస్టడీలో నిందితులను విచారిస్తున్న సిట్ సాయికృష్ణ మృతదేహాన్ని ఏం చేశారనేది ప్రశ్నిస్తుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నానిలను కస్టడీలోకి తీసుకుని, "శవాన్ని ఏం చేశారు?" అనే ప్రధాన ప్రశ్నతో ఉక్కిరిబిక్కిరి చేసింది. విజయవాడ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఐజీ రవిప్రకాష్ పర్యవేక్షణలో సిట్ బృందం వీరిద్దరినీ వేర్వేరుగా విచారించింది. సాయికృష్ణను కోర్టులో ఎందుకు హాజరుపరచలేదని, స్టేషన్‌లోనే మరణించాడా? అనిప్రశ్నించగా, స్టేషన్‌కు తీసుకురావడం వరకే తమకు తెలుసని వారు బదులిచ్చారు.గంజాయి సరఫరాదారుల కోసం గుణదలకు వెళ్లినప్పటి టవర్ లొకేషన్ ఆధారాలను చూపించగా, ఒక నిందితుడు తనకు గుర్తులేదంటూ సమాధానాన్ని దాటవేశాడు. లాకప్‌లో గాయపడిన సాయికృష్ణకు చికిత్స అందించేందుకు ఆర్ఎంపీ డాక్టర్‌ను ఎవరు పిలిచారని అడగ్గా, ఇద్దరూ మౌనం వహించారు.

# డోలీల్లేని ఊళ్లు చూడాలి

>> ల్పంతో ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రణాళికలు ముందుకు తీసుకువెళ్తున్నారు.అటవీ అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా ఆయా జిల్లాల కలెక్టర్లు శాఖల మధ్య సమన్వయ బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రికార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ అనుమతుల ప్రక్రియ పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వర్షాల కారణంగా పనులకు ఆటంకాలు ఏర్పడిన ప్రాంతాలు మినహా, మిగిలిన అన్ని ప్రాంతాల్లో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను చేరువ చేయాలన్న బలమైన సంకల్పంతో ప్రధాన మంత్రి మోదీ సహకారంతో చేపట్టిన అడవితల్లి బాట పనుల్లో నాణ్యతా లోపాలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని తెలిపారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. క్రోచెట్ లేస్ కళాకారుల కష్టాలను తెలుసుకున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మసకబారిన వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు. వైద్య పరీక్షలు చేయించి వదిలేయకుండా, 141 మందికి కళ్లజోళ్లు సిద్ధం చేయించారు. గత నెల విజయవాడ వేదికగా ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ నిర్వహించిన హస్తకళా మహోత్సవ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన పవన్ కళ్యాణ్ కళాకారులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా పలువురు హస్తకళాకారులు తమ వృత్తిని ముందుకు తీసుకువెళ్లే క్రమంలో ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను ఉపముఖ్యమంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చారు. నరసాపురం నియోజకవర్గం పరిధిలోని పసలదీవికి చెందిన క్రోచెట్ లేస్ కళాకారిణి మహాలక్ష్మి తన ఆరోగ్య సమస్యను వివరించారు. చిన్న చిన్న నమూనాలను గంటల కొద్దీ చూస్తూ ఉండడం వల్ల చూపు మందగిస్తోందని, కంటి పరీక్షలు చేయించాలని కోరారు.అదే వేదికపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్లవారీగా హస్తకళాకారుల కోసం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో నరసాపురంలో క్రోచెట్ లేస్ కళాకారుల కోసం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 141 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు సూచించారు. ఆ 141 మందికి పవన్ కళ్యాణ్ కళ్లజోళ్లు ఏర్పాటు చేశారు.

**దేశంలోనే తొలిసారిగా హస్తకళలకు క్యూఆర్ కోడ్ వేసే ప్రక్రియకు లేపాక్షి సంస్థ శ్రీకారం:** ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా లేపాక్షి సంస్థ కార్యాచరణ చేపట్టింది. దేశంలోనే తొలిసారిగా హస్తకళలకు క్యూఆర్ కోడ్ వేసే ప్రక్రియకు లేపాక్షి సంస్థ శ్రీకారం చుట్టింది. కళ, ఉత్పత్తి వివరాలు ప్రతిపాదికన ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చారు. కొనుగోలుదారులు వస్తువుపై ఉన్న కోడ్‌ను మొబైల్‌తో స్కాన్ చేస్తే ఆ కళాఖండానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు. ఆ వస్తువు చరిత్ర, సాంస్కృతిక విశిష్టత, తయారు చేసిన కళాకారుడి పేరు, వారి నైపుణ్యం, తయారు చేయడానికి వారు పడిన కష్టం, ఉపయోగించిన ముడిసరుకు, తయారీకి పట్టిన సమయం, వస్తువు కొలతలు వంటి వివరాలతోపాటు, దానికి భౌగోళిక గుర్తింపు లేదా ఒక జిల్లా-ఒక ఉత్పత్తి గుర్తింపు ఉందా అనే వివరాలు వస్తాయి.

# ఆడపిల్లలపై దాష్టీకానికి పాల్పడిన వారికి అదే చివరి రోజు: సిఎం చంద్రబాబు

## రాజమహేంద్రవరం ఘటనలో నిందితులపై చర్యలు

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆడపిల్లలపై దాష్టీకానికి పాల్పడిన వారికి అదే చివరి రోజు అనే విషయం గుర్తుంచుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. రాజమహేంద్రవరంలో మెడికోలను వాహనంతో ఢీ కొట్టిన ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఈ ఘటనపై అధికారుల సమీక్షలో ఆయన ఆరా తీశారు. బాధిత మెడికోలు ప్రియాంక, ఉమేష్ ఆరోగ్య పరిస్థితిని ఉన్నతాధికారులను అడిగి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారు. మెడికోలు తీవ్రంగా గాయపడడం బాధాకరమని అన్నారు. ఈ ఘటన జరిగిన తీరును సీఎంకు అధికారులు వివరించారు. మద్యం మత్తులో ఇద్దరు మెడికోలను కారుతో ఢీ కొట్టి అనంతరం పరారయ్యారని చెప్పారు.నిందితులను వెంటనే అరెస్ట్ చేశామని సీఎంకు అధికారులు తెలిపారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ వద్దని వారికి సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మెడికో ప్రియాంక ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. బుధవారం రాత్రి రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్య మాల్‌కు ఇద్దరు యువకులు బాగా తాగి వెళ్లారు. వీరి పరిస్థితిని చూసిన మాల్ సిబ్బంది బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి.. వారిని మాల్‌లోకి అనుమతించలేదు. దాంతో మాల్ సిబ్బందిపై వారు కోపంతో రగిలిపోయారు. కారును వేగంగా పోనిచ్చారు. సరిగ్గా అదే సమయంలో గేటు ముందు నుంచి వెళ్తున్న స్కూటీని కారుతో బలంగా ఢీకొట్టారు. ఓవర్ స్పీడ్‌తో స్కూటీనీ మళ్లీ ఢీకొట్టారు. దాంతో స్కూటీ వెనుక ఉన్న మెడికో కింద పడిపోయింది. దీంతో ఆమెకు తీవ్రంగా గాయపడింది.మూడోసారి అదే స్పీడ్‌తో ఆమె తలపై నుంచి కారు పోనిస్తూ ముందుకెళ్లారు. దాంతో ఆమె బ్రెయిన్ డెడ్ అయింది. ప్రస్తుతం ఐసీయూలో ఆమె చికిత్స పొందుతుంది. ఇక స్కూటీ నడిపిన ఆమె స్నేహితుడు ఉమేష్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు.. రాజమండ్రి సమీపంలోని నామవరానికి చెందిన వారిని పోలీసులు చెప్పారు. బ్రెయిన్ డెడ్ అయిన ప్రియాంక.. రాజమండ్రిలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో పీజీ చదువుతోంది. ప్రియాంకకు మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు.ఘటన కారకులపై అసహనం వ్యక్తం చేసారు.నిందితుల ప్రవర్తనావళిపై పూర్తి ఆరా తీసుకోవాలన్నారు.వారిపై కఠిన శిక్షలతో కేసు నమోదు చేయాలన్నారు.

## విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు రాజీనామా

**విజయవాడ.ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** విజయా డైరీ ఛైర్మన్ పదవికి చలసాని ఆంజనేయులు రాజీనామా చేసారు. టీడీపీ అధిష్టానం సూచన మేరకు ఆంజనేయులు రాజీనామా చేశారు. కృష్ణ మిల్క్ యూనియన్‌కు టైటిల్ డీడ్ కల్పించాలన్న ఆంజనేయులు సూచనకు అధిష్టానం సానుకూలంగా స్పందించింది. ఛైర్మన్ ఎన్నిక ఆలోచించి చేద్దామన్న తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం సూచనలు బేఖాతరు చేస్తూ చలసాని నామినేషన్ దాఖలుచేశారు. ఈ నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ ఆయనను పార్టీ ఆదేశించింది. దీనిని ఆయన ధిక్కరించారు. ఈ నేపథ్యంలో పార్టీ కావాలో? పదవి కావాలో? తెల్చుకోవాలనంటూ చలసాని ఆంజనేయులకు అధిష్ఠానం తేల్చి చెప్పింది. తనకు కొంత సమయం ఇస్తే నిర్ణయం చెబుతానని అధిష్ఠానానికి తెలిపారు. సమయం ఇవ్వడం కుదరదంటూ చలసాని ఆంజనేయులకు అధిష్ఠానం స్పష్టం చేసింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు పార్టీకి ఆయన తెలియజేశారు. అనంతరం ఆసుపత్రిలో చేరినట్లు పార్టీ అధిష్ఠానానికి ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయ డెయిరీ డైరెక్టర్లతో మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి సమావేశమయ్యారు.చలసానితో వారు మాట్లాడారు.చలసానికి నచ్చ చెప్పిన మీదట ఆయన రాజీనామా చేసారు.

# కొరడా తీస్తా

>> తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇసుక సరఫరా వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నెల రోజుల్లోగా పరిస్థితి మారకపోతే నేను స్వయంగా ఇసుక క్వారీల వద్దకు వచ్చి కూర్చుంటాను, అక్రమాలను సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు సభలో విశేష ప్రాధాన్యతను సంతరించుకోగా, అక్రమ ఇసుక తవ్వకాల నియంత్రణపై ప్రభుత్వం కఠిన వైఖరితో ముందుకు సాగుతుందనే సంకేతాలను ఇచ్చాయి. ఈ కార్యక్రమంలో చేనేత మంత్రి సవిత, జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా అధికార యంత్రాంగం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బెయిలు తిరస్కృతి

>> వాదనలు వినిపించగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు నిమిత్తం 6వ తేదికి ఈ కేసును వాయిదా వేయగా 6వ తేదిన పి.పి వాదనలు వినిపించగా 7వ తేదీకి ఆర్డర్ కోసం వాయిదా వేశారు. సొంపేటకోర్టు వారు 7వ తేదిన మాజీ మంత్రి అప్పలరాజు బెయిల్ పిటీషన్ న్యాయవాది వాదనలపై సొంపేట కోర్టు న్యాయమూర్తి సంతృప్తి చెందక పోవడంతో బెయిల్ పిటిషన్ తిరస్కరించినట్లు తెలిసింది. రోడ్డు ప్రమాదానికి కారకుడు మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడు అరవ్ వర్మ, ఆయన స్నేహితుడు సిద్దార్థ త్యాడీలను ఇటీవల కోర్టు బెయిల్ మంజూరు చేయగా, మాజీ మంత్రి అప్పలరాజుకు మాత్రం కోర్టు బెయిల్ తిరస్కరించినట్లు తెలుస్తోంది.

# కారు బోల్తా: కర్ణాటక భక్తుని మృతి

>> కర్ణాటక బెంగళూరు బన్నేరుగట్ట రోడ్ గోట్టిగేరికి చెందిన నలుగురు కుటుంబసభ్యులతో డాక్టర్ సతీష్‌కుమార్ (70) ఇద్దరు పిల్లలతో శుక్రవారం ఉదయం శ్రీవారిదర్శనానికి తిరుమలకు వచ్చారు. దర్శనం ముగించుకుని సాయంత్రం తిరుగుప్రయాణమయ్యారు. తిరుపతికి దిగే మొదటిఘాట్‌లో 22వ మలుపు వద్ద కారు అదుపుతప్పి పిట్టగోడను ఢీకొంది. ఆ వెంటనే పక్కనే ఉన్నసుమారు 20అడుగుల లోతులో పడిపోయింది. ఈ సంఘటనతో కారులో ఉన్న డాక్టర్ సతీశ్‌కుమార్ కుమారుడు సాయి శ్రీనివాస్, కుమార్తె సింధుఉడత్, మనవరాళ్లు తియా, నైరాలకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరగడంతో ఘాట్‌లో రెండుకిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయి ట్రాఫిక్‌స్తంభించింది. సమాచారమందుకున్న అలిపిరి విజిలెన్స్ ఏవిఎస్ఒ రమేశ్ కృష్ణ, తిరుమల ట్రాఫిక్ పోలీసులు చేరుకున్నారు. క్షతగాత్రులను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. కారు 20అడుగుల లోతులో పడటంతో భక్తులు భయంతో వణికిపోయారు. సతీశ్ పరిస్థితి విష మంగా ఉండటంతో స్విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## వారం - వర్జ్యం

08-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.దశమి మ.1.57 న.రోహిణి సా.4.49
వ.1. ఉ.9.26-ఉ.10.54
వ.2. రా.9.55-రా.11.23
దు.తె.5.49-ఉ.7.28
రాహు.ఉ.9.00-ఉ.10.30,
శుభ ఉ.7.00-8.00

## వార్తాఫలం

**మేషం :** ఎంతో కాలముగా వాయిదా పడుతున్న విషయములు పరిష్కారమవుతాయి. వస్తు కొనుగోలు.

**వృషభం :** విద్యా వాణిజ్య రంగములలో, ఆర్థిక విషయాలలో ప్రోత్సాహకర వాతావరణము సమకూరుతుంది.

**మిథునం :** విరాళములు, చందాలు, ఋణాలు, పన్నులు వీటి విషయాలలో ఒత్తిడి రావచ్చు. ప్రయాణాలు లాభిస్తాయి.

**కర్కాటకం :** అతిథి మర్యాదలకు అధిక ఖర్చులు చేస్తారు. సన్నిహితుల నుండి రహస్య సమాచారము అందుకుంటారు.

**సింహం :** మీ కార్యక్రమములకు, సంతానము యొక్క అభివృద్ధికి ఆటంకములను కల్పించే యత్నములు జరుగును.

**కన్య :** ముఖ్యముగా మీ ప్రతిష్టను దెబ్బతీసే యత్నములు అధికము కావచ్చును. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**తుల :** ఆత్మీయులు, శ్రేయోభిలాషులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటా బయటా అనుకూలము.

**వృశ్చికం :** ప్రయోజనములు తాత్కాలికముగా మీ చేతికి అందకపోయినా ఉనికికి మాత్రము ముప్పు లేదు.

**ధనుస్సు :** ఋణ సంబంధమైన చికాకులు తీరతాయి. కోర్ట్ వ్యవహారములు మీకే అనుకూలము. కాంట్రాక్ట్‌లు లభిస్తాయి.

**మకరం :** బంధువులకు సంబంధించిన కొన్ని వ్యవహారములను పర్యవేక్షించవలసి వస్తుంది. ఇంటా బయటా అనుకూలం.

**కుంభం :** గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు అనుకూలించవు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మీనం :** మీతో విభేదించి సోదర వర్గీయుల నుండి, సన్నిహితుల నుండి వినూత్న రీతిలో రాజీ యత్నములు వస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నేతన్నలకు సిఎం చేనేత దినోత్సవ శుభాకాంక్షలు



**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** నేతన్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యుత్ రాయితీలు, 50యేళ్లకే పింఛన్ అందిస్తూ నేతన్నలకు దన్నుగా ఉన్నామని చెప్పారు. 71,536 చేనేత కుటుంబాలకు 'నేతన్న సేవలో' ద్వారా సాయం చేస్తున్నామని తెలిపారు. ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున రూ.179 కోట్లు అందిస్తున్నామన్నారు. అంతా చేతులు కలుపుదాం, చేనేత కళను కాపాడుదామని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## చేనేతను ఆదరిద్దాం, అండగా నిలుద్దాం



**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** చేనేతను ఆదరిద్దాం, అండగా నిలుద్దామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు నిచ్చారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకుందామని అన్నారు. ప్రతి భారతీయుడు చేనేతను దైనందిన జీవితంలో భాగం చేసుకుని నేతన్నలకు అండగా నిలవాలని 'ఎక్స్' వేదికగా కోరారు. ప్రధాని మోడీ వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తితో జాతీయ చేనేత దినోత్సవ సంకల్పమని అన్నారు. చేనేత కేవలం వృత్తి కాదని, మన సంస్కృతి, వారసత్వ సంపదలో అంతర్భాగమని తెలిపారు. చేనేతను కాపాడటమంటే మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమేనని పవన్ అన్నారు. చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. మన చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తెస్తామన్నారు. చేనేత కళాకారులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి చేనేత వస్త్రం మన సంస్కృతికి, చేతిపనితనానికి, స్వావలంబన స్ఫూర్తికి ప్రతిరూపమని పేర్కొన్న ఆయన, చేనేతను ఎంచుకోవడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయవచ్చని చెప్పారు. చేనేత రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం తనకు గర్వకారణమని వెల్లడించారు. ఎన్‌డియే ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉచిత విద్యుత్‌తో పాటు రూ.25వేలు ఆర్థిక సాయం అందించే 'నేతన్న సేవలో' పథకం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ యువత, కంటెంట్ క్రియేటర్లు చేనేత దుస్తులు ధరించి వీడియోలతో ప్రచారం కల్పించాలన్నారు.

## సామాజిక సంస్కర్త లక్ష్మణస్వామి వర్మకు నివాళి



**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు నివాళి అర్పించారు. లక్ష్మణస్వామి వర్మ గొప్ప సామాజిక సంస్కర్తగా, ఆయుర్వేద వైద్యునిగా విశేష సేవలందించారని సిఎం కొనియాడారు. అగ్నికుల క్షత్రియ సమాజానికి గుర్తింపు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ఎంతో ప్రశంసనీయమన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర ఉత్సవంగా గర్వంగా నిర్వహించుకుంటున్నామని సిఎం తెలిపారు.

**ఉపముఖ్యమంత్రి పవన్ నివాళి:** పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు. ఈ వేడుకను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో ఆత్మగౌరవం కోసం పోరాడిన ఇలాంటి మహనీయులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. గొప్ప సామాజిక సంస్కర్తగా, ఆయుర్వేద వైద్యుడిగా లక్ష్మణస్వామి వర్మ చేసిన విశేష సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని పవన్ గుర్తుచేశారు.

**తాడేపల్లిలో మంత్రి సవిత...:** అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతి సందర్భంగా మంత్రి సవిత తాడేపల్లిలో నివాళి అర్పించారు. ఆయన పేదల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆయుర్వేద వైద్య రంగంలో 120 రకాల మూలికా ఔషధాలు తయారు చేసి విదేశాలకు సరఫరా చేశారని గుర్తుచేశారు. 1927లో జీవో నెం.271 ద్వారా అగ్నికుల క్షత్రియులకు అధికారిక గుర్తింపు తెచ్చారని తెలిపారు. ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం సమాజానికి దక్కిన గౌరవమని మంత్రి సవిత చెప్పారు.

## కృష్ణా జిల్లాలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. జిల్లా పరిధిలోని వేర్వేరు పట్టణాల్లోని విద్యాసంస్థల హాస్టళ్లలో ఇద్దరు యువతులు అనుమానస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి వీరు బలన్మరణాలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. కంకిపాడు శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీలో విద్యార్థిని భాగ్యశ్రీ(18) హాస్టల్ గదిలో ఫ్యాన్ కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నది. భాగ్యశ్రీది నందిగామ మండలం ఐతవరం గ్రామం. ఈమె హాస్టల్ గదిలో ఉరి వేసుకుని మృతి చెందినట్లు విద్యాసంస్థ నిర్వాహకులకు పోలీసులకు సమాచారమిచ్చారు. దాంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి కంకిపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**గుడివాడ హోమియో కళాశాలలో..:** గుడివాడ పట్టణంలోని గురురాజు ప్రభుత్వ హోమియో మెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గుడివాడ హోమియో కళాశాల విద్యార్థిని లక్ష్మీ తులసి ఆత్మహత్య చేసుకుంది. ప్రైవేట్ హాస్టల్ రూమ్‌లో ఉంటూ చదువుతున్న విద్యార్థిని ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో హాస్టల్ నిర్వహకులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. లక్ష్మీ తులసి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని గుడివాడ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి గుడివాడ వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నరసాపురంకి చెందిన లక్ష్మీ తులసి బంధువులకు సమాచారం విద్యార్థులు అందించారు.

## డిఎస్సీపై అసత్య ప్రచారాలను నమ్మొద్దు

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా
- అక్టోబరులో మరో నోటిఫికేషన్ విడుదల చేస్తాం

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీ 2025 నిర్వహణపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలు, ఆరోపణలను అభ్యర్థులు ఎవరూ నమ్మవద్దని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఇప్పటికే డిఎస్సీ ప్రక్రియపై ప్రభుత్వ ఉన్నతాధికారులు మూడుసార్లు స్పష్టమైన వివరణ ఇచ్చినప్పటికీ, ఇంకా దుష్ప్రచారం సాగుతుండటంతో మరోసారి క్లారిటీ ఇస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న సంతోషి పార్వతి, వీవీవీ భాస్కర్ రెడ్డి అనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగిందని వివరించారు. జోన్1 ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో 2 ఖాళీలు ఉండగా, హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనల మేరకే అర్హులైన అభ్యర్థికి కేటాయించామని, కడపకు చెందిన భాస్కర్ రెడ్డికి 68వ ర్యాంకురాగా, మొత్తం 8 ఖాళీల్లో చివరి పోస్టు హారిజాంటల్ రిజర్వేషన్ కింద నిజూలీ అభ్యర్థికి దక్కిందని కేస్ స్టడీలతో సహా వెల్లడించారు. డిఎస్సీ 2025ని అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు మొత్తం 12 రకాల భద్రతా విధానాలను అనుసరించామని కమిషనర్ తెలిపారు. ప్రైవసీ, టాంపర్ ప్రూఫ్ భద్రతా వ్యవస్థలోనే ప్రశ్నాపత్రాల రూపకల్పన ప్రక్రియ జరిగిందని స్పష్టం చేశారు.

**అత్యంత పారదర్శకంగా స్పోర్ట్స్ కోటా కింద అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** మెగా డిఎస్సీ 2025 నిర్వహణలో భాగంగా స్పోర్ట్స్ కోటా కింద చేపట్టిన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని శాప్) మేనేజింగ్ డైరెక్టర్ భరణి స్పష్టం చేశారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో కూలంకషంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాను రూపొందించామని ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో పిజారి ఇస్మాయిల్ భాషా, అన్వర్ భాషా అనే అభ్యర్థుల జూడో క్రీడా సర్టిఫికెట్లు నకిలీవంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఆ సర్టిఫికెట్లు ఆంధ్రప్రదేశ్ జూడో ఫెడరేషన్ ద్వారా అధికారిక గుర్తింపు పొందినవేనని, దీనిపై సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేయడం తప్ప గ్రీవెన్స్ ద్వారా ఎవరూ నేరుగా ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

**ఆ ఆడియో టేప్‌లపై ఇప్పటికే క్రిమినల్ కేసులు:** కొన్ని క్రీడా సంఘాలు తమ అంతర్గత విభేదాలతో ఒకరిపై ఒకరు చేసుకుంటున్న ఆరోపణలను కూడా డీఎస్సీ ఎంపిక ప్రక్రియకు ఆపాదిస్తూ అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని ఎండీ ఆవేదన వ్యక్తం చేశారు. అసత్యాలు, పుకార్లతో ప్రచారంలోకి తెచ్చిన కొన్ని ఆడియో టేప్‌లపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు వేగవంతం చేశామని హెచ్చరించారు. డిఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అనర్హులకు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఇప్పటికైనా ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తే, అటువంటి పత్రాలు జారీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎండీ భరణి స్పష్టం చేసారు.

## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం

- క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవం సందర్భంగా సభా కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే ప్రభుత్వ ఆలోచన అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేసారు. క్రీడలు, మానసిక, శారీరకంగా ఆరోగ్యానికి హేతువులన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పికిల్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఈ లీగ్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, పికిల్‌బాల్ వంటి నూతన క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ రంగంలో రాణిస్తున్న వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పిస్తుంది. క్రీడాభివృద్ధికి శాప్ ఛైర్మన్ రవినాయుడు చేస్తున్న కృషిని అభినందించారు. క్రీడాకారులకు సహకారం అందిస్తున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లకు రాంప్రసాద్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, సినీహీరో సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ

- మహనీయులను గౌరవించడం సంస్కృతిలో భాగం
- మంత్రి నాదెండ్ల మనోహర్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** సమాజంలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకోవడం, వారికి గౌరవం అందించడం మన సంస్కృతిలో భాగమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. అగ్నికుల క్షత్రియుల జాతిపితగా పిలవబడే పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ 157 వ జయంతి వేడుకలను కోరంగిలో బొడ్డు సత్యనారాయణ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 144 ద్వారా శుక్రవారం అధికారికంగా నిర్వహించింది. ఈ మేరకు కళ్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ, విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ కాంస్య విగ్రహాలను మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ నాగబాబు ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ మూల పురుషుల స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని, సమాజ సేవకుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యతని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అగ్నికుల క్షత్రియులకు, వేటసాగించే సోదరులకు పూర్తి రక్షణ, ఆర్థిక బాసట కల్పిస్తున్నామని, యువత సోషల్ మీడియా ఉచ్చులో పడ కుండాబాధ్యతాయుతంగా నడుచు కోవాలన్నారు. కోరంగి ప్రాంతంలో సత్యలింగం నాయకర్, లక్ష్మణ స్వామి వర్మ విగ్రహాలను ఆవిష్కరించడం ద్వారా భావి తరాలకు వారి స్ఫూర్తిని అందించే అవకాశం లభించిందనన్నారు. సత్యలింగం నాయకర్ దాతగా, సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలిచి చేసిన సేవలు చిరస్మరణీయమైన వననన్నారు. యువత సోషల్ మీడియా దుష్ప్రచారాలకు, స్వార్థ రాజకీయ శక్తుల కుట్రలకు లోను కాకుండా, మహనీయుల చరిత్రను అవగాహన చేసుకుని విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలన్నారు. జనసేన ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు మాట్లాడుతూ తన జాతి ఆత్మగౌరవాన్ని, భారత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ గారని కొనియాడారు. ఆనాటి సమాజంలో అవమానాలు ఎదుర్కొంటున్న తన జాతి గుర్తింపు కోసం పూర్వీకుల చారిత్రక ఆధారాలను బ్రిటిష్ పాలకులకు అందించి, వారిని ఒప్పించి అగ్నికుల క్షత్రియులుగా గుర్తింపు సాధించారని తెలిపారు. సమాజానికి, ప్రజలకు ఆస్తులు, చదువులను విద్యాదానంగా అందించిన మహనీయులు కీర్తిశేషులు మల్లాడి సత్యలింగ నాయకర్ సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం జిల్లా అధ్యక్షులు వైదాడి నూకరాజు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, బీసీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్, నాగిడి నాగేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి ్మ, కర్రి పద్మశ్రీ, మల్లాడి రాజేంద్ర, వాడ్రేవు వీరబాబు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ

- అగ్నికుల క్షత్రియుల చరిత్రను చాటిచెప్పిన మహనీయుడు
- ఆయుర్వేదంతో వేలాది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన గొప్పవ్యక్తి
- మంత్రి కొల్లు రవీంద్ర




**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాసేవకు అంకితమైన జీవితంతో సేవా కార్యక్రమాల ద్వారా మన్ననలు పొందిన పొన్నమండ. లక్ష్మణస్వామివర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అగ్నికుల క్షత్రియ జాతిపిత స్వర్గీయ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, అగ్నికుల క్షత్రియ, బిసి సంఘాల నాయకులు తదితరులతో కలిసి పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. అగ్నికుల క్షత్రియుల చరిత్రను భావితరాలకు చాటిచెప్పిన మహనీయుడు లక్ష్మణ స్వామి వర్మ అని, ఆయన ఆయుర్వేదంతో వేలాది మంది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలు, సేవలను స్మరించుకోవడంతో పాటు, వారు చూపిన స్ఫూర్తిదాయకమైన మార్గంలో నడవడం ద్వారా సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాం ప్రసాద్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, బిసి సంఘ నాయకులు సంగేపు రంగారావు తదితరులతో పాటు జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఇ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులు సందర్శించే హక్కు వైసిపికి లేదు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ స్థితిగతులను మార్చే గొప్ప ప్రయత్నాలు గత రెండు సంవత్సరాల కాలంగా నిర్విరామంగా జరుగుతుంటే ఓర్వలేని వైసిపి నాయకులు ప్రాజెక్టుల సందర్శన యాత్రల పేరుతో సరికొత్త రాజకీయ నాటకాలకు తెరలేపారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'గొడ్డలి పార్టీ నాయకుల విధానం వాళ్ళు ఏ పనీ చేయరు, చేసేవాళ్లను చూస్తే కడుపుమంట. చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమ ప్రాజెక్టులకు ఒక కొత్త కళ వచ్చింది. 2014 19 మధ్యకాలంలో దాదాపు రూ.68 వేల కోట్లు సాగునీరు, అనుబంధ రంగాల కోసం ఖర్చు చేస్తే, ఒక్క రాయలసీమ ప్రాజెక్టులకే రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టాం. ఐదేళ్ల జగన్‌మోహన్ రెడ్డికి అధికారం ఇస్తే, రాయలసీమ బిడ్డనని నమ్మించి, రాయలసీమ భవిష్యత్తును నాశనం చేశాడు. ఆ ప్రాంత ప్రజల పాలిట నయవంచకుడిగా మిగిలిపోయారు. మేము 2014 -19లో రూ.12,500 కోట్లు ఖర్చు పెడితే, 2019-24 మధ్య జగన్ రెడ్డి కేవలం రూ.2,000 కోట్లే. దాంట్లో కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు అత్యంత ప్రధానమైన హంద్రీనీవా కోసం కనీసం రూ.500 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. తాము అధికారంలోకి వచ్చాక ఒకే సంవత్సరంలో రూ.3,870 కోట్లు ఒక్క హంద్రీ నీవా ప్రాజెక్టు పైనే ఖర్చు చేశాం. ఈ రెండేళ్ల కాలంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం ఏకంగా రూ.12,484 కోట్లు ఖర్చు చేశాం. రాయలసీమ చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయంగా మిగిలిపోతుంది. అలాంటి చంద్రబాబు నాయుడుపై ఈరోజు అవాకులు, చవాకులు పేలుతూ పనిలేనోళ్లంతా కలిసి ప్రాజెక్టులను సందర్శిస్తున్నారు. ఒక పనికిమాలిన బృందంగా వైసిపి నాయకులను ప్రజలు చూస్తున్నారు. ప్రాజెక్టులు సందర్శించే హక్కు మీకు ఎక్కడ ఉంది? మీరేమైనా ప్రాజెక్టులు కట్టారా? మీ హయాంలో ప్రాజెక్టుల గురించి అసలు మాట్లాడారా? ఆరోజు జగన్ రెడ్డిని ఇదే రాయలసీమ ఎమ్మెల్యేలు, ఎంపీలు, వైసీపీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదు' అని కాలవ శ్రీనివాసులు నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు అడగని వాళ్లు, అభ్యర్థించని వాళ్లు... ఈరోజు తగుదునమ్మా అంటూ రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన పేరుతో పనికిమాలిన బ్యాచ్ అంతా వెళ్లి ప్రజలకు అసత్యాలు చెప్పే ప్రయత్నం చేస్తే మిమ్మల్ని ఎట్లా నమ్ముతారు? అని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల సందర్శన యాత్రలు పెట్టడం అంటే ఆత్మహత్య సదృశ్యమైన చర్య తప్ప మరొకటి కాదన్నారు.

## మహిళా బిల్లుతో డీలిమిటేషన్ ముడిపెట్టొద్దు

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళా బిల్లుతో డీలిమిటేషన్ ముడిపెట్టొద్దని, వాటిని విడదీసి మహిళా బిల్లు విడిగా పెడితే ఆమోదించేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఈ రెండిటినీ కలిపి పెట్టడం ద్వారా ప్రతిపక్షాలు మహిళా బిల్లును అడ్డుకుంటున్నాయనే తప్పుడు ప్రచారం చేసేందుకు, బిజెపి దీన్ని ఉపయోగించుకునే ప్రయత్నాలు చేస్తోందనీ అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేసారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ముందుకు వస్తున్నారని, వాటిని విడదీసి ప్రవేశపెట్టాలని అన్నారు. మహిళా బిల్లును పెడితే ఆమోదించేందుకు అందరూ సిద్ధమేనని తెలిపారు. డీలిమిటేషన్‌పై ఏకాభిప్రాయం లేదని, ప్రతిపక్ష పార్టీలతోనూ సంప్రదించలేదని తెలిపారు.

అనిశ్చితిలో ఉన్న అంశాన్ని తీసుకొచ్చి మహిళా బిల్లును ఆమోదించకుండా చేసి ప్రతిపక్షాలపై నెపం నెట్టాలనే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. పైగా ఆపరేషన్ లోటస్‌లో భాగంగా ప్రతిపక్ష పార్టీలను చీల్చి తమవైపు తిప్పుకునే ప్రయత్నాలూ చేస్తున్నారని అన్నారు. బిల్లు విషయంలో కేంద్ర ప్రతిపక్షాలతో చర్చించిన అనంతరమే ముందుకు వెళ్లాలని అన్నారు. ఇక కుల నిర్మూలన, మార్క్సిస్టు దృక్పథంపై పుస్తకాన్ని బి.వి. రాఘవులు, వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

## క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శులు కె.రామకృష్ణ, రామకృష్ణ పాండా

**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** క్యూబాలో 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశంలో పాల్గొనేందుకు వెళుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శులు కె. రామకృష్ణ, రామకృష్ణ పాండాలను ఢిల్లీలో క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ అగ్యిలేరా క్యూబా రాయబార కార్యాలయ ప్రథమ కార్యదర్శి లూపే ఫ్రొమెటా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా భారత్- క్యూబా మధ్య చిరకాలంగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు, పరస్పర సహకారం, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ శాంతి, సంఘీభావ ఉద్యమాలు తదితర అంశాలపై చర్చించారు. క్యూబా ప్రజలతో భారత ప్రజలకు, ముఖ్యంగా భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఉన్న చారిత్రక స్నేహబంధాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శులు గుర్తు చేసుకున్నారు. భారత్- క్యూబా ప్రజల మధ్య మైత్రి, సంఘీభావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. క్యూబా విప్లవ చారిత్రక నాయకుడు ఫిడెల్ క్యాస్ట్రో విప్లవ వారసత్వాన్ని పరిరక్షించడం, సోషలిస్టు క్యూబాకు అంతర్జాతీయ సంఘీభావాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రపంచ శాంతి కోసం ఉమ్మడి కార్యాచరణను విస్తరించడం, సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ఐక్యతను పటిష్టం చేయడం ప్రధాన లక్ష్యాలుగా శుక్ర, శనివారాలు రెండు రోజులు హవానాలో 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశం జరుగుతుందని రామకృష్ణ తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో దేశాల సార్వభౌమాధికారం, స్వాతంత్రం, ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని పరిరక్షించేందుకు కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల మధ్య ఐక్యత, సంఘీభావం, పరస్పర సహకారం మరింత అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అసమానతలు, దోపిడీ, యుద్ధ ప్రమాదాలు, తీవ్ర మితవాదం, ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేసేందుకు హవానా సమావేశం దోహదపడుతుందని అన్నారు. క్యూబాపై అమెరికా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక, వాణిజ్య, ఆర్థిక వ్యవహారాలు, ఇంధన రంగానికి సంబంధించిన ఆంక్షలపై కూడా ఈ అంతర్జాతీయ సమావేశంలో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని కె. రామకృష్ణ తెలిపారు. క్యూబాపై ఆంక్షలను ఎత్తివేయడంతో పాటు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల జాబితా నుంచి క్యూబాను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితి పై కేంద్రం స్పందించాలి

## - లోక్‌సభలో నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి




**విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితిపై కేంద్రం స్పందించాలని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి లోక్‌సభలో డిమాండ్ చేసారు. తీవ్రమైన ఎల్ నినో పరిస్థితుల ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర కరువు నెలకొందనీ. జూన్‌లో 25శాతం వర్షపాతం లోటు నమోదవ్వగా, జులైలో ఇప్పటివరకు ఈ లోటు 40శాతం దాటిందని. ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ రుతుపవనాల వర్షకాలం సుమారు 27శాతం మొత్తం లోటుతో ముగిసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల అనేక జిల్లాల్లో విస్తృతమైన, తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, భారతదేశానికి వరి ధాన్యాగారంగా కూడా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖరీఫ్ పంటల చక్రంపై ఇది తీవ్ర ప్రభావం చూపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ఇవ్వడానికి చేయగలిగినంత ఉత్తమంగా కృషి చేస్తోందని. తీవ్ర కరవును ఎదుర్కొనే అవకాశం ఉన్న 105కు పైగా మండలాలను, మోస్తరు కరువును ఎదుర్కొనే అవకాశం ఉన్న మరో 208 మండలాలను గుర్తించిందన్నారు. విపత్తులకు ముందు ముందస్తు ప్రణాళిక, సమన్వయ ప్రతిస్పందన, సకాలంలో ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణాలను, జీవనోపాధులను కాపాడాలని ఎల్లప్పుడూ విశ్వసించే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డిఆర్‌ఎఫ్) కింద సుమారు రూ.479.01 కోట్లు విడుదల చేయగా, దీర్ఘకాలిక విపత్తు నివారణ ప్రాజెక్టుల కోసం రూ.521.17 కోట్లు కేటాయించిందన్నారు. ఇతర రాష్ట్రాలు కరువుతో పోరాడుతున్నప్పుడు, మా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత కరవును తగ్గించడంలో సహాయపడిందని. ఆయన తన దీర్ఘకాలిక దార్శనికతతో రాయలసీమ ప్రాంతాన్ని రత్నాలసీమగా మార్చిన నాయకుడనీ, వైఎస్సార్‌సిపి పాలనలో 2019 నుండి 2024 మధ్య రాష్ట్రంలోని అన్ని కీలక నీటిపారుదల ప్రాజెక్టులు, డ్యామ్‌లు నిర్లక్ష్యానికి గురయ్యాయనీ. దీనివల్ల మా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, 2029 నాటికి రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చి, స్వర్ణాంధ్రను నిర్మించాలన్న మన దార్శనికతను సాకారం చేసేందుకు, 36 ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 35,000 కోట్లు ఖర్చు చేయనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం చేయగలిగినంత ఉత్తమంగా చేస్తోందని వివరించారు. 'కరవు పరిస్థితిని ఎదుర్కోవడానికి పూర్తి మద్దతు ఇవ్వాలని తాము కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాము. భూగర్భ జలాల పునరుజ్జీవనం, కరవును తట్టుకునే పంటలకు సాంకేతిక మద్దతు, 'ప్రతి బొట్టుకు ఎక్కువ పంట' కార్యక్రమాన్ని విస్తరించడం, వర్షపు నీటి సేకరణ కేంద్రాల నిర్మాణం కోసం మనం కలిసి దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకోవాలనీ, వ్యవసాయ రంగంలోని ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానాలలో రైతులకు శిక్షణ ఇవ్వాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాం' అని ఎంపి శబరి అన్నారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రతికూల ప్రభావాన్ని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి, రైతులకు మరోసారి మద్దతు ఇవ్వాలని తాము కోరుతున్నామనీ నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు.

## తిరుపతిలో ప్రారంభమైన క్రెడాయ్ ఎక్స్‌పో

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో క్రెడాయ్ తిరుపతి ప్రాపర్టీ ఎక్స్‌పో -2026 మొదలైంది. శుక్రవారం ఉదయం ఈ ఎక్స్‌పోను ఎమ్మెల్యే శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే డాక్టర్ భాను ప్రకాష్, టిటిడి బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి, క్రెడాయ్ ఎపి ఛైర్మన్ బి. శ్రీనివాస్, క్రెడాయ్ తిరుపతి ఛైర్మన్ కె. గోపీనాథ్, క్రెడాయ్ తిరుపతి అధ్యక్షుడు ఎం. రామ్‌ప్రసాద్ రావు, కార్యదర్శి రాజేశ్‌బాబు క్రియాశీలక నేతృత్వం వహించారు. వేదికపై ఎస్వీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన సరితా రెడ్డి, వసుంధర కన్‌స్ట్రక్షన్‌కు చెందిన బిమల్ కుమార్ కేడియా, ఎండి సతీష్ బాబు, ఎస్‌బిఐ డిజిఎం సతీష్ బాబు, ఇండియన్ బ్యాంక్ డిజిఎం హేమ మాలతి, కెనరా బ్యాంక్ జిఎం పి. చక్రవర్తి, క్రెడాయ్ సభ్యులు, స్పాన్సర్లు, బ్యాంకర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రాపర్టీ ఎక్స్‌పోను నిర్వహించిన క్రెడాయ్ తిరుపతి నిర్వాహకులను ప్రముఖులు అభినందించారు. నాణ్యమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, గృహ రుణ అవకాశాలను ప్రదర్శిస్తున్న ఈ మూడు రోజుల ప్రదర్శనను ప్రజలు సందర్శించాలని ప్రోత్సహించారు.



8-8pg4_8-8pg4.qxd 07/Aug/26 10:34 PM Page 1



వార్త


అవమానించేవాడు ఇసుకపై రాతలాగా వెంటనే దాన్ని విస్మరిస్తాడు. అవమానానికి గురైన వాడు ఇత్తడిపై చెక్కిన రాతలాగా ఎన్నటికీ మరిచిపోలేడు.

న- ఆస్కార్‌వైల్డ్

# బోఫోర్స్'కు చరమగీతం!


బోఫోర్స్ దేశ రాజకీయాలను ఒక్క ఊపు ఊపిన వ్యవహారం. ఆ కథ కంచికెళ్లి చాలా రోజులైంది. కథలు ఎక్కడ పుట్టి ఎక్కడ తిరిగి సంచలనం చేసినా అవి కంచికే చేరుతాయని ప్రతీతి. కానీ 'బోఫోర్స్' కథ మాత్రం చిట్టచివరికి సుప్రీంకోర్టుకు చేరితే తప్ప అంతిమ సంస్కారం జరుగలేదు. అప్పట్లో బోఫోర్స్ కుంభకోణ మంటూ ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీని ఇరుకున పెట్టే తీవ్ర ప్రయత్నమే జరిగింది. 1986 మార్చిలో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఆయుధాల తయారీ సంస్థ ఎబి బోఫోర్స్ సంస్థతో రూ.1437కోట్ల విలువైన 410-155 హోలిట్జర్ గన్ కొనుగోలు ఒప్పందం చేసుకోగా, దానికోసం 1987లో ఈ ఒప్పంద ప్రక్రియలో అక్రమ కమిషన్‌లు స్వీకరించారని ప్రతిపక్షాలు ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీపై తీవ్రఆరోపణలు చేశాయి. ఆ సమయంలో కేంద్ర రక్షణశాఖ మంత్రిగా ఉండడమే ఆయన చేసిన పాపం. భారతదేశ రాజకీయ చరిత్రలో బోఫోర్స్ కుంభకోణం చాలా కాలం జనం నోళ్లల్లో నానింది. ఇప్పటికీ ఆ పేరెత్తగానే చర్చ మొదలైపోతుంది. అదే విపక్షాలకు అధికారపక్షంపై విమర్శలు చేసేందుకు ఆటవస్తువుగా మారింది. మధ్యవర్తుల ప్రమేయం లేని ఆయుధ వ్యాపార ఒప్పందాలకు బదులు స్వీడన్‌సంస్థ తన వ్యాపారాభివృద్ధి కోసం భారతీయ రాజకీయ నేతలు, రక్షణశాఖ అధికారులు, మధ్యవర్తులకు మొత్తం రూ. 64 కోట్ల మేరకు ముడుపులు ముట్ట చెప్పిందని ఆరోపణను ఏప్రిల్ 1987లో స్వీడిష్ రేడియో ఒక నివేదికను ప్రముఖంగా ప్రసారం చేయడమే ఈ ఆరోపణలకు ఆయువుపట్టు. అందుకే బోఫోర్స్ ఒప్పందంలో లంచాలసంస్కృతి మొదలైందనో అపోహలు, అనుమానాలతో చాలాకాలం బోఫోర్స్ అంశం పత్రికల విభిన్న కథనాలు, విపక్షాల ఆరోపణలతో సాగతీతకు గురైంది. ఈ అంశంపై దాఖలైన అవినీతి కేసులన్నీ 2005లోనే ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. రాజీవ్ గాంధీని ఈ కేసు నుండి విముక్తుడిని చేసింది. ఆ తర్వాత సిబిఐ అప్పీల్ కూడా 2018 తిరస్కరించారు. అయినా బోఫోర్స్ అంశంలో ఎంతో దూకుడుగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై చెలరేగిన ఆరోపణలు నిన్నమొన్నటి వరకు హల్‌చల్ చేస్తూనే ఉన్నాయి. నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఇదొక చర్చనీయాంశంగా ఊగిసలాడింది. సరిగా బుధవారం సుప్రీంకోర్టులో విచారణకొచ్చిన చిట్టచివరి కేసుకు తెరపడింది. ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాల్ చేసే తుది పిటిషన్‌గా పేర్కొంటూ ఇకపై ఆరోపణల్లేక, కేసుల్లేక వాయిదాల్లేక అంటూ జస్టిస్ జెబి పార్థీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన అన్ని ప్రక్రియలూ పూర్తిగా ముగిసినట్లుగా సుప్రీం ధర్మాసనం పేకప్ చెప్పేసింది. ఇకపై ఎలాంటి వాదనలు వినేందుకు ధర్మాసనం నిరాకరించింది. రక్షణ ఆయుధాల కొనుగోళ్లపై విషయంలో బోఫోర్స్‌పై ఉన్నసందేహాలు, కమిషన్లు స్వీకరించారని ఆరోపణలకు గురైన వారి అందరికీ సంబంధిత విషయాలపై కూలంకషంగా సిబిఐ దర్యాప్తుచేసింది. హిందుజా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజాలతోపాటు స్వీడన్‌కు చెందిన ఆయుధాల తయారీ సంస్థ ఎబి బోఫోర్స్ కంపెనీపై ఉన్న అన్నికేసులనూ ఢిల్లీ హైకోర్టుకొట్టేసింది. సిబిఐ దర్యాప్తు తీరుసరిగాలేదని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది కూడా. దాంతో ఇక బోఫోర్స్ ఆరోపణలకు అంతిమ యాత్రేనని భావించారు. కానీ భారతీయ చట్టాల్లో ఉన్నఅన్ని అవకాశాలన్నీ వాడుకుని వివాదాన్ని ఎన్నటికీ మూసివేయకుండా సజీవంగా ఉంచాలనే ప్రయత్నం జరిగింది. ఢిల్లీ హైకోర్టుతీర్పుపై 4522రోజులు ఆలస్యంగా సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలైంది. దానికిప్పుడు సుప్రీంకోర్టు చరమగీతంపాడింది. ఇక బోఫోర్స్, ఆరోపణలు వినిపించవు. కనిపించవు. 2018లోనూ హైకోర్టులో అప్పీల్ తిరస్కరణకు గురైంది. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఈఅంశానికి పిటీషన్లు, పైపిటిషన్లుండవని వాదనలు ముగించడం ఆహ్వానించదగిన విషయం. అప్పట్లో ఎన్నోసార్లు బోఫోర్స్ కుంభకోణమంటూ విపక్షాల చర్చ పార్లమెంటు ఉభయసభలను స్తంభింపచేసిన పరిస్థితులుండేవి. ఈఅంశం పేరిట రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడమే ప్రధానలక్ష్యంగా పార్టీలు ఎక్కువగా శ్రమించాయనే చెప్పాలి. ఈ వివాద ప్రస్తావన, విస్మృతి కారణంగానే 1989 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైందన్న విశ్లేషణలు జరిగాయి. రాజకీయాల్లో ఆరోపణలు వేరు. వాస్తవ సాక్ష్యాలతో కోర్టుల్లో నిరూపితమవడం వేరు. అందుకే అవి కుంభకోణాలుగా మిగిలిపోతుంటాయి. రాజకీయాలున్నంత వరకు ఇలాంటి ఆరోపణలకు జనం నోళ్లనుంచి విశ్లేషణలు వస్తూనే ఉంటాయి. విదేశీ ఆధారాల సేకరణలో జాప్యం తగిన నిబద్ధత కలిగిన సాక్ష్యాలు లేకపోవడం, నిందితుల మరణం కారణాలతో కేసుబలహీనపడింది. బోఫోర్స్ అవినీతి కుంభకోణంలో వాస్తవమెంత? సందేహాల లోతెంతవంటి అంశాలు ఇప్పటికే తేలనట్లే!. బోఫోర్స్ కేసులను సుప్రీంకోర్టున్యాయపరంగా తెరదించిందేతప్ప నిజానిజాలపై ఎలాంటి తీర్మానం చేసినట్లు కాదనుకోవాలి. ఎన్నికల రాజకీయాల్లో అవినీతి ప్రస్తావనల్లో, దర్యాప్తు సంస్థ వైఫల్యాలపై చర్చించుకున్నప్పుడల్లా ఈఅంశం సజీవంగానే ఉంటుంది. సుప్రీం ఈ కేసును మూసివేసిందంటే దానికర్థం కేసును ఇకపై కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని తెలియచెప్పడమే. సాధారణంగా అంతర్జాతీయ ఆర్థిక లావాదేవాలు, విదేశీ సాక్ష్యాల సేకరణ, విచారణ ప్రక్రియలో సుదీర్ఘకాలం తీసుకోవడంతో తీర్పువేగం పరిమితమైపోతుంది. నాలుగు దశాబ్దాల సాగతీతలో ఎలాంటి పరిణామాలుంటాయో తెలుసుకోవడానికి ఈ కేసు ఓ ప్రబల నిదర్శనం.

ఇచ్చింది మరిచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకముంచుకోవడమే స్నేహం.



మహాత్మా గాంధీ

ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా ఎప్పటికీ ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.



గౌతమబుద్ధుడు

## ప్రజావాక్కు

### ప్రకృతి అభివృద్ధి సమన్వయమే శాశ్వత పునాది

భారత్‌వేగంగా అభివృద్ధి చెందుతోంది. జాతీయ రహదారులు, రైల్వే కారిడార్లు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కులు, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ దేశ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. అయితే ఈ ప్రగతి ప్రకృతి వనరుల సంరక్షణతో సమన్వయంగా సాగితేనే దీర్ఘకాలికఫలితాలు లభిస్తాయి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ పరస్పర విరుద్ధాలు కావు. సరైన విధానాలతో ఒకదానికొకటి బలాన్ని చేకూర్చగలవు. 1987లో బ్రంట్‌లాండ్ కమిషన్ నివేదిక ఆధారంగా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన సుస్థిర అభివృద్ధి భావన ప్రపంచ విధానాలకు దిశానిర్దేశం చేసింది. భావితరాల అవసరాలను దెబ్బతీయకుండా నేటి అవసరాలను తీర్చేఅభివృద్ధినే నిజమైన ప్రగతిగా నిర్వచించింది. భారత అటవీ సర్వేప్రకారం దేశంలోఅటవీ, వృక్ష సంపదకలిపి8.27 లక్షల చ.కి.మీ., అంటే దేశ భౌగోళిక విస్తీర్ణంలో 25.17 శాతం ఉంది. ప్రకృతి-అభివృద్ధిసమన్వయమే ఆర్థికవృద్ధికి, పర్యావరణ భద్రత కు, సుస్థిర భారత నిర్మాణానికి శాశ్వత పునాది.

- సి,సాయిరుత్విక్, శ్రీకాకుళం

### ప్రజలకు చేరువుగా..

భారత్ ఇప్పుడు సరికొత్త ఆలోచన దిశగా ప్రయాణం చేస్తున్నది. ప్రపంచానికి ఒక కొత్త దారిని చూపుతోంది. ఆ యువ ఉద్యమనాయకుడు సరికొత్త నినాదంతో బయలుదేరాబోతున్నాడు. ప్రజల దగ్గరికివెళ్లే ఉద్దేశంతో ప్రజల మనసులో ఏముందో తెలుసుకోవడానికి ప్రజల సమస్యలు దగ్గరగా వినడానికి ప్రజలదగ్గరికి వెళ్ళబోతున్నారు. ఇదిమంచినిర్ణయమే కాకస్ఫూర్తి వంతమైనాఅదుగుకూడా. ప్రతి నాయకుడు ఎప్పుడు గొప్ప నాయకుడు అవుతాడు అంటే ప్రజలకు చెరువుగా వెళ్ళినప్పుడు. ప్రజలకు మంచి చేయాలి అంటే రాజకీయ నాయకులే కానవసరం లేదు ప్రభుత్వాలపైన ఒత్తిడి తెచ్చి ప్రజలకు మంచి చేయొచ్చు.

- భారత అవినాష్, జనగాం

### సోషల్ మీడియా తగ్గించాలి

ఇటీవలి కాలంలో చిన్న పిల్లలు సోషల్ మీడియా వాడకం విపరీతంగాపెరగడంతో పిల్లలఆరోగ్యం దెబ్బతినడంతో పాటు భవిష్యత్ జీవితంలో ఇబ్బందులు పడే అవకాశంఉంది. కావున తల్లిదండ్రులు పిల్లలతో వీలైనంత ఎక్కువ సమయం గడపాలి. వీలైనంత వరకు దూరంగా ఉంచడమే మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### అసెంబ్లీ సమావేశాలలో భూ ఆక్రమణపై చర్చ!

చంద్ర బాబుగారు ప్రభుత్వ భూములు అక్రమిస్తే జైలే గతి అన్నాడు. పవన్ కళ్యాణ్ గారు అటవీ భూములు ఆక్రమిస్తే తాట తీస్తానన్నాడు. ఇద్దరి ప్రకటనలు నిలబెట్టుకునే విధంగా, నిరూపించుకునే విధంగా రాష్ట్రంలో దొంగబాబాలు ఆక్రమించిన ప్రభుత్వభూములను స్వాధీనంచేసుకొని , జైలుకు పంపడం, తాట తీయడం జరగాలంటే అసెంబ్లీలో దొంగబాబాల భూఆక్రమణల మీద చర్చ జరగాలి. ఏజిల్లాలో ఎ బాబా ఎన్ని ఎకరాలు ఆక్రమించాడు, స్వాధీనం చేసుకోలేక పోవటానికి కారణాలు ఏమిటి? ప్రభుత్వం ఎక్కడ వైఫల్యం చెందింది? ఎవరైనా అడ్డుపడుతున్నారా? అలా అడ్డుపడే వారి మీద చర్యలు స్పష్టంగా జరగాలి. సుప్రీం కోర్టు ప్రభుత్వభూముల్లో మతపరమైన చిహ్నాలు ,బొమ్మలు , మందిరాలు ఉండకూడదని చాలాసార్లు రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. సుప్రీం తీర్పును అమలు పరచే విధంగా చర్యలు చేపట్టాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నవరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్ నగర్ ఎస్టీ సైనిక్ స్కూల్, కరీనగర్ జిల్లా రుక్మాపూర్ ఎస్సి సైనిక్‌స్కూల్ ఈ2 సైనిక్ స్కూల్‌లలో డిప్యూటేషన్‌లను రద్దు చేయాలి. ఇక్కడ 700 మంది కి పైగా విద్యార్థులున్నారు. అడ్మినిస్ట్రేషన్ పరంగా ఇద్దరు టీచింగ్ సిబ్బంది అవసరం. జనరల్ నాలెడ్జి, పోటీ పరీక్షలు, ఉద్యోగం నోటిఫికేషన్‌ల గురించి తెలియజేయడం కోసం అదనంగా ఇద్దరు టీచింగ్ సిబ్బంది అవసరం. ఇక్కడ పనిచేసేవారిని ఇతర చోట్లకు డిప్యూటేషన్లు రద్దుచేసి సైనిక్ స్కూల్‌లలో సేవలందించే విధంగా కృషి చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లోరోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదా రులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు ప్రమాదకరంగా దెబ్బతిన్నరోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపి వాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా తగుచర్యలు తీసుకోవాలి. గ్రామాల్లోనేకాకుండా నగరాల్లో కూడారోడ్లను బాగు చేయాలి.

-టి. యోగేందర్, నల్గొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఇకనైనా ఈ చావులను ఆపలేమా?

మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా ఆదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇకపోతే పోలీసుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష అన్నట్లు తమ మామూళ్లు తమకు వస్తే చాలన్నట్లు కొన్ని ప్రాంతాల్లో వ్యవహరిస్తున్నారు. ఇక లోపభూయిష్టమైన రోడ్ల నిర్మాణాలకు కారకులైన కాంట్రాక్టర్లను, ఇంజినీర్లను ప్రమాదాలకు బాధ్యులుగా చేసి కటకటలావెనక్కి నెట్టాలి. మొత్తం మీద నీచేతన్, నాచేతన్ వరమడిగిన కుంతి చేతన్...అన్నట్టు అందరూ ఈ చావులకు బాధ్యులే. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాలు తీసిన వాహనచోదకులకు కఠిన జైలు శిక్షతోపాటు మళ్లీ జీవిత కాలంలో వాహనం నడపడానికి వీలు లేకుండా చట్టాన్ని సవరించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు చేపట్టాలి. అంతేకానీ సమీక్షలు, సమావేశాలు, పత్రికా ప్రకటనలతో కాలం గడిపితే ఈ మారణహోమం ఆగదు.

దామెర్ల సాయిబాబ

యుద్ధానికి వెళుతున్న వీరుడు విజయమో, వీరస్వర్గమో అన్నట్టుగా కదనరంగంలో దూకుతాడు. అయితే యుద్ధంలో విజయం సాధించి తిరిగి రావడమో, లేక పోరులోఅమరుడు కావడమో జరుగుతుంది. అలా యుద్ధంలో అసువులు బాసినా దానికి ఒక లక్ష్యం, అర్థం, పరమార్థం ఉంటుంది. వీటన్నింటికి మించి దేశం కోసం ప్రాణత్యాగం చేశామనేమాటల కందని తృప్తి ఉంటుంది. మనదేశం కోసం యుద్ధంలో అసువులు బాసిన మన వీర జవానులను ఇప్పటికీ మననం చేసుకుంటూనే ఉంటాం. జోహార్లు అర్పిస్తూనే ఉంటాం. కానీ ఏలక్ష్యం లేదు. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు రోడ్డుప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ తాజా లెక్కల ప్రకారం గత యేడాది దేశవ్యాప్తంగా లక్షాఎనభై మూడువేల మందిని ఈ రోడ్డు ప్రమాదాలు కబళించాయి. అంతకుముందు యేడాది కంటే దాదాపు మూడున్నర శాతం ఎక్కువైనట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి వెలువడిన నివేదికను పరిశీలించినా ఈ విషయం స్పష్టమవుతున్నది. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో రోజుకు సగటున నాలుగువందల ఎనభైఐదు మందికిపైగా ప్రాణాలు కోల్పోతుండగా, 1292 మంది గాయపడినట్లు ఆ నివేదిక వెల్లడిస్తున్నది. ఇవన్నీ అధికారిక లెక్కలే. పోలీసు రికార్డుల్లోకి రాని, అందని మరణాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. ప్రమాదాల్లో చనిపోయేవారిలో అధికశాతం ఇరవై ఏళ్ల నుంచి ముప్పైఐదుయేళ్ల లోపువారే. ఈ ప్రమాదాల గూర్చి పాలకులకు తెలియంది కాదు. ప్రమాదాల్లో ప్రముఖులు ఎవరైనా చనిపోయినప్పుడు, పెద్ద ఎత్తున మరణాలు సంభవించినప్పుడు వీటిని నివారిస్తామని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పెద్ద పెద్ద ప్రకటనలు ఇవ్వడం, హడావుడి చేయడం, ఆ తర్వాత మరచిపోవడం సంప్రదాయంగా మారిపోయింది. ఇప్పుడేకాదు దశాబ్దాల తరబడి ఇదే తంతు జరుగుతున్నది. విజయవాడలో రోడ్డు ప్రమాదంలో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ముఖ్య కార్యదర్శి రాఘవేంద్ర రావు మరణించినప్పుడు దాదాపు అధికార యంత్రాంగం అంతా విజయవాడకు వెళ్లింది. సుదీర్ఘచర్చ జరిపారు. అప్పటికప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకునేందుకు అంకురార్పణ జరిగింది. రోడ్డు భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని మార్పులతో మరింత పటిష్టంగా పర్యవేక్షణ చేసేందుకు పోలీసు డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారిని ఆ విభాగానికి అధిపతిగా నియమించారు. ఆతర్వాత ఎన్నో మార్పులు, చేర్పులు జరిగాయి. అప్పటి నుంచి ఆ అధికారికి కార్యాలయానికి యేటాలక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండ్కు విభాగాలు ఏర్పడ్డాయి. కానీ ఆ రెండు విభాగాల అధిపతులను పని చేయనీయకుండా కేవలం సంతకం పెట్టివెళ్లే పరిస్థితి కల్పించి మూలన కూర్చోబెట్టి జీతభత్యాలు చెల్లిస్తున్నారు. తమకు నచ్చని, తమ మాట వినని అధికారులను పనిష్మెంట్‌లాగా ఈ పోస్టులో నియమిస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత సమర్థులుగా పేరు తెచ్చుకున్న కొందరు అధికారులను సైతం రాష్ట్రాల్లో ప్రభు త్వాలు మారినప్పుడు ఈ విభాగంలో అధిపతిగా పని లేకుండా కూర్చోబెట్టిన సందర్భాలు ఎన్నో

## ఒక్క మాట

ఉన్నాయి. ఇక కేంద్రస్థాయిలో కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల తీవ్రతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం2005లోనే కేబినెట్ సబ్ కమిటీ సూచన మేరకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిర్వహణ అంశంపై ఎస్.సుందర్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను సమగ్ర అధ్యయనం చేసిన కమిటీ 2007 ఫిబ్రవరిలో ఒక నివేదిక సమర్పించింది. ఎనభైశాతం ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం సేవించడం తదితర కారణాల వల్లనే జరుగుతున్నాయనేది ఆ కమిటీ నివేదికలో పేర్కొన్నది. అభివృద్ధికి సోపానాలుగా వర్ధిల్లాల్సిన రహదారులు వికలాంగమో, వీరస్వర్గమో అన్నట్లుగా దాపురిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితేరాబోయే దశాబ్దకాలంలో మరెన్ని లక్షల మంది అసువులు బాస్తారో? మరెన్ని కోట్ల మంది క్షతగాత్రులవుతారో?. తాజాగా మొన్న సోమవారం రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో ఇద్దరు యువకులు కారుతో ఢీకొట్టడంతో పోస్టుగ్రాడ్యుయేట్ చేస్తున్న మెడికో చావు బతుకుల మధ్య మృత్యువుతో పోరాడుతున్నది. మద్యం మైకంలో ఇద్దరు యువకులు సోమవారం రాత్రి మొదటిసినిమా అయిపోయిన తర్వాత రెండో సినిమా చూసేందుకు కారుతో స్పీడ్‌గా ఆవరణలోకి ప్రవేశించారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వారిపరిస్థితి చూసివెంటనే బయటకు వెళ్లమని హెచ్చరించడంతో కోపోద్రేకులైన ఆ యువకులువచ్చిన దానికంటే వేగంగా కారులో బయటకు వస్తున్న సమయంలో మొదటి సినిమా చూసి బయటకు వస్తున్న మెడికోలను ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ఎందుకు ఇలాచేశారని అడుగుతున్న దశలోనే అవేమీ పట్టించుకోకుండా అంతకంటే రెట్టింపు స్పీడ్‌తో వారిపైనుండికారును పోనివ్వడంతో మెడికో తలపై నుండి కారు టైర్ వెళ్లింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్సకోసం తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్లు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఆమెకు బ్రెయిన్ డెడ్‌అయినట్లు సమాచారం. ఇలాంటి సంఘటనలు మద్యంమత్తులో వాహన చోదకుల వల్ల ఎన్నో జరుగుతున్నాయి. భర్తలను కోల్పోయిన భార్యలను, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ఇలా ఒక్కరేమిటి గతపదేళ్లలో దేశంలో లక్షలాది కుటుంబాలు పడుతున్న మానసిక వేదనవర్ణనాతీతం. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన అభాగ్యులకు ఏమిచ్చినా, మాటలతో ఎంత ఊరట కలిగించినా ఆలోటును తీర్చలేం, పూడ్చలేం. తమ ఆప్తులను కడసారి చూడడానికి కూడా నోచుకోనివారెందరో ఉన్నారు. లక్షలాది మందిని పొట్టన పెట్టుకుంటున్న ఈ ప్రమాదాల నివారణకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగడం లేదేమోననిపిస్తున్నది. సమీక్షలు, సమావేశాలకు, అధ్యయనాలకు కొరత లేదు. ఎన్నో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రమాదా లకు మూలకారణాల గూర్చి ఇప్పటివరకు ఎన్నో అధ్యయన కమిటీలు నివేదికలు ఇచ్చాయి. ముఖ్యంగా మద్యం వాడకం పెరగడం కూడా ఈ ప్రమాదాలను పెంచుతున్నది. లైసెన్సు విధానంలో ఇంకా పటిష్టమైన మార్పులు అవసరం ఉంది. మద్యం ఆదాయాన్ని పెంచుకోవడంకోసం బెల్టుషాపుల పేరుతో ఎక్కడికక్కడ అనుమతులు ఇచ్చారు. రహదారుల వెంట ఉండే అధికార, అనధికార మద్యంషాపులు డ్రైవర్లనుమత్తులో ముంచుతున్నాయి. మితిమీరిన ఆల్కహాల్ తీసుకోవడం వల్ల ఏకాగ్రత లోపించి డ్రైవింగ్ అదుపు తప్పిపోతుందని డాక్టర్లు కూడా అభిప్రాయ పడుతున్నారు. మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించడంలేదు. గుర్తించినా ఆదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇకపోతే పోలీసుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష అన్నట్లు తమ మామూళ్లు తమకు వస్తేచాలన్నట్లు కొన్నిప్రాంతాల్లో వ్యవహరిస్తున్నారు. ఇక లోపభూయిష్టమైన రోడ్ల నిర్మాణాలకు కారకులైన కాంట్రాక్టర్లను, ఇంజినీర్లను ప్రమాదాలకు బాధ్యులుగా చేసి కటకటలావెనక్కి నెట్టాలి. మొత్తంమీద నీచేతన్, నాచేతన్ వరమడిగిన కుంతి చేతన్...అన్నట్టు అందరూ ఈ చావులకు బాధ్యులే. ఇప్పటికైనా పాలకులు కళ్లుతెరవాలి. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి. మద్యంమత్తులో వాహనంనడిపి ప్రాణాలు తీసిన వాహనచోదకులకు కఠిన జైలుశిక్షతోపాటు మళ్లీ జీవితకాలంలో వాహనం నడపడానికి వీలు లేకుండా చట్టాన్ని సవరించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు చేపట్టాలి. అంతేకానీ సమీక్షలు, సమావేశాలు, పత్రికా ప్రకటనలతో కాలం గడిపితే ఈ మారణహోమం ఆగదు. ●

# హరిత శక్తే వికసిత భారతానికి పునాది

సి.హెచ్.ప్రతాప్

భారతదేశ ఇంధన రంగంలో గత రెండు దశాబ్దాలుగా ఒక నిశ్శబ్ద విప్లవం చోటుచేసుకుంటోంది. ఒకప్పుడు బొగ్గు, చమురు, సహజ వాయువుపై ఆధారపడిన దేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుతున్న దేశాల్లో ఒకటిగా ఎదిగింది. భారతదేశంలో పునరుత్పాదక ఇంధన ప్రయాణం 1980ల లో ప్రారంభమైనప్పటికీ, 2010 తరువాత దీనికి నిజమైన వేగం లభించింది. 2015లో దేశంలో మొత్తం పునరుత్పా దక ఇంధన సామర్థ్యం సుమారు 38గిగావాట్లు మాత్రమే ఉండగా, 2020 నాటికి అది 87 గిగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం (జూన్ 2026 నాటికి) దేశంలో మొత్తం పునరు త్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యం 288.58 గిగావాట్లకు చేరింది. ఇందులో సౌరశక్తి ఒక్కటే 162.15 గిగావాట్లతో అగ్రస్థానంలో ఉండగా, పవన విద్యుత్, జలవిద్యుత్, బయో మాస్, చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులు మిగిలిన భాగాన్ని అందిస్తున్నాయి. ఈప్రగతికి ప్రధాన కారణం ప్రభుత్వ విధా నాలే. జాతీయ సౌర మిషన్, పీఎంకుసుమ్, గ్రీన్ ఎనర్జీ కారిడార్, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, సౌర ప్యానెళ్ల దేశీయ తయారీ, విద్యుత్ పంపిణీ సంస్కరణలు ఈ రంగానికి ఊతమిచ్చాయి. 2024లో ప్రారంభించినప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన హరిత ఇంధన రంగంలో మరోమైలురాయిగా నిలిచింది. రూ.75,021 కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ఒక కోటిగృహాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసి నెలకు 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా ఈపథకం కింద 50లక్షల గృహాలు రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. సుమారు 14.8 గిగా వాట్ల సామర్థ్యం ఇప్పటికే గ్రిడ్‌కుచేరగా, దాదాపు 19లక్షల కుటుంబాలు నెలవారీ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకున్నాయి. లేదా పూర్తిగా శూన్యబిల్లును పొందుతు న్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకం రెండో దశపై దృష్టి సారించింది. రూఫ్‌టాప్ సోలార్‌తో పాటుబ్యా టరీ నిల్వవ్యవస్థలు, గ్రామీణ ప్రాంతాల విస్తరణ, వికేంద్రీ కృత విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని పరిశీలిస్తోం ది. సౌరశక్తి పగటి వేళల్లో మాత్రమే లభించడంతో, బ్యాటరీ నిల్వవ్యవస్థలు భవిష్యత్ విద్యుత్‌భద్రతకు కీలకంగా మారనున్నాయి. అందుకే విద్యుత్ ప్రసార వ్యవస్థల విస్తరణ, శక్తి నిల్వ సామర్థ్యాల పెంపుతదుపరి దశలో అత్యంతప్రాధాన్య అంశాలుగా కేంద్రం గుర్తించింది. భారతదేశం 2030నాటికి 500గిగావాట్ల నాన్‌ఫాసిల్ విద్యుత్ సామర్థ్యం, మొత్తం విద్యుత్ అవసరాల్లో సగానికి పైగా స్వచ్ఛ ఇంధన వనరుల నుంచి సమకూర్చడం, అలాగే 2070 నాటికి నికర సున్నా కార్బన్ ఉద్గారాలు సాధించడం వంటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి సంవత్సరం భారీ స్థాయిలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు, విద్యుత్ నిల్వవ్యవస్థలు, గ్రీన్ హైడ్రోజన్‌ఉత్పత్తి, ప్రసార మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు అవసరం. హరిత ఇంధనం కేవలం పర్యావరణ పరిరక్షణకు మాత్రమే కాదు. అది ఇంధన స్వావలంబనకు, రైతుల ఆదాయపెంపునకు, కొత్తఉపాధి అవకాశాలకు, దిగుమతి చమురుపైఆధార

# ఎల్‌నినో..ఈ శతాబ్దపు అసలు సవాల్!

డి జె మోహన రావు

ప్రపంచం ఒకే జీవవ్యవస్థగా మారిపోయిన ఈ యుగంలో, మన అభివృద్ధి నమూనా ప్రకృతితో కలిసి నడవడానికి సిద్ధంగా ఉందా?' ఈ ప్రశ్నకు సమాధానం వెతకకుండా ఇరవై ఒకటవ శతాబ్దపు అభివృద్ధిని అర్థం చేసుకోవడం అసాధ్యం. మానవ నాగరికత ఎంతగానో ముందుకు దూసుకుపోతున్న ఈ తరుణంలో, ప్రకృతితో మన సంబంధం ఎలాంటిదనే మీమాంస ప్రతి ఒక్కరినీ కలవరపెడుతోంది. కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్ర జలాలు కొద్దిగా వేడెక్కుతాయి. దాని పేరు ఎల్‌నినో. కొన్ని వారాల తర్వాత భారతదేశంలో వర్షాలపై ఆందోళన మొదలవుతుంది. రైతు ఆకాశం వైపు చూస్తాడు. ప్రభుత్వం రుతుపవనాల అంచనాలను పరిశీలిస్తుంది. మార్కెట్ ఆహార ధరలను లెక్కిస్తుంది. రిజర్వు బ్యాంకు ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. ఒక సముద్రంలో ప్రారంభమైన ఉష్ణ మార్పు మరో ఖండంలోని కుటుంబ బడ్జెట్‌ను ఎలా ప్రభావితం చేస్తుంది? ఈ ప్రశ్నకు సమాధానం వెతికినప్పుడు మనం కేవలం ఎల్‌నినో గురించి మాత్రమేకాకుండా మనం నిర్మించుకున్న అభివృద్ధి నమూనా గురించి కూడా కొత్తగా ఆలోచించాల్సి వస్తుంది. ఇప్పటివరకు మనం ప్రపంచీకరణను పూర్తిగా మనుషులు సృష్టించిన వ్యవస్థగానే చూశాం. వస్తువులు దేశాలు దాటాయి, పెట్టుబడులుఖండాలు దాటాయి, సమాచారం క్షణాల్లో ప్రపంచాన్ని చుట్టివచ్చింది. ప్రపంచం ఒక గ్రామమైందని గర్వంగా చెప్పుకున్నాం. కానీ ప్రకృతి మనకంటే ముందే ప్రపంచాన్ని ఒకే జీవవ్యవస్థగా మలిచింది. గాలి సరిహద్దులను గుర్తించదు, సముద్ర ప్రవాహాలు వీసాలను అడగవు, మేఘాలు రాజకీయ పటాలను అనుసరించవు. ఒక మహాసముద్రంలో పుట్టిన ఉష్ణం మరో దేశంలో పంటను దెబ్బతీస్తే, ఒక అడవిలో జరిగిన విధ్వంసం మరో ఖండంలోని వర్షపాతాన్ని మార్చగలిగితే, ఒక దేశం విడుదల చేసిన కార్బన్ ప్రపంచ ఉష్ణోగ్రతనుపెంచితే, మనం ఇంకా 'స్థానిక సమస్యలు' అనే పదాన్ని ఉపయోగించడం ఎంతవరకు సమంజసం? అభివృద్ధి గురించి మన ఆలోచనల్లో ఒక మౌలిక లోపం ఉంది. ప్రకృతిని మనం ఎప్పుడూ ఒక నేపథ్యంగా మాత్రమే చూశాం. రహదారులు నిర్మించాం, ఆనకట్టలు కట్టాం, పరిశ్రమలు స్థాపించాం, నగరాలు విస్తరించాం. అభివృద్ధి అనేది ప్రకృతిపై మనిషి సాధించిన విజయమని గర్వంగా భావించాం. కానీ ప్రతి వాతావరణ సంక్షోభం ఆ భావనను ఒక్కొక్కటిగా కూల్చేస్తోంది. అభివృద్ధి ప్రకృతిని జయించడం కాదని, ప్రకృతిని విస్మరించి నిర్మించిన నిర్మాణం చివరికి తనకే భారమవుతుందని ఈ శతాబ్దం మనకు కఠినంగా నేర్పుతోంది. ఎల్‌నినో ఇక్కడ కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ప్రశ్న దాని కంటే చాలా పెద్దది. ప్రకృతివ్యవస్థల్లో ఏర్పడే చిన్న మార్పులను కూడా తట్టుకునేలా మన ఆర్థిక వ్యవస్థను మనం నిర్మించామా? ప్రపంచ వాతావరణ సంస్థ, వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వ నిపుణుల మండలి (ఐపిసిసి) దశాబ్దకాలంగా ఒకే విషయాన్ని హెచ్చరిస్తున్నాయి. వాతా



వరణ మార్పు అనేది భవిష్యత్తులో రాబోయే ప్రమాదం కాదు. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మిస్తున్న ఒక వాస్తవిక శక్తి అయినప్పటికీ ప్రపంచ దేశాల అభివృద్ధి ప్రణాళికల్లో వాతావరణాన్ని ఇప్పటికీ ఒకప్రత్యేక అధ్యాయంగా మాత్రమే చూస్తున్నాం. వాస్తవానికి అది ప్రతి ఆర్థిక, సామాజిక అధ్యాయంలో అంతర్భాగంగా ఉండాల్సినఅంశం. వ్యవసాయాన్ని, ఆహార వ్యవస్థను పరిశీలిస్తే ఈ నిజం మరింత స్పష్టమవుతుంది. వర్షాలు తగ్గితే పంటలు దెబ్బ తింటాయని మనకు తెలుసు. కానీ అసలు సమస్య కేవలం పంటల ఉత్పత్తి గురించి కాదు. సమగ్ర ఆహార వ్యవస్థ గురించినది. పొలంలో ప్రారంభమైన సంక్షోభం అక్కడితో ఆగదు. అది రైతు ఆదాయాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. రైతు కొనుగోలు శక్తి తగ్గడంతో గ్రామీణ మార్కెట్లు మందగిస్తాయి, ఆహార ధరలు విపరీతంగా పెరుగుతాయి. దానివల్ల ద్రవ్యోల్బణం ఎగబాకుతుంది. చివరకు రిజర్వ్ బ్యాంకు విధానం మారి, పెట్టుబడులపై తీవ్రప్రభావం పడుతుంది. అంటే ప్రకృతి ఒక రంగాన్ని మాత్రమే ప్రభావితం చేయదు. రంగాల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాలన్నింటినీ కుదిపేస్తుంది. నీటి కథ కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. మనం నీటిని కేవలం ఒక వనరుగా మాత్రమే చూస్తాం. కానీ ప్రకృతి దానిని ఒక నిరంతర చక్రంగా చూస్తుంది. వర్షం, నది, భూగర్భ జలం, అడవి, నేల, సముద్రం ఇవి ఏవీ విడివిడిగా పనిచేయవు. కానీ మన అధికారిక ప్రణాళికల్లో మాత్రం ఇవి వేర్వేరు ప్రభుత్వశాఖల బాధ్యతలుగా ఉండిపోతున్నాయి. ఫలితంగా ఒకచోట వినాశకరమైన వరదలు, మరోచోట తీవ్రమైన కరవు, ఇంకొకచోట తాగునీటి సంక్షోభం ఒకేసారి కనిపిస్తాయి. సమస్య నీటి కొరతలో మాత్రమే లేదు. ప్రకృతి ఒక సమగ్ర వ్యవస్థగా పనిచేస్తుంటే, మన పరిపాలన విభాగాలుగా విడిపోయి ఆలోచించడంలోనే అసలు లోపం ఉంది. ఆర్థిక వ్యవస్థ విషయంలోనూ ఇదే సత్యం. స్థూల దేశీయోత్పత్తి వృద్ధిని మనం విజయానికి ఏకైక కొలమానంగా భావిస్తాం. కానీ ఆ వృద్ధి ఏ పునాదిపై నిలబడి ఉంది? తీవ్రమైన ఉష్ణతరంగాలు కార్మికుల ఉత్పాదకతను పూర్తిగా తగ్గిస్తే, తీవ్రమైన నీటి కొరత పరిశ్రమలను మూసివేసేలా చేస్తే, సముద్ర ఉష్ణోగ్రతలు మత్స్య సంపదను సర్వనాశనం చేస్తే ఆర్థిక వృద్ధి ప్రకృతికి స్వతంత్రంగా ఎలా కొనసాగగలదు? ఇరవై ఒకటవ శతాబ్దంలో అత్యంత ప్రమాదకరమైన భ్రమ ఏమిటంటే ఆధునిక సాంకేతికత ప్రకృతిని పూర్తిగా అధిగమించిందనే అహేతుక నమ్మకం. కృత్రిమ మేధస్సు అద్భుతాలు సృష్టిస్తోంది, ఉపగ్రహాలు అంతరిక్షాన్ని నింపేశాయి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచాన్ని మార్చేసింది. అయినప్పటికీ కొన్ని డిగ్రీల సముద్ర ఉష్ణోగ్రత మార్పు ప్రపంచ ఆహార ధరలను తల్ల డిల్లజేస్తోంది. అంటే సాంకేతికత ప్రకృతిని ఎప్పటికీ భర్తీ చేయలేదు. ప్రకృతిపై మన ఆధారపడటాన్ని అది మరింత స్పష్టంగా, తీవ్రంగా కనిపించేలా చేసింది. ఈ నేపథ్యంలో అభివృద్ధికి సరికొత్త నిర్వచనం అవసరం. గత శతాబ్దంలో అభివృద్ధి అంటే ప్రకృతి నుంచి వీలైనంత ఎక్కువ వనరులు సేకరించడం. కానీ ఈ శతాబ్దంలో అభివృద్ధి అంటే ప్రకృతి వ్యవస్థలను దెబ్బతీయకుండా సమాజాన్ని స్థిరంగా ముం దుకు నడిపించడం. గతంలో ఆర్థిక వృద్ధి మాత్రమే ప్రధాన లక్ష్యంగా ఉండేది. కానీ ఇప్పుడు సుస్థిరత లేకుండా ఏవృద్ధి కూడా నిలవదని అందరికీ అర్థమవుతోంది. గతంలో ప్రకృతి కేవలం ఒక వనరు మాత్రమే. కానీ ఇప్పుడు ప్రకృతి ఒక భాగస్వామి అని గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది. అందువల్ల భవిష్యత్తులో మనం వేయవలసిన ప్రశ్న 'మనం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాం?'అనేది కాదు. 'మన అభివృద్ధి ఎంతకాలం నిలబడగలదు?' అనేదే. ●

MN 5 PAGE-GNT :MN 5 PAGE-GNT 01/01/2001 09:04 Page 1



గుంటూరు వార్త



# ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు,ఆగస్టు 7,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని వాసవి వాసవి కన్యకాపరమేశ్వరి మండపంలో శుక్రవారం అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే నసీర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి



నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ఆలయాల అభివృద్ధికి పక్కా ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వెంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. అన్ని ఆలయాలకు కమిటీల నియమించామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయాల్లో పూజలు, వైదిక కైంకర్యాల నిర్వహణలో రాజకీయ, అధికారుల జోక్యాన్ని తగ్గించి, అర్చకులకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేలకుపైగా ఆలయాల పునర్నిర్మాణం, మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారన్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాల కాలనీలు మరియు టిడ్కో నివాస ప్రాంతాలలో వేలాది భజన మందిరాల నిర్మాణాన్ని చేపడుతున్నారని తెలిపారు.

**ఉచిత వైద్య సేవలు అభినందనీయం**

పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక పాత గుంటూరులోని శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో టీడీపీ నేతలు యల్లావుల అశోక్, తిరుమలశెట్టి మోహన్ రావు సహకారంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యులు వాణి, పీయూష, సాయి ప్రవల్లిక, సుదీష్ణ నిరీష పేదలకు వైద్య సేవలందించారు. పరీక్షల అనంతరం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు.

# నూతన పార్లమెంట్ సభ్యులతో ప్రధాని భేటీ..



**గుంటూరు విద్య ఆగస్టు 7 ప్రభాతవార్త :** పార్లమెంట్ సమావేశాలకు ముందు జరిగిన అల్పాహార విందులో నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం భేటీ అయ్యారు. తెలుగు దేశం పార్టీ తరపున ఎన్నికైన రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, సానా సతీష్, చింతకాయల విజయ్, లింగమనేని రమేష్ పలువురు సభ్యులతో మోదీ ముచ్చటించారు. భాష్యం రామకృష్ణ తో కరచలనం చేస్తూ అభినందనలు తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

# సీఎం చేతుల మీదుగా బే ఆఫ్ బాపట్ల వెబ్‌సైట్ ప్రారంభం

## -వెబ్‌సైట్ రూపకర్త విన్నకోట చాందినిశ్రీకి అభినందనలు -జిల్లాను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా ప్రశంసలు

**బాపట్ల, ఆగస్టు 7,ప్రభాతవార్త ప్రతినిధి:**

బాపట్ల జిల్లా పర్యాటక, వాణిజ్య, వ్యాపార విశిష్టతలను దేశ విదేశాలకు పరిచయం చేసే లక్ష్యంతో రూపొందించిన బే ఆఫ్ బాపట్ల ప్రత్యేక వెబ్‌సైట్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం చీరాలలో నిర్వహించిన నేతన్న నేస్తం కార్యక్రమంలో ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ మార్గదర్శకత్వంలో, డీపీఎండిఓ సహకారంతో స్టార్టప్ సంస్థకు చెందిన వెబ్ డెవలపర్ విన్నకోట చాందినిశ్రీ ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. వెబ్‌సైట్‌ను ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపకర్త విన్నకోట చాందినీ శ్రీని ప్రత్యేకంగా అభినందించారు. బాపట్ల జిల్లా ప్రత్యేకతలను సాంకేతికతతో ప్రపంచానికి చేరువ చేసే ప్రయత్నం అభినందనీయమన్నారు. అనంతరం వెబ్‌సైట్‌లో పొందుపరచిన అంశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు.

**జిల్లా సమగ్ర సమాచారానికి డిజిటల్ వేదిక:**

బే ఆఫ్ బాపట్ల వెబ్‌సైట్ ద్వారా జిల్లాలోని సూర్యలంక బీచ్, చీరాల బీచ్, నిజాంపట్నం తీరం,చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలతో పాటు వివిధ నియోజకవర్గాల్లోని ప్రముఖ దర్శనీయ స్థలాలు, వాణిజ్య, వ్యాపార కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య సేవలు, పోలీసు విభాగం, ప్రజలకు అవసరమైన ఇతర



సేవలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చారు. దేశ విదేశాల్లోని పర్యాటకులు, పెట్టుబడిదారులు, ప్రజలకు బాపట్ల జిల్లా గురించి పూఇర్తి అవగాహన కల్పించేలా వెబ్‌సైట్‌ను రూపొందించారు.

**కలెక్టర్ ప్రోత్సాహంతో రూపుదిద్దుకున్న వెబ్‌సైట్:**

ఈ సందర్భంగా వెబ్‌సైట్ రూపకర్త విన్నకోట చాందినీశ్రీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసే ప్రత్యేక డిజిటల్ వేదిక అవసరమనే ఆలోచన తనకు కలిగిందన్నారు. తండ్రి విన్నకోట శ్రీనివాసరావు ప్రోత్సాహంతో మొదట పీపీటి రూపంలో ప్రాజెక్టును సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్‌కు వివరించినట్లు చెప్పారు. ఆ ప్రతిపాదన కలెక్టర్‌కు నచ్చడంతో పూర్తిస్థాయిల వెబ్‌సైట్ రూపొందించాలని సూచించారని తెలిపారు.

**క్షేత్రస్థాయిలో పర్యటించి సమాచార సేకరణ:**

వెబ్‌సైట్ రూపకల్పన కోసం జిల్లాలోని ప్రధాన పర్యాటక ప్రాంతాలను స్వయంగా సందరి్ంచి అక్కడి చరిత్ర, ప్రత్యేకతలు, ప్రయాణ సౌకర్యాలు, ప్రజలకు ఉపయోగపడే వివరాలను సేకరించి వెబ్‌సైట్‌లో పొందుపరిచనట్లు చాందినిశ్రీ తెలిపారు. ప్రజలకు అత్యవసరంగా అవసరమయ్యే ఆసుపత్రులు, వ్యాపార సంస్థలు, వాణిజ్య కేంద్రాలు, పోలీసు సేవలు, ఇతర ప్రభుత్వ విభాగాల సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

**ఏఐతో బహుభాషా సౌకర్యం:**

ఈ వెబ్‌సైట్‌లో కృత్రిమ మేథస్సు(ఏఐ) ఆధారంగా బహుభాషా సౌకర్యాన్ని కల్పించినట్లు చాందినిశ్రీ తెలిపారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి సందర్శించే వారు తమకు కావాల్సిన భాషలో సమాచారాన్ని చూసుకునే విధంగా ప్రత్యేక సాంకేతికతను వినియోగించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో బాపట్ల జిల్లాకు సంబంధించిన మరిన్ని అంశాలు, చారిత్రక విశేషాలు, పెట్టుబడి అవకాశాలు, ప్రభుత్వ సేవలు, స్థానిక సంస్కృతి వంటి అంశాలను కూడా వెబ్‌సైట్‌లో చేర్చే ప్రణాళిక ఉందన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి మరింత ప్రోత్సాహం లభిస్తే జిల్లాను ప్రపంచానికి మరింత సమగ్రంగా పరిచయం చేసేలా వెబ్‌సైట్‌ను విస్తరిస్తానని చెప్పారు.

# 9న అవగాహనలో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 7,ప్రభాతవార్త :** స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గత 18సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ప్రతి ఆదివారం ఆరోగ్యసభల్లో భాగంగా ఈవారం షుగర్,థైరాయిడ్,ఎండోక్రైన్ వ్యాధులపై సమగ్ర అవగాహన సభ ఏర్పాటు చేయబడిందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.ఆగస్టు 9వ తేది ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్యసభకు ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ నందిపాటి వెంకట సందీప్ ప్రధాన వక్తగా పాల్గొంటారన్నారు.ఆరోగ్యాభిలాషులందరూ 407వ ఆరోగ్యసభలో పాల్గొని ఆరోగ్య విషయాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిందిగా సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

# ఇసుక మాఫియా పై సీఎం చంద్రబాబు సీరియస్..

**అధికారులకు నెలరోజుల గడువు**

- చీరాల బహిరంగ సభలో కలెక్టర్, మైనింగ్ అధికారులకు సీఎం హెచ్చరి
- అక్రమ ఇసుక తవ్వకాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం
- లేకపోతే నేనే క్వారీలకు వచ్చి కూర్చుంటా అంటూ స్పష్టమైన వార్నింగ్

**చీరాల టౌన్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాల అంశంపై తీవ్రంగా స్పందించారు. ఇసుక మాఫియాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేసిన ఆయన, అధికారులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు.సభ వేదికపైనే బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తో పాటు మైనింగ్ శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమాలపై పూర్తి స్థాయి వివరాలతో కూడిన నివేదికను నెల రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు.అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇసుక సరఫరా వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "నెల రోజుల్లోగా పరిస్థితి మారకపోతే, నేనే స్వయంగా ఇసుక క్వారీల వద్దకు వచ్చి కూర్చుంటాను. అక్రమాలను సహించేది లేదు" అని హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం



చేశారు.ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు సభలో విశేష ప్రాధాన్యతను సంతరించుకోగా, అక్రమ ఇసుక తవ్వకాల నియంత్రణపై ప్రభుత్వం కఠిన వైఖరితో ముందుకు సాగుతుందనే సంకేతాలను ఇచ్చాయి. ఈ కార్యక్రమంలో చేనేత మంత్రివర్యులు సవిత, జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్,అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా అధికార యంత్రాంగం, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు విరివిగా మొక్కలు నాటాలి

## -నగర కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 7 ( ప్రభాతవార్త ) :** నగరంలోని ప్రధాన రహదారుల్లోని డివైడర్లలో రోడ్డుకిరువైపులా మొక్కలను విరివిగా నాటాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్, హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో నగరంలో పచ్చదనం పెంపొందించడం, పార్కుల నిర్వహణ పై అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరాన్ని గ్రీన్ గుంటూరుగా చేయడానికి నగరంలో చేపట్టిన ప్లాంటేషన్ ను జియో ట్యాగ్ చేయాలన్నారు. ముఖ్యంగా నగరంలోని ప్రధాన రహదారుల్లోని సెంట్రల్ డివైడర్లలో మరియు రోడ్డుకిరువైపులా మొక్కలను నాటి గ్రీనరీని పెమ్పొందిన్చాలన్నారు. అంతేకాక నగరంలోని అన్ని పార్కులలో మొక్కలు నాటడంతో పాటు వాటి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా వాటరింగ్ చేయాలని సూచించారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో స్థానిక ప్రజలను, కాలనీ వాసులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని, అప్పుడే మొక్కల సంరక్షణ బాధ్యతాయుతంగా జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే మొక్కలు నాటే ప్రాంతాల్లో మరియు నగరంలో ఎక్కడా



కూడా గ్రీన్ వేస్ట్ లేదా ఇతర వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతరం పారిశుధ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరాన్ని సుందరంగా, పచ్చదనంతో ఉంచేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కిషోర్, ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఈఈ వేణు, డి.ఈ.ఈ శ్రీనివాస్, ఏడీహెచ్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

## ఎమ్మెల్యే రామాంజనేయులు

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 7, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం-సంక్షేమం, అభివృద్ధి ఇంటింటి ప్రచార



కార్యక్రమంలో భాగంగా పెదనందిపాడు మండల కేంద్రంలో శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ..భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, దీపం పథకం, స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, ఉపాధి కల్పన కోసం నిర్వహిస్తున్న జాబ్ మేళాల వంటి పథకాల గురించి ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వివరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గాని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అనంతరం గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకొన్నారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను అందించి పథకాల గురించి వివరించారు. లోకేష్ నాయకత్వంలో 16,500 మంది నిరుద్యోగ అభ్యర్థులకు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. అర్హత సాధించిన వారు ప్రస్తుతం విధుల్లో చేరి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని తెలియజేశారు. వైసీపీ నేతలు ఢిల్లీ క్రాకోచ్ వివాదానికి మంత్రి లోకేష్ రాజీనామా డిమాండ్కు ముడి పెట్టడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ఇవ్వని వైసిపి నేడు విమర్శలు చేయటం దుర్మార్గమని తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డీఎస్సీ నిర్వహణపై అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని హేళణ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలోనే ఎన్నికల హామీలను 90శాతం అమలు చేసి చూపించిందని వివరించారు. కార్యక్రమంలో మండల స్థాయి కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీలో ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి ఆగస్ట్7(ప్రభాతవార్త):** పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మానవత్వమే ధ్యేయంగా అందజేశారు.ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి




ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్. శుక్రవారం తెనాలి నియోజకవర్గానికి సంబంధించిన 53 మంది వైద్య చికిత్స కోసం, తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ , మాజీ మంత్రి,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ. 22,97,828/ మంజూరైంది.ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి శుక్రవారం బాధితులకి 22,97,828/ ల చెక్కును శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ బాధితకుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ,మండల పార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్,నల్లిబోయిన నాగేశ్వరరావు,భీమవరపు చినకోటి రెడ్డి,నాయకులు మంగమూరి హరిప్రసాద్, పసుపులేటి త్రిమూర్తి ,వంగా సాంబిరెడ్డి, కేసన కోటేశ్వరరావు,వసంతం అశోక వర్ధన,మల్లవరపు విజయ్, జొన్నాదుల మహేష్,ఈదర వెంకట పూర్ణచంద్, కాటం రవి, అడుసుమల్లి ఒకటేశ్వరరావు, అర్జున్,కన్నయ్య,షావుల్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

## నైతిక బాధ్యత వహించి మంత్రి నారా లోకేష్

# రాజీనామా చేయాలి

**మంగళగిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త :** డీఎస్సీ స్కాంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని డా. బి.ఆర్. అంబేద్కర్




విగ్రహం వద్ద చేపట్టిన నాలుగు రోజుల రిలే నిరాహార దీక్ష రెండో రోజు శుక్రవారం కొనసాగింది. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు సయ్యద్ గౌస్ సారథ్యంలో నిర్వహించారు.దీక్షను దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిపోయిన శివగోపయ్య, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, విద్యార్థి, దుగ్గిరాల జడ్పిటిసి మేకతోటి అరుణ, యువజన నాయకులకు నూలు దండలు వేసి దీక్షలను ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. నైతిక విలువలు ఉంటే మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నాటి దీక్షలో దుగ్గిరాల మండల యువజన అధ్యక్షుడు దయాసాగర్, యువజన నాయకులు పార్థు, కుమార్ బాబు, చైతన్య, భగత్, జస్వంత్, సన్నీ, తరుణ్ గుల్షన్, బాజీ బాబు, రియాజ్, సమీర్, సలీం, అస్లాం, షాజీన్, జానీ, ధర్మ, మండేల జార్జిబాబు, జార్జి, చాన్, దుగ్గిరాల మండల విద్యార్థి విభాగ అధ్యక్షుడు గణేష్, విద్యార్థి నాయకులు జయప్రకాశ్, సందీప్, బాలశంకర్, సాగర్, బాలు, చైతన్య, బాలసుబ్రహ్మణ్యం, హరీష్ కుమార్, మహిధర్, ఎర్రబాలెం గ్రామానికి చెందిన డాక్టర్స్ వింగ్ రూరల్ ప్రెసిడెంట్ మేరుగా నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు లీల శివ, ఎస్.కె. బడే మియా, మైనారిటీ వింగ్ అధ్యక్షుడు ఎస్.కె. షఫీ, మండల యువజన వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె. సద్దాం, గ్రామ నాయకులు సాలి బంగారయ్య, కర్ర పున్నమ్మ, చిల్లపల్లి ఇందిరా, దొడ్డ అనిత, కర్ల నాగలక్ష్మి, దాసరి అనిల్, కర్నాటి నాగేశ్వరరావు, సయ్యద్ హుస్సేన్ భాష, సయ్యద్ ఆసిఫ్, థామస్, నాయుడుపల్లి నవీన్, జాలి జాన్, ఉయ్యాల కృష్ణ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ, మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# చేనేత కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## చిల్లపల్లి శ్రీనివాసరావు

**మంగళగిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి దామర్ల నాంచారమ్మ చెరువు ప్రాంగణంలోని పద్మశాలి కళ్యాణ మండపం నందు 12వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ చేనేత శాఖ, గుంటూరు జిల్లా వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీఎంఎస్ఐడిసి చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. చేనేత రంగం మన రాష్ట్రానికి మాత్రమే కాకుండా దేశానికి కూడా గర్వకారణమని, తరతరాలుగా మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతున్న చేనేత కార్మికుల సేవలు ఎంతో గొప్పవని అన్నారు.జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేనేత వస్త్రాలు ధరించి చేనేతకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. నేతన్నల సంక్షేమానికి, చేనేత రంగ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ ఎంతో ప్రాధాన్యత ఇస్తూ, చేనేత కార్మికులను గౌరవిస్తున్నారని అన్నారు. మగ్గం పనులు చేస్తూ కంటి సమస్యలు ఎదుర్కొంటున్న చేనేత కార్మికులకు ఇటీవల కంటి అద్దాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. నేతన్నల ఆరోగ్యం పట్ల కూడా పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలపై పవన్ కళ్యాణ్ చేపట్టిన తొలి చేనేత సత్యాగ్రహం



చేనేత రంగ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టమని అన్నారు.

చేనేత కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నేతన్న నేస్తం, చేనేత పింఛన్లు, ఉచిత విద్యుత్, యార్న్ సబ్సిడీ, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ సహాయం వంటి పలు పథకాల ద్వారా చేనేత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనురాధ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనంజయరావు, టీటీడీ బోర్డ్ మెంబర్ తమ్మిశెట్టి జానకి దేవి, కందుల నాగార్జున , బీజేపీ నాయకులు జగ్గారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఆలపాటికి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల వినతి అందజేత

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్7, ప్రభాతవార్త: ఏఎన్‌యులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల బృందం శుక్రవారం గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్‌లో ఇచ్చిన జీఓ ఎంఎస్.నెం.20ను రద్దుచేయాలని కోరారు. జీఎం ఎంఎస్ నెం.46, జిఓ ఎంఎస్ నెం.14ల ప్రకారం తమకు యూజిసి పే స్కేల్స్ అమలు చేయాలని, తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. గత 15-20 ఏళ్ళుగా వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేసిన తరువాతే రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని వినతిపత్రంలో తెలియజేశారు. ఉన్నతవిద్య కమీషనర్ నారాయణ భరత్ గుప్తాతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పరిష్కరించాలని కోరారు. కాగా ఏఎన్‌యు వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు 20వ రోజుకు చేరుకున్నాయి.

**ఒరిజినల్ లింకు దస్తావేజు పోయినది**

నాకు చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 676/97 రు గలది పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో జిరాక్స్ తీసుకొని వెళుతుండగా కనబడకుండా పోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది చిరునామా దారుని సంప్రదించగలరు. ఇట్లు తాటిచెట్టు లక్ష్మి, సెల్: 8074125552.

# పల్నాడు జిల్లా వార్త



## సాగర్‌కు నివాళులర్పించిన న్యాయవాదులు



**సత్తెనపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా సత్తెనపల్లి కి చెందిన ఆర్టీసీ విశ్రాంత కండక్టర్ గుడిపూడి హనుమంతరావు కుమారుడు సాగర్ (38) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందాడు.సీనియర్ న్యాయ వాదులు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, పెండెం బాబురావు, జూపల్లి శేషయ్య, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ ) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్, న్యాయవాది చిన్నం మణి బాబు, నాయకులు జూపల్లి పాల్ తదితరులు సాగర్ భౌతిక కాయాన్ని సందర్శించి, పూల మాలతో నివాళులర్పించారు. వారి కుటుంబానికి దేవుడు ఎల్లప్పుడూ అండగా ఉండాలని ఆకాంక్షించి కుటుంబాన్ని ఓదార్చారు

## మధ్యవర్తిత్వం..3.0 దేశం కోసం. కార్యక్రమం

**సత్తెనపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు ఆదేశాల ప్రకారం మండల న్యాయ సేవా కమిటీ సత్తెనపల్లి ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి 7 వరకు మధ్యవర్తిత్వం 3.0 దేశం కోసం... కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ సత్తెనపల్లి కోర్టు నుండి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి( జూనియర్ డివిజన్ ) సత్తెనపల్లి కోర్టు వరకు 1కె వాక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. రాజీమార్గమే రాజమార్గం




మధ్యవర్తిత్వం సత్వర పరిష్కారం అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణంలో విధులు నిర్వహిస్తున్న వి. విజయ్ కుమార్ రెడ్డి చైర్మన్ మండల న్యాయ సేవ అధికార



కమిటీ మరియు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సత్తెనపల్లి ఎ. తౌసిద్ హుస్సేన్ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్ ) సత్తెనపల్లి, పి. ప్రియ దర్శిని, ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి( జూనియర్ డివిజన్ ) సత్తెనపల్లి జె. సుజన్ కుమార్ సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి ( జూనియర్ డివిజన్) సత్తెనపల్లి , జి. అజయ్ కుమార్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్తెనపల్లి, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు జ్యోతి సుభాని, ప్రసాద్ ప్యానల్ లాయర్ లు, మీడియేటర్లు, పోలీస్ సిబ్బంది, మరియు శాంతినికేతన్ డైరెక్టర్ రమణా రెడ్డి,విద్యార్థినిలు పాల్గొని మధ్యవర్తిత్వం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

## రైతన్న మీకోసం ఎల్‌నినో ప్రభావ కార్యాచరణ ప్రణాళిక

**సత్తెనపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రైతన్న మీకోసం ఎల్ నినో ప్రభావ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, సత్తెనపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి రవిబాబు , సత్తెనపల్లి,మండల వ్యవసాయ అధికారి బి సుబ్బారెడ్డి, సత్తెనపల్లి, పట్టణ పరిధిలోని పత్తి పంట పొలాలను పరిశీలించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుల వారు మాట్లాడుతూ రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వర్షాభావ



పరిస్థితులను మరియు బెట్టను తట్టుకొనే ప్రత్యామ్నాయ పంటలను, తక్కువ కాల పరిమితి గల రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ వర్షపాతం మరియు అధిక ఉష్ణోగ్రతలు కారణంగా నేలలోని తేమ త్వరగా తగ్గుతుంది కావున ప్రతినీటిబొట్టును ఒడిసి పట్టుకొని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి సత్తెనపల్లి బి సుబ్బారెడ్డి, పత్తి పంటలో ప్రస్తుతం పరిశీలించబడిన రసం పీల్చే పురుగులు నివారణ కొరకు ఏసిఫేట్ 400గ్రా లేదా ఫ్లోనికామిడ్ 60 గ్రా లేదా ఇమిడాక్లోప్రిడ్ 40 ఎం. ఎల్. ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు పురుగు మందులతో పాటు పైపాటుగా 191919 లేదా మల్టీ కె పోషకాలను పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## రైతులకు పాస్‌పుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యే 'కన్నా'

**సత్తెనపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ముప్పాళ్ల మండలం కుందూరువారిపాలెం గ్రామం నందు ప్రభుత్వ రాజముద్ర తో ఉన్న పాస్ పుస్తకాలను రైతులకు ఎమ్మెల్యే కన్నా శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయం లాభసాటి కావాలి అన్నదాతల బతుకులు మారాలి అన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. జగన్ హయాంలో అరాచక ,రాక్షస పాలన సాగింది ..గత ప్రభుత్వంలో రాష్ట్రం 30 ఏళ్ళ వెనక్కి వెళ్లిందన్నారు. జగన్ ప్రభుత్వం భూకబ్జాలు చేసిందనితమ సొంత భూముల పట్టాదారు పాస్ పుస్తకాల పై జగన్ ఫోటో వద్దన్న రైతుల కోరిక మేరకు, ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిణీ



చేస్తోందన్నారు. గతంలో పట్టాదారు పాసుపుస్తకం పైనే కాకుండా, సరిహద్దు రాళ్లపై కూడా జగన్ రూ.700 కోట్ల ప్రజా ధనంతో తన ఫోటో వేసుకున్నాడని రాష్ట్రంలో అందరి ఆస్తుల ..హక్కులు తనవేనని భావించిన జగన్ ..పాట్టదారుపాసు పుస్తకాల పై దేశంలో ఎక్కడలేని విధంగా జగన్ ఫోటోలు వేశారు ..జగన్ కు పిచ్చి ముదిరి సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేసిన పరిస్థితి.. వైసీపీ హయాంలో తమ ఆస్తులు తమవేనని చెప్పుకునే పరిస్థితి లేకుండా చేసే ప్రయత్నం .. అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారు.. అధికారంలోకి వస్తే తలలు నరుకుతాం అనే వ్యాఖ్యలు సరికాదు ..ప్రజాపరిపాలనకు జగన్ అనర్హుడు ..అరాచక శక్తుల పై ఎన్నికల కమిషనర్ చర్యలు తీసుకోవాలి..రప్పా రప్పా నరుకుతాం అనే జగన్ మాటలకు ప్రేరణతో వైసీపీ శ్రేణులు అరాచకం సృష్టిస్తున్నారు.. ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామం నందు జరిగిన 2ఏళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కన్నా పాల్గొన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు,నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. విద్యార్థి విద్యార్థినీలను తల్లికి వందనం పథకం అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు అందరూ ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని కన్నా విజ్ఞప్తి చేశారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

**రాజుపాలెం, ఆగస్టు 7, ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత అవసరమని సత్తెనపల్లి సబ్ యూనిట్ ఆఫీసర్ పెండం మాణిరావు అన్నారు. శుక్రవారం రెడ్డిగూడెం గ్రామంలో జరిగే ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలో



నీటితొట్టెలను పరిశీలించి నీరు నిల్వలేకుండా చూడాలని సూచించారు. జ్వరాల కేసులపై ఆరాతీశారు. పారిశుద్ధం పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రెడ్డిగూడెం లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని మలేరియా, డెంగీ, చికెన్ గునియా లాంటి వ్యాధులు రాకుండ ఉండాలంటే ఫ్రైడే డ్రై డే కార్యక్రమం క్వాలిటీ జరగాలని వైద్య సిబ్బందికి తెలియచేసినారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జీవనరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జ్యోస్తనా,సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ సూపెర్వైసోర్ రోశయ్య, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, మహిళ ఆరోగ్య కార్యకర్త కమల, ఆశా కార్యకర్తలు ఎస్తేరా రాణి, జ్యోస్తనా పాల్గొన్నారు.

## విద్యార్థులకు మాదక ద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమం

**రాజుపాలెం, ఆగస్టు 7, ప్రభాతవార్త:** యువతకు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలు మరియు దాని పర్యవసానాల గురించి అవగాహన కల్పించాలని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాంబాబు



నాయక్ అలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల శారీరక, మానసిక మరియు సామాజిక ప్రభావాల గురించి తెలియజేస్తూ, ఆరోగ్యకరమైన, మాదక ద్రవ్య రహిత ఎంపికలు చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అవగాహన చేసినారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని నివారించడం అందరూ సహకారించాలని తెలియచేసినారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే సహాయక వాతావరణాలను సృష్టించడం దీని లక్ష్యం పనిచేయాలని తెలియచేసినారు.ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్ మాస్టర్ రవీంద్రబాబు ఆరోగ్య పర్యవేక్షకులు జీవనరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అలేఖ్య, ఉపాధ్యాయులు తోట శ్రీనివాసరావు, ఏ.ఎన్. ఎమ్. లు కమల, ప్రమీల బాయ్, ఆశా కార్యకర్తలు దీవిన, అనురాధ, పాల్గున్నారు

## అమరావతి ఛాంపియన్‌షిప్-2026ను ప్రారంభించిన ఎమ్మెల్యే డా.అరవిందబాబు

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువ క్రీడా ప్రతిభను వెలికితీసి వారికి మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్‌షిప్-2026



నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో మూడు లక్షలకు పైగా యువ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జూలై 15 ఆగస్టు 26 వరకు మూడు దశల్లో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం సుమారు రూ.94 లక్షల నగదు బహుమతులను అందించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలిపారు. జిల్లా నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని పల్నాడు జిల్లా క్రీడా శాఖ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 70 మంది పిఈటిలు పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖ అధికారి నర్సింహారెడ్డి, క్రీడా కోచ్‌లు, క్రీడాకారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ బుక్ రాజ్యాంగం అమలు కోసమే పోలీసులున్నారా !?.

### వైసీపీ యువతతో కలిసి భిక్షాటన చేసిన గోపిరెడ్డి

**నరసరావుపేట , ఆగస్టు 7 ప్రభాతవార్త :** మంత్రి నారా లోకేష్ బాబు రచించిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడం కోసమే ఉద్యోగాలు చేస్తున్నారా అంటూ వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పోలీసులపై తీవ్ర స్థాయిని విడిచిపడ్డారు. వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్





గోపిరెడ్డి, వైసీపీ యువత రిలే నిరాహార దీక్ష శిబిరానికి ప్లేట్లు పట్టుకొని భిక్షాటన చేసుకుంటూ స్థానిక ధర్నా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన నిరాహార దీక్ష శిబిరం వద్దకు చేరుకొని దీక్ష కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, గురువారం విజయవాడలో మల్లాది విష్ణు ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంపై టీడీపి నాయకుడు బోండా ఉమా దాడి చేయడం చాలా దారుణమైన విషయమన్నారు. దీనిని వైసీపీ తరఫున దీన్ని తీవ్రంగాఖండిస్తున్నామన్నారు. స్వాతంత్రం రాకపూర్వం బ్రిటిష్ పరిపాలనలో కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన చేయడానికి అవకాశం కల్పించారని గుర్తుచేశారు. బ్రిటిష్ పరిపాలన కూడా తలదించుకునే విధంగా చంద్రబాబు పరిపాలించడం చాలా దారుణమైన అంశమన్నారు. మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దీక్షా శిబిరం ఏర్పాట్లు చేసుకుంటే, అనుమతి లేదని చెప్పారన్నారు. తాడిపర్తిలో కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి ఇంట్లో నుంచి బయటికి కూడా రానీయలేదనీ తెలిపారు. ఇంత జరుగుతున్న పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తాము వేటన్నిటినీ గుర్తు పెట్టుకుంటామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపి నాయకులను రోడ్ల మీద కూర్చోవడానికి కూడా వీల్లేకుండా, ఎటువంటి ధర్నాలు చేయడానికి పర్మిషన్స్ ఇవ్వమని చేస్తామని హెచ్చరించారు. దెబ్బకు దెబ్బ తీస్తామన్నారు. ఈనెల 10న మెగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర విద్యార్థి అధ్యక్షులు పానుగంటి చైతన్య, జిల్లా అధ్యక్షులు ఆకాష్ నియోజకవర్గ వైసీపీ యువకులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇస్సాపాలెం స్త్రీ శక్తి భవన్‌లో తల్లిపాల వారోత్సవాల ముగింపు

**ఇస్సాపాలెం, నరసరావుపేట , ఆగస్టు 7 ప్రభాతవార్త :** ఇస్సా పాలెం స్త్రీ శక్తి భవన్‌లో తల్లిపాల వారోత్స వాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత, శిశువుల ఆరోగ్యంపై తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై సీడీపీఓ కాంతకుమారి అవగాహన కల్పించారు. శిశువులకు తల్లిపాలను తప్పనిసరిగా అందించడం ద్వారా ఆరోగ్యకరమైన ఎదుగుదలతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆమె వివరించారు. తల్లిపాలు శిశువుల శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోత్స్న, గౌష్య మరియా, వాణి, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ చేనేత దినోత్సవ వేడుకలలో భాగంగా కార్మికుల ర్యాలీ

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 7 ప్రభాతవార్త :** ప్రపంచ చేనేత దినోత్సవ వేడుకలు నరసరావుపేటలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చేనేత కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులు కలెక్టర్ కృత్తికా శుక్లాను కలిసి పల్నాడు జిల్లాలో చేనేత కార్మికుల కోసం ప్రత్యేక



భవనం నిర్మించాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి నిర్మాణానికి తప్పకుండా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం చేనేత కార్మికుల కుటుంబీకులు ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబును నేత వస్త్రాలతో సన్మానించారు. అనంతరం ప్రత్యేక భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌తో మాట్లాడి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కుటుంబ సభ్యులు జంజనం వెంకటేశ్వర్లు, అశ్విని స్కాన్ సెంటర్ రాంప్రసాద్, రాఖీ న్యూస్ రిపోర్టర్లు మాడెం మల్లికార్జున రావు, సాకిబాలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన

**వినుకొండ,నూజెండ్ల,ఆగస్ట్7,ప్రభాతవార్త:** వ్యవసాయంపై ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు,శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని నూజెండ్ల మండల వ్యవసాయ అధికారి ఎ.అంజనేయులు నాయక్





సూచించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ ఆదేశాల మేరకు రైతు అన్న మీకోసం-ఎల్‌నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నూజెండ్ల మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు ఎల్‌నినో వల్ల వ్యవసాయంపై కలిగే ప్రభావాలు మరియు ముందస్తు సన్నద్ధతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏవో ఆంజనేయులు చింతలచెరువు,ముక్కెళ్లపాడు గ్రామాల్లో రైతులతో సమావేశమై ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న పరిస్థితుల్లో రైతులు చేపట్టాల్సిన పంటల యాజమాన్య పద్ధతులను వివరించడం జరిగింది.తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, స్వల్పకాలిక రకాలు,పంట వైవిధ్యం,విత్తన శుద్ధి,నేలలో తేమను సంరక్షించే పద్ధతులు,సేంద్రియ పదార్థాల వినియోగం,సమతుల్య ఎరువుల వినియోగం వంటి చర్యలను పాటించాలని తెలిపారు.

**వినుకొండ:** .మండలంలోని 11 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతన్న మీకోసం ఎలిమినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. కొప్పుకొండ రైతు సేవ కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి పాల్గొని రైతు సోదరులకు ఏలినినో ప్రభావం వల్ల అతి తక్కువ వర్షపాతం పడే అవకాశం ఉందని కనుక రైతు సోదరులు భూమి రెడీ చేసి అపరాలు సాగు చేయవలసిందిగా తద్వారా సీజన్ కోల్పోకుండా ఉండవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విభాగం రాజారెడ్డి రైతులకు విత్తన గులికలు తయారీ విధానం దీనివలన విత్తనము వెంటనే భూమిలో వేద పెట్టవచ్చని సరైన పదును ఉన్నప్పుడు విత్తనాలు మొలకెత్తునని తెలియజేశారు. పంట నమోదు చేయడం,ఫార్మర్ యాప్ ఇన్స్టాల్ చేయటం,నమోదు చేసిన పంటలను పంట పరిస్థితిని పరిశీలించి ల్యాండ్ పార్సెల్ వారీగా పంట పరిస్థితుల అధ్యయనం మరియు శాస్త్రీయ సూచనలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమములో ఏ .ఈ. ఓ. ఆరీఫ్,విహెచ్ఎ గోపి, రైతు సోదరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై ఎల్‌నినో ప్రభావం పట్ల రైతులకు అవగాహన కార్యక్రమం......

## రైతన్న మీకోసం ఎల్‌నినో ఉపశమన కార్యాచరణ ప్రణాళిక

**శావల్యాపురం,ఆగస్ట్7,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన శావల్యాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రం నందు రైతన్న మీకోసం ఎల్‌నినో ఉపశమన కార్యాచరణ ప్రణాళిక ఖరీఫ్ 2026 మీద రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేంద్ర బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో నరేంద్రబాబు ఎల్ నినో ప్రభావ నివారణ కార్యచరణ ప్రణాళిక గురించి రైతులకు తెలియజేశారు. ముందస్తు అంచనాల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వర్షాభావ పరిస్థితులను బెట్టను తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలను, తక్కువ కాల పరిమితి గల రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. తక్కువ వర్షపాతం మరియు అధిక ఉష్ణోగ్రతల కారణంగా నేలలోని తేమ త్వరగా తగ్గుతుంది అందువల్ల ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకుని పొదుపుగా వినియోగించుకోవాలని చెప్పారు. తదనంతరం కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు వివరించారు.



1.ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలోని ప్రతి రైతును వ్యవసాయ భూకమతమును 100 సందర్శించుట. 2. పంట ప్రస్తుత పరిస్థితి నీటి కొరత వలన వాడిపోవడం లేదా ఎండిపోవడం, చీడపీడల ఉధృతి,ఉద్యాన పంటల పరిస్థితి,బీడు లేదా సాగు చేయని భూముల వివరాలు అంశాలను అంచనా వేయడం.3. క్షేత్రస్థాయిలో గుర్తించిన కరువు పరిస్థితులను తగువిధంగా నివారణ చర్యలు,పంటను కాపాడుకునేందుకు తక్షణమే ఇవ్వవలసిన ప్రాణాధార నీటి తడులు మల్చింగ్ ద్వారా తేమ సంరక్షణ చర్యలు విత్తిన గుతికలు ప్రతికూల వాతావరణ మార్పులకు అనుగుణంగా వేసుకోవాల్సిన ప్రత్యామ్నాయ పంటలు అంతర పంటల సాగు,పంట నిర్వహణ వంటి పరిష్కార చర్యలను సూచించడం 4. బీడుగా ఉన్న,సాగు చేపట్టని పొలాలలో స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలు వేయడం లేదా వర్షాభావ పరిస్థితి పరిణామాల వలన తీవ్రంగా దెబ్బతిన్న భూములలో మరలా స్వల్పకాలిక రకాలను విత్తుకునే విధంగా ప్రోత్సహించడం. 5.కార్యక్రమ పురోగతిని 2.0 ద్వారా పారదర్శకంగా పర్యవేక్షించడం మరియు ఫార్మర్ యాప్ ద్వారా ద్వారా రైతులకు అవసరమైన సలహాలు,సూచనలను అందజేయడం. 6. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేసిన పంటల క్షేత్ర సందర్శన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు మరియు నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి రామాంజనేయులు,వ్యవసాయ అధికారులు,ఆయిల్ ఫామ్ ఇన్చార్జ్, వెటర్నరీ సిబ్బంది,రైతు సేవ కేంద్రం సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## రుద్రవరంలో 2ఏళ్ల నమ్మకం ..సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచారం

**ముప్పాళ్ల, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామం నందు జరిగిన 2ఏళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా ..కూటమి నాయకులు కార్యకర్తలు,నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించిన శాసన సభ్యులు కన్నా. విద్యార్థి విద్యార్థినీలను తల్లికి వందనం పథకం అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు



అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కూటమి ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసి చూపించాం . ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చేందుతుంది .ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్ళి గర్వంగా వారికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించగలుగుతున్నాము .కూటమి నాయకులు అందరూ ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వంఅమలుచేస్తున్నపథకాలనువివరించాలని కన్నా సూచించారు.

## రైతుల శ్రేయస్సుకు 'కూటమి' ప్రభుత్వం కృషి: కన్నా



**ముప్పాళ్ల, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ముప్పాళ్ల మండలం కుందూరువారిపాలెం గ్రామం నందు ప్రభుత్వ రాజముద్ర తో ఉన్న పాస్ పుస్తకాలను రైతులకు అందజేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా ,వ్యవసాయం లాభసాటి కావాలి అన్నదాతల బతుకులు మారాలి అన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం. తమ సొంత భూముల పట్టాదారు పాస్ పుస్తకాల పై జగన్ ఫోటో వద్దన్న రైతుల కోరిక మేరకు, ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గతంలో పట్టాదారు పాసుపుస్తకం పైనే కాకుండా, సరిహద్దు రాళ్లపై కూడా జగన్ రూ.700 కోట్ల ప్రజా ధనంతో తన ఫోటో వేసుకున్నాడు అని శాసనసభ్యులు సంబోధించారు .

## మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన..


**నరసరావుపేట క్రైమ్ , ఆగస్టు 7 ప్రభాతవార్త :** స్థానిక రామిరెడ్డిపేటలోని సరస్వతి సదన్ విట్ జూనియర్ కాలేజీలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్స్, మహిళల భద్రత, ర్యాగింగ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తాళ్లూరి అశోక్ బాబు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సైబర్ నేరాలకు



గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ర్యాగింగ్ చట్టవిరుద్ధమని, పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, బాలికల భద్రతకు శక్తి బృందాలు చేపడుతున్న కార్యక్రమాలపై సిఐ అశోక్ బాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డి. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఎల్. శివాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే అరవింద బాబు

**రొంపిచర్ల, ఆగస్టు 7 ప్రభాతవార్త :** స్థానిక సతీష్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ తదితర



ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాల తరహాలో నరసరావుపేటలోనూ ఈ కేంద్రం అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలకు ఆధార్ సేవలు మరింత సులభతరం కానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ నరసరావుపేట ప్రజలకు సమీపంలోనే కేంద్ర ప్రభుత్వ ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు పొందే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేకోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గుత్తా అంకమ్మ చౌదరి, అత్తులూరి సుబ్బు, సిబ్బంది పాల్గొన్నారు.

8MN 7PG-GNT_8MN 7PG-GNT.qxd 07-08-2026 PM 09:33 Page 1



# పల్నాడు జిల్లా వార్త



## జీడీసీసీ బ్యాంకులో 125 మంది సిబ్బందికి బదిలీలు
### చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు


**వినుకొండ, ఆగస్టు 7, ప్రభాతవార్త:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీ బ్యాంకు)లో ఉద్యోగుల బదిలీ విధానానికి సంబంధించి బ్యాంకు మహాజన సభలో ఆమోదించిన తీర్మానం మేరకు బదిలీ ప్రక్రియను చేపట్టినట్లు బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. బ్యాంకు సర్వీస్ నిబంధనల ప్రకారం ఒకే చోట 3 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు 3 ఆప్షన్లు ఇచ్చి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బదిలీలను నిర్వహించినట్లు చైర్మన్ మక్కెన తెలిపారు. బ్యాంకు పరిపాలనా అవసరాలు, సిబ్బంది అవసరాలు, సర్వీస్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 125 మంది సిబ్బందిని పారదర్శకంగా బదిలీ చేసినట్లు వెల్లడించారు. అవకతవకలకు అడ్డుకట్ట వేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఒకే శాఖలో లేదా ఒకే ప్రాంతంలో ఉద్యోగులు ఎక్కువ కాలం పనిచేయడం వల్ల స్థానిక పరిచయాలు పెరగడంతో పాటు, కొన్నిసార్లు ఆర్థిక అవకతవకలు, అక్రమ లావాదేవీలు లేదా ఇతర మోసాలకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉందని చైర్మన్ పేర్కొన్నారు. సిబ్బంది బదిలీల ద్వారా ఇటువంటి అవకాశాలను తగ్గించడంతో పాటు, బ్యాంకులో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. బ్యాంకు సిబ్బంది తమకు కేటాయించిన కొత్త శాఖల్లో బాధ్యతలు స్వీకరించి, రైతులు, ఖాతాదారులు, సహకార సంఘాలకు మరింత మెరుగైన సేవలు అందించాలని చైర్మన్ సూచించారు. సహకార సంఘాల సిబ్బందికి కూడా బదిలీ విధానం జీడీసీసీ బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (శితిదిళీ) సిబ్బందికి కూడా భవిష్యత్తులో బదిలీ విధానాన్ని అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చైర్మన్ శ్రీ మక్కెన మల్లికార్జున రావు తెలిపారు. సహకార సంఘాల్లో కూడా ఒకే చోట దీర్ఘకాలం పనిచేస్తున్న సిబ్బంది స్థాన మార్పు ద్వారా పరిపాలనా వ్యవస్థలో పారదర్శకత పెరగడంతో పాటు, ఆర్థిక అవకతవకలకు ఆస్కారం లేకుండా చేయవచ్చని ఆయన అన్నారు. సహకార సంఘాల పనితీరును మెరుగుపరచడం, సభ్యులు మరియు రైతులకు మెరుగైన సేవలు అందించడం, ఆర్థిక క్రమశిక్షణను పటిష్టం చేయడం లక్ష్యంగా బదిలీ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకు సిబ్బంది, సహకార సంఘాల సిబ్బంది బదిలీలలో సర్వీస్ నిబంధనలు, పరిపాలనా అవసరాలు, పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తామని చైర్మన్ స్పష్టం చేశారు.



## ప్రియురాలిని హత్య చేసి దహనం చేసిన ప్రియుడు

**చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా కారంపూడి శివారులో అత్యంత దారుణ ఘటన నాలుగు రోజుల తర్వాత వెలుగుచూసింది. చిలకలూరిపేటకు చెందిన షేక్ హసీనా (25)ను ఆమె ప్రియుడు, కారంపూడి మండలం ఇనుప రాజుపల్లికి చెందిన జిలుగు బాల సైదులు అనుమానంతో దారుణంగా హత్య చేసి, మృతదేహం ఆనవాళ్ల దొరక్కుండా పెట్రోల్ పోసి దహనం చేశాడు. ఐదేళ్లుగా ప్రేమ వ్యవహారంలో ఉన్న వీరికి విభేదాలు రావడంతో, ప్రేమ పేరుతో ఆమెను రప్పించి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితుడు తన తండ్రికి ఫోన్ చేసి యువతిని హత్య చేసినట్లు అంగీకరించడంతో ఈ దారుణం బయటపడింది. వెంటనే అప్రమత్తమైన చిలకలూరిపేట పోలీసులు, ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో ఎన్ఎస్పీ కాలువ సమీపంలో సుమారు 90 శాతం కాలిపోయిన స్థితిలో ఉన్న హసీనా మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.





## ఎల్‌నినో ప్రభావ నివారణపై కార్యాచరణ

**చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** చిలకలూరిపేట మండలంలోని కావూరు మరియు లింగంగుంట్ల గ్రామాలలో "రైతన్న మీకోసం ఎల్ నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక"కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మండల వ్యవసాయ అధికారి సి. హెచ్ సరిత, బాపట్ల వ్యవసాయ విశ్వ విద్యాలయం నుండి ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి డా" కె. చంద్రశేఖర్, పశువైద్య విద్య విభాగం నుండి జయప్రకాష్ పాల్గొని రైతులకు ఎల్ నినో పరిస్థితులలో పంటల సాగు మరియు పశువుల పెంపకంలో తీసుకోవలసిన పలు జాగ్రత్తల గురించి వివరించారు. ప్రొ" చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో నెలకొన్న ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ రాష్ట్రవ్యాప్తంగా రైతన్న మీకోసం ఎల్ నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక పేరుతో సమగ్ర క్షేత్రస్థాయి ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది అని దీనిలో భాగంగా రైతులు ఎల్ నినో తీవ్రతను అధిగమించేందుకు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వర్షాభావ పరిస్థితులను బెట్టను తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలను తక్కువ కాల పరిమితి గల రకాలను ఎంపిక చేసుకోవాలని , తక్కువ వర్షపాతం మరియు అధిక ఉష్ణోగ్రతల వల్ల నేలలోని తేమశాతం త్వరగా తగ్గిపోతుందని , కనుక రైతులు తక్కువ నీటితో సాగు చేసుకోగలిగిన పంటలను ఎంచుకోవాలని కోరారు. ప్రొ" జయప్రకాష్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం పంటలపైనే కాకుండా పశువుల పైన కూడా ఉంటుంది అని అధిక ఉష్ణోగ్రతల వల్ల పశువుల లోని పాల నాణ్యత మరియు మోతాదులలో వ్యత్యాసం కనపడవచ్చునని, దీనికి గాను పాడి రైతులు జీవాలకు ఎప్పటికప్పుడు నీరు త్రాపుతూ మరియు వాటిపై నీళ్ల జల్లుతూ ఉష్ణోగ్రతల బారిన పడకుండా చూసుకోవాలి అని సూచించారు. వ్యవసాయ అధికారి వారు మాట్లాడుతూ రైతులందరూ ప్రొఫెసర్లు సూచించిన విధముగా వారి సలహాలను పాటిస్తూ బెట్ట పరిస్థితుల నుండి పంటను రక్షించుకోవాలి అని మరియు పాడి రైతులు పశువుల పట్ల కొద్దిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతాప్, ఆర్ ఎస్ కే సహాయకులు గోపి నాయక్ , కావూరు మరియు లింగంగుంట్ల గ్రామ రైతులు పాల్గొన్నారు.



## ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు

**చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తల్లిపాల వారోత్సవాలు ముగింపు రోజున శుక్రవారం స్థానిక ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ప్రగతి వైద్యాలయంలో కార్యక్రమం జరిగింది . ఈ సందర్భంగా క్లబ్బు అధ్యక్షురాలు తోటకూర రామసేత మాట్లాడుతూ మాతృమూర్తులలో తల్లిపాల ప్రాధాన్యత పై అవగాహన కల్పించడం కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా ఆగస్టు 1 నుండి 7 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని అన్నారు. డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ సాహితీ, డాక్టర్ కుష్బూ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంట లోపల తల్లిపాలు పట్టించాలని, అవి బిడ్డలకు దివ్య ఔషధం అని అన్నారు. బిడ్డలకు పాలు ఇచ్చే తల్లులలో బ్రెస్ట్ క్యాన్సర్ గర్భకోశ వ్యాధుల నివారణకు అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. అంతేకాకుండా తల్లి బిడ్డకు పాలు పట్టేటప్పుడు వారిద్దరి మధ్య గాడమైన అనుబంధం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీలు మాజీ అధ్యక్షురాలు నార్నే జయలక్ష్మి ,తోటకూర సీతారామమ్మ ,శ్రీ హర్ష తదితరులు పాల్గొన్నారు.



## చిలకలూరిపేటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

**చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** చిలకలూరిపేట పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్ వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. రోడ్డుపక్కన వ్యక్తి అపస్మారక స్థితిలో కనిపించడంతో స్థానికులు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎవరు, ఏ ప్రాంతానికి చెందినవారు, మృతికి గల కారణాలు ఏమిటన్న విషయాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు సమాచారం సేకరిస్తుండగా, మృతుడి వివరాలు మరియు మృతికి గల కారణాలపై విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.



## టిడిపి సీనియర్ నేత మస్తాన్‌రావుకు ప్రత్తిపాటి పరామర్శ



చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణానికి చెందిన 26 వ వార్డు (పాత 22వ వార్డు) తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు అన్నపరెడ్డి మస్తాన్ రావుకు ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం ఆయన తన నివాసంలోనే ఉంటున్నారు. కాగా, శుక్రవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మస్తాన్‌రావు ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**సత్తెనపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** సత్తెనపల్లి పట్టణం 31వ వార్డు ఫణిదం ఫాబ్రిక్స్‌లో జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నాయుడు పాలనలోనే చేనేతకు స్వర్ణయుగం వచ్చిందన్నారు.
నేతన్నలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు అని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి







కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ఈ రెండేళ్లలో మీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు. గత ప్రభుత్వంలో చేనేతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని కన్నా తెలిపారు. భారతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక చేనేత అని పేర్కొన్నారు. మన నేత సోదరులు నేసిన వస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా పేరుగడించాయని,. వ్యవసాయం తర్వాత వేలాది మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోందన్నారు. అలాంటి రంగానికి అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం నేటి నుంచి ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం జరుగుతోందని కన్నా చెప్పారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారాన్ని భరించనుందని,. దీంతో పాటు త్రిఫ్ట్ ఫండ్ కింద ఏడాదికి రూ.5 కోట్లు విడుదల చేయనుందని పేర్కొన్నారు. నేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ వెన్నంటి నిలుస్తుందని, చేనేత కళాకారులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు,. అనంతరం సత్తెనపల్లి పట్టణం 10వ వార్డు నందు జరిగిన 2ఏళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కన్నా పాల్గొన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కూటమి ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసి చూపించామనిముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్ళి గర్వంగా వారికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించగలుగుతున్నామన్నారు. .కూటమి నాయకులు అందరూ ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని కన్నా సూచించారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రజాఫిర్యాదుల వేదికలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే 'కన్నా'

**సత్తెనపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. శుక్రవారం సత్తెనపల్లి కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను కన్నా స్వీకరించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు ... ఈ సందర్భంగా ప్రజలు. తన దృష్టికి కొన్ని సమస్యలు. గృహ, పెన్షన్, వైద్యం, పలు సమస్యలు తీసుకొచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందరి సమస్యలు పరిష్కరిస్తామని కన్నా స్పష్టం చేశారు.



## ఘనంగా టిడిపి నేత 'దరువూరి' జన్మదిన వేడుక

**సత్తెనపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు దరువూరి నాగేశ్వరావు జన్మదిన వేడుకలను శుక్రవారం రఘురామ్‌నగర్‌లో ఆయన స్వగృహంలో పార్టీ





నాయకులు, అభిమానులు, కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కన్నా హాజరైన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## మొల్లమాంభ వృద్ధాశ్రమంలో డిఎన్నార్ జన్మదిన వేడుకలు



**సత్తెనపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** సత్తెనపల్లి పట్టణ 22 వార్డు మాజీ కౌన్సిలర్ శెట్టి ఆనంద్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వర రావు జన్మదినం సందర్భంగా మొల్లమాంబ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో 19 వార్డ్ మాజీ కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు, శెట్టి మధు, ఆశ్రమ నిర్వాకులు కొండలు పాల్గొన్నారు.

## సత్తెనపల్లి ఏరియా హాస్పిటల్ లో డీసీ ప్రసన్న ఆకస్మిక తనిఖీ
### తల్లిపాలు వారోత్సవాలు సందర్బంగా గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక కౌన్సిలింగ్

**సత్తెనపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** సత్తెనపల్లి ఏరియా హాస్పిటల్ లో శుక్రవారం డీసీ ప్రసన్న ఆకస్మిక తనిఖీచేశారు. రక్త పరీక్ష ల్యాబ్, గది అపరిశుభ్రంగా ఉండటంతో శానిటరీ సిబ్బందిపై మండిపడ్డారు . ఎఒ భవాని దేవి సమయపాలన అనుసరించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మసీ సిబ్బంది ఆదివారం కూడా పని చేయాలంటూ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌కు సూచన చేశారు.



## నేడు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త: రెండవ శనివారం కారణంగా సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు, లైన్ల మరమ్మత్తులు, ట్రీ కటింగ్ కారణముగా గృహ, వాణిజ్య , పరిశ్రమలకు మరియు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని అధికారులు తెలిపారు. చిలకలూరిపేట టౌన్ చిలకలూరిపేట పట్టణం లోని టౌన్ 1 పరిధిలోని అనగా హైవే కు ఎడమవైపు అనగా రైతు బజార్ వైపు, కళ్యాణి సెంటర్ కు ఎడమవైపు అనగా ఎం ఆర్ ఓ కార్యాలయం వైపు ఉన్న అన్ని ప్రాంతములకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. నాదెండ్ల మండలం లోని సాతులూరు, నాదెండ్ల, గణపవరం గ్రామములకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, యడ్లపాడు మండలం లోని అన్ని గ్రామములకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని చిలకలూరిపేట విద్యుత్‌శాఖ డిఇఇ ఆర్. అశోక్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



## ముర్రిపాలు బిడ్డకు సహజమైన తొలి టీకా: సిడిపిఓ వెంకటరమణ

**క్రోసూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త :** ప్రసవం అనంతరం మొదటి గంటలోనే తల్లిపాలను బిడ్డకు అందించటం ఎంతో ముఖ్యమని , పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు ముర్రు పాలు శిశువుకు సహజమైన తొలి టీకా వంటివని



 క్రోసూరు సిడిపిఒ వెంకటరమణ అన్నారు. ముర్రుపాలు లో వ్యాధి నిరోధక శక్తిని పెంచే ప్రతి రక్షకాలు, మాంస కృత్తులు , విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయని పేర్కొన్నారు. 88 తాళ్లూరు లో జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ మహి బున్నీసా అధ్యక్షత వహించారు. సిడిపిఒ వెంకటరమణ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ,యూనిసెఫ్ మార్గదర్శాల ప్రకారం శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. సిజేరియన్ ప్రసవం జరిగినప్పటికీ బిడ్డకు తల్లిపాలు ఇవ్వవచ్చునని స్పష్టం చేశారు. తల్లిపాలు సరిపోవు అనే అపోహతో వైద్యుల సలహా లేకుండా డబ్బా పాలు ప్రారంభించడం సరికాదన్నారు. డబ్బా పాలు ఇవ్వటం వలన తల్లిపాల ద్వారా లభించే సహజమైన రోగ నిరోధక శక్తి శిశువుకు అందకుండా పోతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మహి బున్నీసా సయ్యద్, ఆరోగ్య కార్యకర్త సరస్వతి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు

## డిఎస్సీలో అక్రమాలు: నేడు క్రోసూరులో రిలే నిరాహార దీక్ష

**క్రోసూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త :** రాష్ట్రంలో డిఎస్సీ నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో క్రోసూరులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష మూడో రోజు శనివారం (ఆగస్టు 8) ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ దీక్షలో అమరావతి, అచ్చంపేట మండలాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై దీక్షను విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

## జగన్ పర్యటనల్లో దురాలోచన మినహా. ప్రజాహితం కనిపించడం లేదు ...
### .. కైకలూరు నియోజకవర్గ కూటమి శ్రేణుల విస్తృతస్థాయి సమావేశంలో 'ప్రత్తిపాటి'

**చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వ అభివృద్ధి, చంద్రబాబు..పవన్ కల్యాణ్.. లోకేశ్ ల కష్టాన్ని ప్రజలు గుర్తించకూడదన్న దురుద్దేశంతోనే జగన్ పర్యటనల పేరిట అరాచకాలు సృష్టిస్తూ, రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులకు స్పీడ్ బ్రేకర్లా అడ్డుతగులుతున్నాడని, ఆయన కార్యక్రమాల్లో ఎక్కడా ప్రజాహితం కనిపించడం లేదని శాసనసభ్యులు, జోనల్ కోఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం కైకలూరులో జరిగిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న జోనల్ కో ఆర్డినేటర్ ప్రత్తిపాటి, 10వ తేదీన నియోజకవర్గంలో జరిగే ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంపై టీడీపీ శ్రేణులతో సమగ్రంగా చర్చించారు. అనంతరం టీడీపీ శ్రేణులతో అధినేత చంద్రబాబు నిర్వహించే ప్రత్యేక సమావేశంపై స్థానిక మార్కెట్ యార్డులో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణతో కలిసి నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో చర్చించారు. పార్టీలోని అన్ని విభాగాగాలు అధినేత సమావేశంలో పాల్గొని, తమ అభిప్రాయాలు ఆలోచనలు పంచుకోవాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి శ్రేణులకు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు సాగును..రైతాంగాన్ని గాలికి వదిలేసి.. నేడు కపట ప్రేమ చూపితే ఎలా? అధికారంలో ఉన్నన్నాళ్లు రైతాంగాన్ని, సాగును గాలికి వదిలేసిన జగన్.. నేడు రైతులపై కపట ప్రేమ చూపుతూ, రైతులకు మేలుచేస్తున్న ముఖ్యమంత్రిని తప్పుపట్టడం సిగ్గుచేటని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. పొగాకు రైతులైనా, ఆక్వా రైతులైనా.. ఉద్యాన రైతులైనా.. ప్రతి రైతుకు అండగా నిలిచింది, సాగులో నష్టాలు ఎదురైనప్పుడు వారిని ఆదుకుంది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడే పొగాకు రైతులకు క్వింటాకు రూ.2వేల అదనపు సాయం అందించడం జరిగిందన్నారు. నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం.. కైకలూరు పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యల్ని తీసుకెళ్తామని, ముఖ్యంగా ఆక్వా రైతులు, కొల్లేరు, తాగునీటి సమస్య, రోడ్లు.. డ్రైన్ల నిర్మాణం, ఇతర అభివృద్ధిపనులపై ముఖ్యమంత్రితో చర్చిస్తామని ప్రత్తిపాటి తెలిపారు. అదేవిధంగా టీడీపీ కేడర్ తో జరిగే సమావేశంలో పార్టీ శ్రేణుల ఐక్యత, నాయకత్వ పనితీరు, ఇంటింటికీ తెలుగుదేశంపై లోతైన చర్చ ఉంటుందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ లెవల్ ఇన్ ఛార్జులు సహా అందరూ సమన్వయంతో, కలిసికట్టుగా పనిచేస్తేనే పార్టీ లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. అధినేత చంద్రబాబు సూచనలు, ఆదేశాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాటి ఈ సందర్భంగా సూచించారు.



## హెపటైటిస్ బి వ్యాధి నిరోధానికి చర్యలు : విద్యార్థులకు వ్యాక్సినేషన్

**చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** నేడు సమాజాన్ని పట్టి కుదుపుతున్న హెపటైటిస్ బి వ్యాధిని నిరోధించడంలో భాగంగా వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ శుక్రవారం స్థానిక శారదా జిల్లా పరిషత్ హైస్కూల్ లో 160 మంది విద్యార్థినీ విద్యార్థులకు రోగనిరోధక ఇంజక్షన్లు వేయించారు. స్థానిక ఇన్నర్ వీల్ క్లబ్ మరియు రోటరీ క్లబ్ చిలకలూరిపేట వారి నేతృత్వంలో జరిగిన ఈ సభకు అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కోసం పాటుపడుతున్న ఈ సంస్థల వారిని అభినందించారు. ప్రతి ఒక్క విద్యార్థి వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక కార్డియాలజిస్ట్ డాక్టర్ చిగురుపాటి రామారావు మాట్లాడుతూ మన శరీరంలో లివర్ అత్యంత ముఖ్యమైన అవయవమని, మనం తినే ఆహారాన్ని అది శక్తిగా మార్చుతుందని, హానికరమైన పదార్థాలను తొలగిస్తుందని, అటువంటి కాలేయానికి ముప్పు రాకుండా ఇంజక్షన్ ద్వారా కాపాడుకోవాలని అన్నారు. నేడు మన సమాజంలో ప్రతి పది మందిలో ఒకరిని వెంటాడుతున్న హెపటైటిస్ బి వ్యాధిని నిరోధించగలగటం మన చేతుల్లోనే ఉందన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తోటకూర రామ సీత, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బోడి రామ సుబ్బారావు మాట్లాడుతూ కాలేయానికి మత్తు పానీయాల ద్వారానే కాకుండా వైరస్ ద్వారా కూడా ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. దీనిని హెపటైటిస్ అంటారని, ఇందులో అనేక రకాలు ఉన్నప్పటికీ హెపటైటిస్ బి చాలా ప్రమాదకరమైందని, ఆ వ్యాధిని వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా అరికట్టవచ్చని అన్నారు. వ్యాక్సిన్ వేయించుకోకపోతే వ్యాధి సోకే అవకాశం ఉందని, ఆ వ్యాధి ముదిరే వరకు జబ్బు సోకిన విషయమే తెలియదని అన్నారు. వ్యాధి ముదిరితే అతి ఖరీదైన లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ తప్ప మార్గాంతరమే లేదన్నారు. ఫౌండేషన్ డైరెక్టర్ తోటకూర సీతారామమ్మ, ఇన్నర్ వీల్ రోటరీ కార్యదర్శులు డాక్టర్ కొల్లా భాగ్యమాల, మానం శ్రీనివాసరావు, ఇన్నర్ వీలు ఉపాధ్యక్షులు జాస్తి ప్రమీల, కోశాధికారి తియ్యగూర రమాదేవి, గట్టు సరోజిని, భారతి, ఎం పద్మావతి, రోటరీ సభ్యులు మోహనరావు, ఓబూరి సాంబశివరావు, డి లక్ష్మీనారాయణ, టి వెంకటేశ్వరరావు, ఎం లక్ష్మీనారాయణ, హేమ, తోటకూర వెంకటనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## 'ఆరెకట్ల' ఆధ్వర్యంలో ..'ఇంటింటికీ తెలుగుదేశం'


**చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి సంక్షేమం రెండేళ్ల పాలనపై తెలుగుదేశం పార్టీ చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం" లో భాగంగా నియోజవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని 18వ వార్డులో



వార్డు పార్టీ అధ్యక్షుడు ఆరెకట్ల కోటేశ్వరావు ఆధ్వర్యంలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం గురించి తెలియజేసి వారికి పథకాల గురించి వివరించి మై టిడిపి యాప్ లో అప్లోడ్ చేయడమైనది...మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎస్ సుభాని, కోక్లక్టర్ సయ్యద్ వహాబ్, శివాలయం కమిటీ చైర్మన్ మేకనబోయిన సాంబశివరావు మరియు ముఖ్య నాయకులు షేక్ మౌలాలి, కొండా శ్రీను, తిరుమలశెట్టి శ్రీను, తంగెళ్ల రామ్మోహన్, చెన్నూరి చిరంజీవి, గోపతోటి అన్నారావు, కోయలగుంట చంద్రశేఖర్, తుళ్లూరు సాంబశివరావు, షేక్ ఖాదర్ వలీ, వెజండ్ల సుబ్రహ్మణ్యం, చిరంజీవి పాల్గొన్నారు.

## కోటేశ్వరమ్మకు ఎమ్మెల్సీ 'మర్రి' నివాళి

**చిలకలూరిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** చిలకలూరిపేట పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తాళ్ళ అంజిరెడ్డి అత్తయ్య ఓగిరాల కోటేశ్వరమ్మ గతనెల 24న మృతిచెందారు. శుక్రవారం పెద్దకర్మ కార్యక్రమం ప్రతిపాటి గార్డెన్స్ లో జరిగింది. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ హాజరైన కోటేశ్వరమ్మ మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో లంకా ఆదినారాయణరెడ్డి, రఘురాం రెడ్డి ,శివారెడ్డి, రావికింద సాంబశివరావు, నిడమానూరి హనుమంతరావు ,సత్యనారాయణ తదితరులున్నారు



# ముగిసిన తల్లిపాల వారోత్సవం

**రేపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ప్రపంచ తల్లిపాల వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించారు.గర్భిణీలు,బాలింతలు,పిల్లల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత



గురించి అవగాహన కల్పించారు.ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలు,అనంతరం ఇంట్లో లభించే పోషకాహారాన్ని అందించాలని సిడిపివో ఎం.సుచిత్ర తెలిపారు.రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు వినియోగించాలన్నారు.ఎట్టి పరిస్థితులలో రెండేళ్ళ లోపు పిల్లలకు ఉప్పు,చక్కెర,ప్యాకెట్ ఆహారం,శీతల పానీయాలు,జంక్ ఫుడ్స్ ఇవ్వకూడదని వివరించారు.ప్రధానంగా పిల్లలకు ధాన్యాలు,పప్పులు,ఆకుకూరలు, కూరగాయలు,పండ్లు,పాలు,పెరుగు,గుడ్లు,ఇంట్లో తయారు చేసిన తాజా పోషకాహారం అందించడం వలన ఆరోగ్యవంతమైన ఎదుగుదల,రోగ నిరోధక శక్తి పెంపు,మెదడు అభివృద్ధి సాధ్యపడుతుందని సుచిత్ర సూచించారు.మిషన్ వాత్సల్య,స్పాన్సర్‌షిప్ పథకం,దత్తత విధానం,అనాథలు,అర్ధ అనాథలు,నిరాశ్రయులు,ఆపదలో ఉన్న పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంరక్షణ చర్యలు,ప్రయోజనాలపై ఐసిపిఎస్ ప్రతినిధి కృష్ణ శ్రీప్రియ, ఛైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది అవగాహన కల్పించారు.అవసరమైన సమయాల్లో 1098 హెల్ప్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.తల్లిపాలు శిశువుకు తొలి టీకా,ఆరోగ్యానికి తొలి అడుగు,పుట్టిన గంటలోనే తల్లిపాలు ప్రారంభిద్దాం,6 నెలలు తల్లిపాలే ఇవ్వండి బిడ్డను ఆరోగ్యంగా పెంచండి,తల్లిపాలే ప్రేమ,పోషణ,రక్షణ,తల్లిపాలను ప్రోత్సహిద్దాం శిశు ఆరోగ్యాన్ని కాపాడదాం,తల్లిపాలు తాగిన బిడ్డ ఆరోగ్యానికి చిరునామా,తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది,తల్లిపాలే బిడ్డకు ఉత్తమ పోషకాహారం,తల్లిపాలను అందిద్దాం ఆరోగ్యవంతమైన భారతాన్ని నిర్మిద్దాం అనే నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయికృష్ణ,డాక్టర్ రమేష్,సూపర్ వైజర్లు హిమబిందు,రాధిక,జ్యోతిలక్ష్మి,నాగలక్ష్మి,సునీత,వెంకట రమణమ్మ,ఐసిపిఎస్,ఛైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది,ఎఎన్ఎంలు ,ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ కార్యకర్తలు,అంగన్‌వాడీ సహాయకులు,గర్భిణీలు ,బాలింతలు,తల్లులు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశం కోసం మధ్యవర్తిత్వం 3.0 సద్వినియోగం చేసుకోండి

**-ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రుక్మిణి**

**పొన్నూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అక్టోబరు 1వ తేదీ నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు దేశం కోసం మధ్యవర్తిత్వం 3.0కార్యక్రమం జరుగుతుం దని, అర్హులందరూ సద్వినియోగం పొందాలని కోరారు. న్యాయవాదులు కూడా దేశం కోసం మధ్యర్తిత్వం అనేక కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి, ప్రజల్లో అవగాహన కలి ్పంచాలని కోరారు. కోర్టు నుండి బయలు దేరిన ర్యాలీ పట్టణంలోని పలు రహదారుల్లో




చేసుకోవాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ జి.రుక్మిణి సూచించారు. దేశం కోసం మధ్యవర్తిత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రుక్మిణి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా రాజీ పడదగిన కేసులలో రెండు వైపులా కక్షిదారులు కోర్టుకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. దీనికి న్యాయవాదులు కూడా సహకరిం చాలన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని లబ్ది సాగింది. ఈ కార్యక్రమంలో జడ్జి రుక్మిణితోపాటు రెండవ తరగతి మెజిస్ట్రేట్ మురళీ మనోహర్ దాసు, బార్ అసోసియేషన్ కార్యదర్శి పొందుగల చైతన్య, న్యాయవాదులు మగ్బుల్‌బేగ్, టి.ఆండ్రూస్, వి.సదానందరావు, పి.విజయ కుమార్, బొనిగల రాజారావు, బి.ప్రకాష్, ఎంవిహెచ్ఎస్ సాయిబాబు, యన్.కృష్ణ, బి.అంకమ్మరావు,రాధాకృష్ణ, సుధాకరరావు, వేణు, లక్ష్మీకాంత్,మల్లెల ఈరేసు, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయవాద గుమాస్తాలు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

# వీరాంజనేయుని దర్శించుకున్న మాజీ చీఫ్ జస్టిస్ రమణ

**పొన్నూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్దిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామివారి ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ వీరాంజనేయస్వామివారిని మాజీ చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణ శుక్రవారం దర్శించుకున్నారు.



ఎన్.వి.రమణకు దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులు, కార్య నిర్వహణాధికారి, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అర్చకస్వాములు శ్రీ వీరాంజనేయస్వామివారికి అష్టోత్తరం, సహస్రనామార్చనలను నిర్వహించారు. అనంతరం ఎన్.వి.రమణకు శేష వస్త్రాన్ని బహూకరించారు. దేవాలయం కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు, ఛైర్మన్ గుప్త స్వామివారి ప్రతిమను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, అర్బన్ సిఐ రేవు శ్రీనివాస కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.203 కోట్ల చేనేత బకాయిలు చెల్లించని కూటమి ప్రభుత్వం

**భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.203 కోట్ల బకాయిల గురించి కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి,ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ సమితి సభ్యుడు గొట్టుముక్కల బాలాజీ ఆందోళన వెలుబుచ్చారు.శుక్రవారం భట్టి ప్రోలు రథం సెంటరులో జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా చేనేతల డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ నిధుల కొరత కారణంగా సహకార సంఘాలు నిర్వీర్యమవుతున్నాయని,వీటిపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు.ఇప్పటికైనా సహకార సంఘాలకు బకాయిలను విడుదల చేసి పాలకవర్గ ఎన్నికలను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం(సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురుగుడు సత్యనారాయణ మాట్లాడుతూ చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.నేత నేసే ప్రతి చేనేత కార్మికునికి నేతన్న సేవ పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అదే విధంగా సొంత ఇల్లులేని చేనేత కార్మికునికి ప్రభుత్వ హామీ ప్రకారం 3 సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేసి ఇంటిని నిర్మించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.చేనేత సహకార సంఘాలు,చేనేత కార్మికులు అపరిష్కృతంగా నిలిచిన సమస్యలపై ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని



సత్యనారాయణ పిలుపునిచ్చారు.ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకుడు మర్రివాడ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేతన్న సేవ పథకం ద్వారా రూ.25 వేలు ఇవ్వడాన్ని అభినందిస్తున్నామన్నారు.చేనేత కార్మికులు,పరి శ్రమ చవిచూస్తున్న సమస్యలను ఐక్య కార్యాచరణ కమిటీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళామని చెప్పారు.పరిష్కారం లభించే వరకు పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు దీపాల సత్యనారాయణ,కొడాలి రామకోటేశ్వరరావు,బట్టు నాగమల్లేశ్వరరావు,కౌతరపు పార్ధసారధి,కొర్నిపాటి వీరమోహన్ రావు,దీపాల సాంబశివరావు,బట్టు సుబ్బారావు,కౌతరపు సీతారామయ్య,ఒరుగంటి వీరప్రసాద్,తిరువీధుల రామ సుబ్బారావు,తాడిపత్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేతో రైతులకు ప్రయోజనం : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 7, ప్రభాతవార్త:కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భూముల రీ సర్వే ద్వారా పూర్తి హకు ్కలను కల్పిస్తూ పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీతో రైతులకు ప్రయోజనం చేకూరుతున్నదని మాజీ మంత్రి,వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు స్పష్టం చేశారు.శుక్రవారం వేమూరు నియోజకవర్గంలోని భట్టి ప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అధ్యక్షతన జరిగిన సభలో 1244 పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ గతంలో సరైన సర్వే రికార్డులు అందుబాటులో లేకపోవడం వలన ఇరుగు పొరుగు వారితో సమస్యలు వస్తుండేవన్నారు.ప్రస్తుతం అటువంటి పరిస్థితులు తలెత్తని విధంగా భూముల రీసర్వేను నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నందునే ప్రజలకు ప్రయోజనం లభిస్తున్నదని చెప్పారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను పూర్తిగా పరిశీలించి పరిష్కరించాలని




సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.నాగరాజు,ఎంపిడివో ఎస్.వెంకటరమణ,వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ జిజెవి పూర్ణకుమారి,రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ ఎంపి శ్రీనివాసకుమార్,భట్టి ప్రోలు పిఎసిఎస్ ఛైర్మన్ పి.రమేష్, వి.జగన్నాథరావు,వై.జయశీలరావు,డొక్కు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో యువత సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం : పీటా నాగమోహన్ కృష్ణ

**రేపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత వైసీపీ పాలనలో యువత సంక్షేమం నెరవేరిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో యువత సంక్షేమం ప్రశ్నార్థకంగా మారిందని వైకాపా రేపల్లె



నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ ఆరోపించారు.శు క్రవారం రేపల్లెలోని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటి ఆవరణలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎస్సీ లో అక్రమాలు జరిగాయని,అందుకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నిరుద్యోగ భృతి చెల్లించడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో డిఎస్సీ పోస్టులను అంగడిలో కూరగాయలను అమ్మిన ట్లుగా కూటమి ప్రభుత్వం విక్రయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రమేయం కూడా ఉందని స్పష్టం చేశారు.భర్తీ చేసిన డిఎస్సీ నియామకాలను రద్దు చేసి పారదర్శకంగా తిరిగి భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని ఆయన ప్రకటించారు.కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్యాయం చేస్తున్నదన్నారు.చేనేత కార్మికులందరికీ విద్యుత్ సబ్సిడీ సదుపాయం కల్పించడంలేదని చెప్పారు.చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే వైకాపా ఆధ్వర్యంలో ఆందోళన ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు యార్లగడ్డ మదన్ మోహన్,కరేటి శేషగిరిరావు,చిమటా బాలాజీ,రాంబాబు,రేపల్లె నియోజకవర్గంలోని వైకాపా నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రేపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రేపల్లెలోని 132/33 కెవిఎస్ఎస్ అత్యవసర మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్యామ్ సుధాకర్ బాబు శుక్రవారం తెలిపారు.రేపల్లె పట్టణం, రేపల్లె,భట్టి ప్రోలు మండలాల్లోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

**భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 7, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు మండలంలోని ఓలేరు క్రాస్ రోడ్డు దాటిన తర్వాత రేపల్లె మండలంలోని పెనుమూడి వైపు 216 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన కారణంగా 60-65 సంవత్సరాల వయసు గల వృద్ధురాలు



మృతి చెందింది.వృద్ధురాలి వివరాలను భట్టి ప్రోలు పోలీస్ స్టేషన్‌లో(9440900875) తెలియ జేయాలని ఎస్ఐ కె.అమీర్ శుక్రవారం తెలిపారు.

# ప్రతి విద్యార్థి డిపిటి వ్యాక్సిన్ వేయించుకోవాలి

**-మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి**

**పొన్నూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి తప్పని సరిగా డిపిటి వ్యాక్సిన్ వేయించుకోవాలని మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చెప్పారు. ఈ మూడు ప్రమాదకరమైన బ్యాక్టీరియా వ్యాధుల నుండి పిల్లలకు రక్షణ కల్పిస్తా యన్నారు. డిపిటి వ్యాక్సిన్ మూడు



వైద్యాధికారి షేక్ ఎండి హుస్సేన్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టి రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గోళ్ళమూడి పాడులోని నాట్కో స్కూల్‌లో 6,10వ తరగతి విద్యార్థులకు టిడి వ్యాక్సిన్ వేశారు.ఈ సందర్భంగా డాక్టర్ షేక్ ఎండి హుస్సేన్ మాట్లాడుతూ డిపిటి అంటే డిప్తీరియా, పెర్టుసిస్, టెటానస్ అనే వ్యాక్సిన్ అని అంటు వ్యాధుల నుండి రక్షించటానికి ఉపయోగ పడతాయన్నారు. అదేవిధంగా 10సంవత్సరాల నుండి 16సంవత్సరాలు నిండిన పిల్లలకు టిడి వా ్యక్సిన్ వేయించాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో నాట్కో స్కూల్ ప్రిన్సిపాల్ గంగాధర్, సీహెచ్ఓ ఎం.గాయత్రీదేవి,హెచ్‌విడి పుష్పలత, సూపర్‌వైజర్ ఎం.వేణు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# అమరావతి పెస్ట్ పోటీలకు ఆర్వీఐటీ విద్యార్థులు ఎంపిక

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 7,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చేబ్రోలు ఆర్వీఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు అమరావతి పెస్ట్ ఆటల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఆర్.వి.కృష్ణయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అమరావతి పెస్ట్




పోటీలలో అండర్-17విభాగంలో ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 26వ తేదీన తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సీహెచ్ గీతామాధురి, అండర్-23 వాలీబాల్‌లో, దీపక్, నవీన్, గోపి, డేవిడ్ ఎంపికకాగా, హాకీ ఆటకు షేక్ సమీర్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు నూరుద్దీన్, షటిల్ బాడ్మింటన్‌కు వెంకటేష్ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

# తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన వరం

**నిజాంపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన వరమని సిడిపిఓ అనసూయ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని కొత్తపాలెం శివారు పాతూరులో తల్లిపాల వారోత్సవాల



ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. బిడ్డకు 6 నెలలు వచ్చే వరకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. తల్లిపాల వల్ల బిడ్డలలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూపరాణి, గ్రామపెద్దలు గోపాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయం

**రేపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:** చేనేత పరి శ్రమ,కార్మికుల సంక్షేమం కోసం తుది శ్వాస విడిచే వరకు కృషి చేసిన చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయమని వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా



నాగమోహన్ కృష్ణ అన్నారు.శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రేపల్లె చేనేత సహకార సంఘం ప్రాంగణంలోని దివంగత ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.నియోజకవర్గంలోని ప్రజలకు చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు,పట్టణ వైకాపా అధ్యక్షుడు కరేటి శేషగిరిరావు,చిత్రాల ఓబేదు,యార్లగడ్డ మదన్ మోహన్,ఎ.చాముండేశ్వరీ ప్రసాద్,చేనేత కార్మికులు,వైకాపా శ్రేణులు పాల్గొన్నారు.

# పుట్టిన శిశువుకు ముర్రుపాలు తాపించాలి

**పొన్నూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త:** పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు తాపించాలని, తద్వారా శిశువులో రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్.షారోన్ తెలిపారు. పట్టణంలోని వసతివాడ అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో డాక్టర్ షారోన్



మాట్లాడుతూ తల్లిపాలల్లో శిశువుకు ఉపయోగపడే పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. ప్రతి తల్లి తమ బిడ్డలకు తల్లిపాలను ఇచ్చేవిధంగా చూడాలన్నారు. తల్లిపాలు తాగిన శిశువులు సంపూర్ణమైన ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. తల్లిపాలు వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయన్నారు. ప్రతి తల్లి రెండు సంవత్సరాల వరకు బిడ్డకు పాలు పట్టాలన్నారు. ఆరె నెలల కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలన్నారు. ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారంతోపాటుగా 2సంవత్సరాల వరకు తల్లిపాలు పట్టాలని తెలిపారు. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లి గర్భ సంచి యథాస్థితికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఓ వి.సువార్తకుమారి, ఎఎన్ఎం కె.సుజాత, అషావర్కర్ జి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ కె.వెంకటేశ్వరమ్మ,పి.కుసుమకుమారి, సిహెచ్ కుమారి, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఫసల్ బీమా సద్వినియోగం చేసుకోండి

**-వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ పఠాన్ రిజ్వానా**

**పొన్నూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే వివిధ మార్గాల ద్వారా సాగు చేపట్టిన పంటలను కాపాడుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ పఠాన్ రిజ్వానా సూచించారు. మండల పరిధిలోని నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కొండా వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు మారుతున్న కాలానికి తగ్గట్లుగా వ్యవసాయ పద్ధతులను కూడా మార్చుకోవాల్సిన అవసం ఎంతైనా ఉందన్నారు. రైతుల ప్రకృతి వ్యవసాయంపై కూడా దృష్టి



వెల్లలూరు, మామిళ్ళపల్లి తదితర గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. వరి వెదసాగు చేపట్టిన రైతులు తప్పనిసరిగా ఎకరాకు రూ.8వందలు చెల్లించి రూ.40వేలు బీమా సౌకర్యాన్ని పొందాలని కోరారు. బీమా చెల్లించడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట పెట్టాలన్నారు.ప్రకృతి వ్యవసాయంలో పిఎండి కిట్ల ద్వారా పశుగ్రాస కొరతను అధిగమించవచ్చని ప్రత్యేకాధికారి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్,ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, డిప్యూటీ ఎంపిడిఓ వేముల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి

**రేపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:** మధ్యవర్తిత్వం మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ కార్యక్రమం




దోహదపడుతున్నందున సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఇసుపల్లిలోని పాల కేంద్రం వద్ద నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పారా లీగల్ వాలంటీర్లు అవగాహన కల్పించారు.న్యాయపరమైన హక్కులు,చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు రాచాబత్తుని శ్రీనివాసరావు,వాగోలు బాబూరావు,ఆలా మోషే,తాహిర్ అహ్మద్,జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## తెనాలి మండలంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తెనాలి ఆగస్టు7(ప్రభాతవార్త):** తెనాలి రూరల్ మండలంలోని గ్రామాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్, తెనాలి రూరల్ సబ్‌డివిజన్ అధికారులు తెలిపారు.33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో గల లైన్ల మరమ్మతులు మరియు లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, కొలకలూరు, కాజీపేట, హాఫ్ పేట మరియు గుడివాడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని తెలిపారు.కావున వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని తెనాలి రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. విశ్వనాథం సూచించారు.

# ప్రతి రైతు ఆరుతడి పంటలను వేయాలి

**నగరం, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ప్రతి రైతు ఆరుతడి పంటలను వేయాలని ఏపీ సి.ఎన్.ఎఫ్ విభాగం బాపట్ల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్. మధుమోహన్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీకోసం ఎల్ నినో ప్రభావం నివారణ కార్యచరణ ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం అంటే పసిఫిక్ మహాస ముద్రంలో మధ్య మరియు తూర్పు ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.5 నుండి 3 డిగ్రీల మేర పెరగడాన్నే ఎల్ నినో అంటారని తెలిపారు. ఎల్



నినో ప్రభావం వల్ల వ్యవసాయ ఉద్యాన పంటల దిగుబడి తగ్గడం, పశువులకు నీరు, మేత కొరత, వ్యాధులు చీడపీడల ప్రభావం ఎక్కువ అవ్వడం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నష్టంలో కూరుకుపోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని నివారించడానికి ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో ప్రతి రైతును ప్రతి భూమిని సందర్శించడం, నీటి కొరత, చీడపీడల వల్ల పంట నష్టం రాకుండా అంచనా వేయడం, తక్కువ నీరు కావలసిన పంటలు విత్తన గుళికలు ప్రత్యామ్నాయ పంటలు సూచించడం, కరువులు తట్టుకునే రకాల విత్తనాలు ఇవ్వడం, ఏపీ ఏఐఎంఎస్ 2.0 ద్వారా పర్యవేక్షణ, పిఎండిఎస్ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం జాగ్రత్తలను ప్రతి ఒక్క రైతుకు సూచించి వారిని ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు లుక్కా గుదారంకయ్య, మండల వ్యవసాయ అధికారి వి. రమేష్ బాబు పాల్గొన్నారు.

# పోతురాజుకు జాతీయస్థాయిలో రజత పతకం

**పొన్నూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డి.పోతురాజు జాతీయస్థాయిలో రజత పతకాన్ని సాధించారు. హైదరాబాదులోని గచ్చిబౌలి జీఎంసీ బయో ఇండోర్ స్టేడియంలో జరిగిన 11వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్-2026పోటీల్లో భాగంగా ఈ పతకాన్ని సాధించారు. పోతురాజు పెన్‌కక్ సిలట్ 110కిలోల విభాగంలో రజత పతకం సొంతం చేసుకొని ప్రతిభను చాటుకున్నాడు.



విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కానిస్టేబుల్ పోతురాజును అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించే విధంగా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. పోతురాజును పొన్నూరు రూరల్ సిఐ కృష్ణయ్య, చేబ్రోలు ఎస్సై వీరనారాయణ తదితరులు అభినందించారు.

# డిపో మేనేజర్‌గా మోహన్‌కృష్ణ యాదవ్

**పొన్నూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త:** పొన్నూరు ఆర్టీసి డిపో మేనేజర్‌గా కొలుసు మోహన్ కృష్ణ యాదవ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న గురవారెడ్డి గుంటూరు-2 డిపోకు బదిలీ అయ్యారు, దీంతో ఇక్కడ ఏర్పడిన ఖాళీలో మాచర్ల డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌కృష్ణ యాదవ్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. ఈ



సందర్భంగా మోహన్‌కృష్ణ యాదవ్ మాట్లాడుతూ పొన్నూరు డిపోపై పూర్తి అవగాహన పెంచుకొని డిపో అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఉద్యోగులు, సిబ్బంది, కార్మికుల సహాయ సహకారాలతో డిపో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నూతనంగా విధుల్లోకి చేరిన మోహన్‌కృష్ణ యాదవ్‌కు సిబ్బంది, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు అభినందనలుతెలిపారు.

# వ్యాపార రంగానికి గుంటూరు అనుకూలం

## పెట్టుబడిదారులు సద్వినియోగం చేసుకోవాలి

### - బీ2 ఎక్స్ పో కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త :ఇన్వెస్ట్మెంట్ ఇండియా ద్వారా ఆంధ్రప్రదేశ్ కు రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, ప్రపంచంలోనే ఏపీ పెట్టుబడుల స్వర్గధామంగా మారుతుందని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడుల విప్లవం ప్రారంభమైందని చెప్పారు.



గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక అమరావతి రోడ్డు లోని బండ్లమూడి గార్డెన్స్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన ధృతి బీ 2 ఎక్స్ పో కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరును పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు బీ2 ఎక్స్ పో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బీటూ ఎక్స్ పో ను విజిట్ చేసి వ్యాపారంలో నైపుణ్యం పొందాలని సూచించారు. గుంటూరు అవసరాలను గుర్తించి అవసరమైన అన్ని విభాగాల్లో 140 స్టాల్స్ గూగుల్ వంటి కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం శుభపరిణామమని తెలిపారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణం ప్రారంభమయ్యాక గుంటూరుకు పారిశ్రామికంగా ప్రాధాన్యత పెరిగిందన్నారు. రాజధానికి అనుసంధానంగా గుంటూరు జిల్లా ఉందని, అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తుందని తెలిపారు. ఏయే రంగాలు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయో గుర్తించుకోవాలని సూచించారు.

# గోల్డ్ లోన్ ఎగ్జిక్యూటివ్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

**గుంటూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త:** గోల్డ్ లోన్ ప్రాసెసింగ్ ఎగ్జిక్యూటివ్ ఉచిత శిక్షణకు డిగ్రీ పూర్తిచేసి నిరుద్యోగులుగా ఉన్న అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి విజయ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బజాజ్ ఫైన్ సెర్వ్ యొక్క స్కిల్ సెర్వ్ ప్రోగ్రాం (ప్రధాన సీఎస్ఆర్ కార్యక్రమం) ఆధ్వర్యంలో, క్యూస్ కార్పొరేషన్ సహకారంతో నిర్వహించబడు తున్న ఉచిత గోల్డ్ లోన్ ప్రాసెసింగ్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ నిరుద్యోగ అభ్యర్థుల కోసం నిర్వహించే కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమం బ్యాంకింగ్ మరియు ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందాలను కునే డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడినదని చెప్పారు. ఈ శిక్షణ ద్వారా అభ్యర్థులకు ఉద్యోగానికి అవసరమైన ప్రాయోజిక నైపుణ్యాలను అందించి, పరిశ్రమలో ఉపాధి అవకాశాలకు సిద్ధం చేయడం దీని ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.ఈ శిక్షణలో గోల్డ్ లోన్ ప్రాసెసింగ్, కస్టమర్ సర్వీస్, బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రాథమికాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఇంటర్వ్యూ ప్రిపరేషన్, ఉద్యోగానికి అవసరమైన ప్రొఫెషనల్ నైపుణ్యాలు, తదితర అంశాలపై బోధిస్తారని తెలియజేశారు. ఈ శిక్షణను అనుభవజ్ఞులైన పరిశ్రమ నిపుణుల ద్వారా నిర్వహిస్తూ, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు సంబంధిత సంస్థల నియామక మరియు ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించిన అనంతరం, ప్రముఖ సంస్థల్లో ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించబడతాయన్నారు. ఈనెల 10వ తేదీన బ్యాచ్ ప్రారంభమవుతుందని చెప్పారు.

ఈ శిక్షణకు డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ అభ్యర్థుల నుండి ఇప్పటికే రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనాయని వెల్లడించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గుంటూరు నగరంలోని బ్రాడీపేట 4 /1, రఘు మాన్షన్,1వ అంతస్తు, శంకర్ విలాస్ ఎదురు కార్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.రిజిస్ట్రేషన్ కోసం సంస్థ ప్రతినిధి విజయ్, మొబైల్ నంబర్ 82478 92792 ను సంప్రదించాలని కోరారు.

# ఆచార్య ఎన్.జి.రంగా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

**గుంటూరు విద్య ఆగస్టు 7 ప్రభాతవార్త :** రైతాంగం, గ్రామీణ సమాజం, వ్యవసాయాభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయ నాయకుడు ఆచార్య ఎన్.జి. రంగా , ఆయన ప్రముఖ శిష్యులు రచించిన విలువైన గ్రంథాల పునర్ముద్రిత ప్రతులను ఎన్.జి. రంగా ఫౌండేషన్ ప్రతినిధులు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ సమక్షంలో విశ్వవిద్యాలయానికి అందజేశారు. లాం లోని పరిపాలనా భవనంలోని బోర్డు సమావేశ



మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆచార్య ఎన్.జి. రంగా సుసంపన్నమైన మేధో, సాహిత్య వారసత్వాన్ని పరిరక్షించడంతోపాటు దానిని విస్తృతంగా ప్రజలకు, విద్యార్థులకు చేరవేయాలనే లక్ష్యంతో ఈ గ్రంథ సముదాయాన్ని విశ్వవిద్యాలయానికి అప్పగించారు. ఈ సందర్భంగా గౌరవ ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ అమూల్యమైన గ్రంథాలను పునర్ముద్రించి, భద్రపరిచేందుకు ఎన్.జి. రంగా ఫౌండేషన్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఆచార్య ఎన్.జి. రంగా , ఆయన శిష్యుల రచనలు వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ఆర్థిక శాస్త్రం, భారతదేశ సామాజిక-రాజకీయ చరిత్రపై విలువైన అవగాహనను కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ గ్రంథాలు విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యావేత్తలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని; ఆచార్య ఎన్.జి. రంగా దూరదృష్టి, తాత్విక దృక్పథం, ఆయన సమకాలికుల సేవలను యువతరం అర్థం చేసుకునేందుకు ఇవి దోహదపడతాయని ఆయన తెలిపారు.ఈ ముఖ్యమైన సాహిత్య, చారిత్రక వారసత్వ పరిరక్షణ దిశగా చొరవ చూపిన ఎన్.జి. రంగా ఫౌండేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.జి. రంగా ఫౌండేషన్ ప్రతినిధులు కిషోర్ , ప్రసాద్ , మిత్ర, పుండరీకాక్షుడు , జక్కంపూడి సీతారామయ్య తదితరులతోపాటు విశ్వవిద్యాలయ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాధాన్యం పై అవగాహన

**కాకుమాను ఆగస్టు 7 (ప్రభాత వార్త) :** తల్లిపాల వారోత్సవాలలో బాగంగా మండల పరిధిలోని కొండపాటూరు గ్రామంలోని ఎస్ టి కాలనీలోని అంగన్వాడీ కేంద్రం లో తల్లిపాల ప్రాముకృత పై అవగాహన నిర్వహించినట్లు మండల ఐ సి డి ఎస్ సూపర్వైజర్ పి. వెంకాయమ్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, మురుపాల అవసరం, తల్లి తీసుకోవాల్సిన పోషకాహారం, బిడ్డకు సరైన



పాలు పట్టించే విధానం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాల్సిన అవసరం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులు పట్ల రైతులు అప్రమత్తమై సాగు చేపట్టాలి

చెరుకుపల్లి ,ఆగస్టు 7, ప్రభాతవార్త: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి వి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని గూడవల్లి గ్రామంలో క్షేత్ర పర్యటన నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి ఎండి ఫరూక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను అంచనా వేస్తూ, తగిన పంటలను సాగు చేస్తూ ,నీటి సంరక్షణ పాటిస్తూ ఉత్పత్తులను సాధించాలని సూచించారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలనుండి రక్షణ పొందే విధంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారుల సూచనలు ఎప్పటికప్పుడు పాటిస్తూ ఉండాలని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ బి రామచంద్ర రావు ,డాక్టర్ కె వి ఎస్ దుర్గాప్రసాద్, డాక్టర్ కె అచ్యుతరాజు, డాక్టర్ కృష్ణవేణి ,డాక్టర్ సంధ్యారాణి ,ఏ డి ఏ వి. రమేష్ బాబు, స్థానిక అధికారులు, రైతులు పలువురు పాల్గొన్నారు.

# శిశువు ఆరోగ్యానికి బలమైన ఆహారం తల్లిపాలే

### -పొన్నూరు ఐసిడిఎస్ ఏసిడిపిఓ విజయరాణి

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 7,ప్రభాతవార్త:** తల్లిపాలు కేవలం శిశువుకు ఆహారం మాత్రమే కాదని, జీవితాంతం ఆరోగ్యానికి బలమైన పునాది వేస్తాయని పొన్నూరు ఐసిడిఎస్ ఎసిడిపిఓ బి.విజయరాణి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు ఎడ్లపాటి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సెక్టార్ సూపర్‌వైజర్ నాగరాజకుమారి అధ్యక్షత వహించారు. సభలో విజయరాణి మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డతోపాటు తల్లికి



కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు.తల్లిపాలు బిడ్డకు తొలి టీకా లాంటిదన్నారు. వైద్యుల ప్రకారం తల్లిపాలను ప్రకృతి ప్రసాదించిన తొలి టీకాగా చెప్పవచ్చన్నారు. నాగరాజకుమారి మాట్లాడుతూ ముఖ్యంగా పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాహారం అందుతుందన్నారు. అంతేకాకుండా బిడ్డ ఎదుగుదలకు అనుగుణంగా తల్లిపాల పోషక విలువలు కూడా సహజంగానే మారుతూ ఉండడం దీని ప్రత్యేకత అన్నారు. పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు పాలు పోషక విలువలతో కూడి ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు షేక్ సలీమా, పి.విమల, జి.రజని, షేక్ వారిసా, సిహెచ్ విజయలక్ష్మి, వీరకుమారి, ఎమ్మెస్ కె గోవిందమ్మ, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, బాలింతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులు

**తెనాలి ఆగస్ట్7(ప్రభాతవార్త):** పట్టణంలోని రైల్వే స్టేషన్ దగ్గర గల ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక కార్యాలయం నందు,ప్రజా యుద్ధనౌక కామ్రేడ్ గద్దర్ మూడవ వర్ధంతి మరియు చుండూరు మృతవీరుల స్మారక సభ నిర్వహించారు.35 సంవత్సరాల చుండూరు మృతవీరుల వీర గాధను




దళితులపై జరిగినటువంటి దారుణ మారణకాండ ఇప్పటికీ మరచిపోలేని విధంగా చుండూరు గడ్డపై అమరులైన దళిత యువతను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు, స్థాపకులు అక్కిదాసు కిరణ్ కుమార్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జై భీమ్ ఫెడరేషన్ అధ్యక్షులు కట్టేవరపు దేవయ్య, అంబేద్కర్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్,షేక్ దుబాయ్ బాబు,కనపర్తి అనిల్ ,కుర్రా జశ్వంత్ ఏతాటి అనిల్ యాదవ్, నాలాది బుజ్జిబాబు,కనపర్తి రంగారావు, గోల్డ్ సందీప్ రఫీ కనపర్తి శశి, ఉన్నవ నానీ, నిట్టబాలు,మోపిదేవి నాగేశ్వరరావు,పలువురు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# రైతులకు పంట కాలువ సమస్యను పరిష్కారించిన తహసీల్దార్ గోపాలకృష్ణ

**తెనాలి ఆగస్ట్7(ప్రభాతవార్త):** తెనాలి మండలం పెదరావూరు గ్రామ పరిధిలోని పంట కాలువలో నీటిపారుదలకు ఆటంకం ఏర్పడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం గమనించిన తెనాలి మండల తహసిల్దార్ కేవీ. గోపాలకృష్ణ స్పందించారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ, అగ్రికల్చర్ శాఖ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్యను పరిశీలించారు. కాలువలో పేరుకుపోయిన మట్టి, పూడికల కారణంగా నీరు సక్రమంగా ప్రవహించడం లేదని గుర్తించి, వెంటనే జేసీబీ సహాయంతో పూడిక తీత పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ రైతులతో మాట్లాడి



వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తక్షణమే నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, ఇలాంటి సమస్యలు వస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, అగ్రికల్చర్ శాఖ అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధి పనులపై మున్సిపల్ కమీషనర్ సమీక్ష

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 7(ప్రభాతవార్త):** పట్టణాభివృద్ధిపై శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో, అర్బన్ ప్రత్యేకాధికారి, జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా వివిధ శాఖల ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు



ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో, పురపాలక శాఖాధిపతులు, ఐసీడీఎస్, హౌసింగ్, ఏపీసీపీడీసీఎల్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి పెండింగ్ అంశాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

# మున్సిపల్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో అకడమిక్ ఇన్స్రక్టర్లను వెంటనే నియమించాలి

### నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు.

**గుంటూరు విద్య ఆగస్టు 6 ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల చేరికలు పెరగటం మరియు ఉపాధ్యాయుల పదవీ విరమణల నేపథ్యంలో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, ప్రభుత్వం వీలైనంత త్వరగా అకడమిక్ ఇన్స్రక్టర్లను నియమించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైమారావు మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా అధ్యక్షులు పి సాయి విశ్వనాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ పి లలిత బాబు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. భాస్కరరావు



అసోసియేట్ అధ్యక్షులు జె.వి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ప్రకటించారు.గౌరవ అధ్యక్షులు . ఏ. హర గోపాల్ పి ఎం సి, అధ్యక్షులు తుమాటి రవి ఎస్ కే బి ఎం .ప్రధాన కార్యదర్శి కె .వేణుగోపాల రావు కె ఎస్ ఆర్ టి .ఆర్థిక కార్యదర్శి వి . రామకృష్ణా స్కూల్ నెంబర్ 5, అసోసియేట్ అధ్యక్షులుశీలం శ్రీనివారావు ఎస్ కే బి ఎం, ఎం .కోటేశ్వరరావు హెచ్ఎం గుజ్జనగుడ్ల, టి .విజయరాజు ఎస్ సి ఎం పి ఎం సి, యం.ఊర్మిళ రాణి ఎస్ కే బి ఎం,. ఉపాధ్యక్షులు బాబురావు ఎం హెచ్ గుజ్జనగుండ్ల, వై. రమ ఎస్ సి ఎం పి ఎం సి, ఏ. ఏసేబు ఎస్ సీఎం పిఎంసి, బి .మంగా రావు ఎస్ కే బి ఎం, యం. ఝాన్సీ రాణి ఎస్ కే బి ఎం ,మహిళా సెక్రెటరీ కృష్ణవేణి ఎస్ కే బి ఎం , సెక్రటరీలు ఇందిరా ఎస్ కే బి ఎం, వి.త్రివేణి ఎం హెచ్, గుజ్జనగుండ్ల, మంగమ్మ ఎస్ కే బి ఎం , విజయ్ కుమార్ పి డి కె ఎస్ ఆర్ టి, ఎస్. తులసి స్కూల్ నెంబర్ 91, నాగిశెట్టి శ్రీనివాస్ ఎం హెచ్ స్వర్ణాంధ్ర నగర్, షేక్ జిలాని ఎస్కె బిపిఎం, యు.ప్రభావతి స్కూల్ నెంబర్18, ఇందిరా గుజ్జనగుండ్ల, ఏ ఎల్ జ్యోతి ,స్వర్ణ భారతి నగర్. రామానుజమ్మ 95 అశోక్ నగర్.ఆర్థిక కమిటీ సభ్యులు పి.హృదయ రాణి స్కూల్ నెంబర్.18.లు ఎన్నికై నట్లు ప్రకటించారు.

# నగరంలో ఉన్న చెరువుల అభివృద్ధి పై దృష్టి సారించాలి

### నగర కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 7 ( ప్రభాత వార్త ) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మానస సరోవరం పార్క్ లోని చెరువు, నల్లపాడులోని తెలగమాంబ చెరువుల అభివృద్ధి పనులను వారం రోజుల కాల వ్యవధిలో ప్రారంభించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం చెరువుల అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఏపీయుజిబిసిఎల్) ప్రతినిధులు, జిఎంసి ఎస్ఈలతో సమావేశం జరిగింది. ఈ



సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతిపాదిత చెరువుల అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ప్రణాళికాబద్ధమైన డే బై డే కార్యాచరణ ఉండాలని స్పష్టం చేశారు. చెరువుల అభివృద్ధిపై ఏపీయుజిబిసిఎల్ ప్రతినిధులు సిద్ధం చేసిన డిజైన్ల మేరకు పనులు జరిగేలా జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని, ఏపీయుజిబిసిఎల్ ప్రతినిధులు కూడా తాము సిద్ధం చేసిన డిజైన్ మేరకు పనులు జరుగుతున్నదీ, లేనిదీ పరిశీలించాలని సూచించారు. అలాగే నగరంలో చేపట్టిన ఇతర అభివృద్ధి పనుల్లో ఏపీయుజిబిసిఎల్ సిద్ధం చేయాల్సిన ప్రతిపాదనలను వెంటనే ఇవ్వాలన్నారు. ఈ సమావేశం లో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఏపీయుజిబిసిఎల్ నుండి నాగేంద్రకుమార్, ఆంజనేయులు, బేబి పాల్గొన్నారు.

# పంచకర్మ ఆయుర్వేదిక చికిత్స ద్వారా దీర్ఘ కాలిక వ్యాధులను నయం

### ఎండి చైర్మన్ డాక్టర్ శ్రీ కొండా వెంకటేశ్వర్లు

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్ట్ 7 ( ప్రభాత వార్త ) :** పంచకర్మ ఆయుర్వేదిక్ చికిత్స ద్వారా సోరియాసిస్ ,పక్షవాతం, డిస్క్ నడుము నొప్పి, ఫైల్స్ , ఫిస్టులా లాంటి దీర్ఘకాలిక వ్యాధులు నిర్వహించవచ్చుని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఎండి చైర్మన్ శ్రీ కొండా వెంకటేశ్వర్లు అన్నారు.



గురువారం స్థానిక విన్నర్ రింగ్ రోడ్ లోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ నందు గుఫిక్ హెల్త్ కేర్ , ముంబై , ఏవి ఎన్ ఆయుర్వేదిక్ మధురై వారి సహకారంతో బి ఎండి ఎముకలు పట్టిత్వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిభిరంను పొన్నూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తాళ్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఆయుర్వేదం చాలా పురాతనమైందని , ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్య వి దానమని ప్రజలందరూ ఆయుర్వేదిక్ పంచకర్మ ద్వారా చేసుకుని కోరారు. హాస్పిటల్ ఎండి చైర్మన్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తను ప్రసంగం కొనసాగిస్తూ శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ స్థాపించి 21 సంవత్సరాల సందర్భంగా నిర్వహించినట్లు తెలిపారు. సుమారు వేల రూపాయలు విలువైన వైద్య పరీక్షలు 90 మందికి చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా వెంకటేశ్వర ఆయుర్వేదిక్ ఉచిత వైద్య విధానం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాష్యం మెదక్ ప్రిన్సిపల్ హరిబాబు యోగ గురువు వైస్ మల్లికార్జునరావు , తాళ్ల బుజ్జి రెడ్డిపాలెం మాజీ సర్పంచ్ కాజా నాగరాజు హాస్పిటల్ డాక్టర్స్ మేనేజర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సి.కే.వి.ఎన్.డిగ్రీ కళాశాలలో పైతాన్ పై ముగిసిన శిక్షణ

## విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానము

**గుంటూరు విద్య ఆగస్టు 7 ప్రభాతవార్త :** గుంటూరు స్థానిక సంగడిగుంట లోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ద్వితీయ సంవత్సరము బీ.ఎస్సీ., బీ.కాం., మరియు బీ.సీ.ఏ., విద్యార్థులకు పైతాన్ కంప్యూటర్ కోర్సు గత మూడు నెలలుగా ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమము ముగింపు మరియు సర్టిఫికెట్స్ పంపిణీ జరిగినది.



ఈ కార్యక్రమమునకు జి.సి.కే. వీ. ఎన్. డిగ్రీ కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ అధ్యక్షత వహించగా, బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ గతంలో కంప్యూటర్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనేది కేవలం ఉన్నత చదువులు చదివిన వారికి మాత్రమే అందుబాటులో ఉండేదని, నేడది ప్రాథమిక స్థాయి అనగా ఎల్. కే. జి. చదువుతోనే ప్రారంభమవుతున్నదని అన్నారు. . కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ మాట్లాడుతూ నేడు ప్రపంచంలోని అన్ని లావాదేవీలు కూడా కరెన్సీ తో నిమిత్తం లేకుండా డిజిటల్ రూపంలోనే జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన విద్యార్థులు శిక్షణా కాలములో తాము పొందిన అనుభవాలను తెలియజేశారు. చివరిగా కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటన్నిటిని ఉపయోగించుకుని జీవితములో స్థిరపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ జయ ప్రకాష్, ఎన్.ఎస్.ఎస్. అధికారులు ఏ. శ్రీధర్, వై. చంద్రశేఖర్, కంప్యూటర్ ట్రైనర్ హరిలాల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వరి వెదసాగు రైతులు ప్రీమియం చెల్లించాలి

### -మండలవ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు

**పొన్నూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త:** మండలంలో వరి వెదసాగు చేపట్టిన రైతులు తప్పనిసరిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకానికి సంబంధించిన ప్రీమియం చెల్లించి లబ్ది పొందాలని మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని దండమూడి, మామిళ్ళపల్లి, చింతలపూడి గ్రామాల్లో రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ప్రీమియం చెల్లించడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా నష్టం వాటిల్లినట్లయితే నష్టపరిహారం



పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు చెల్లించాలన్నారు. రైతులు అవసరమైన ఎరువులు యాప్ ద్వారానే పొందాల్సి ఉంటుందన్నారు. ప్రతి రైతు తమ పేర్లను యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, సహాయకులు ఎ.భావన, పి.మాణిక్యరావు, సిహెచ్ రూప, డి.షకీన, ఎంపిఈఓ సింహాద్రి సురేష్‌బాబు తదితరులున్నారు.

MN 10 final:MN 10 final 01/01/2001 09:10 Page 1



# బీపీ మండల్ స్ఫూర్తితో డిమాండ్ల సాధనే లక్ష్యం

**గుంటూరు,ఆగస్టు7,ప్రభాతవార్త :** బీపీ మండల్ డే మరియు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీసీలతో ఒక సమావేశం నిర్వహించి చరిత్రలో జరిగిన విశిష్టత గురించి వక్తలు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం



జరిగింది. మొదటగా విశ్వకవి శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అనంతరం ఏపీసీసీ ఉపాధ్యక్షులు, అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ శ్రీ కొలనుకొండ శివాజీ మాట్లాడుతూ బీపీ మండల్ స్ఫూర్తితో రాబోవు రోజులలో మరింతగా విజృంభించి మన డిమాండ్లను సాధించుకోవలసిన అవసరం ఉందని చెప్పడం జరిగింది.కేంద్రం లో 2019 నుండి నేటి వరకు కేంద్ర సంస్థలైన ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ లకు 4365 నియామకాలు జరిగితే ఎస్సీలకు 334 (7.65 ), ఎస్టీలకు 166 (3.8 ), ఓబీసీలకు 695 (15.92 ), అమలు అయినవి.జనాభా ప్రాతిపదికన సంక్షేమ పథకాలు అందడం లేదు. కులగణన చేస్తామని చెప్పి ఆచరణలో పెట్టలేదు. ఎమ్యూనరేషన్ ఫారం లో కులగణన కాలం వొదిలివేయడం జరిగింది. 50 ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ల హక్కులు ఎన్డీయే ప్రభుత్వం హరిస్తుంది. సబ్ ప్లాన్ లు అమలు కావడం లేదు.చేనేత అభివృద్ధి గురించి ప్రకటనలు ఇస్తుంది గాని ఆచరణలో శూన్యం. వారి సహకార సంఘాల బాకీలు 203 కోట్ల రూపాయలు విడుదల చెయ్యలేదు. జీఎస్టీ నీ తగ్గించాలి, బ్యాంకు నుండి రుణాలు లేవు.ఔట్ బ్యాంకు రాజకీయాలు మానుకోవాలి. 1905 సంవత్సరం నుండి కాంగ్రెస్ స్వదేశీ ఉద్యమంలో భాగంగా రాష్ట్రంలో చేనేత కుటుంబాలను ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్కు ఉంది. ఈ వర్గాలకు చెందిన వ్యక్తులకు ఉమ్మడి ఏపీలో రాజ్యసభకు పంపిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని శివాజీ అన్నారు.నగర కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ నరహరిసెట్టి నరసింహారావు మాట్లాడుతూ మండల సిఫార్సులలో 27 మాత్రమే రిజర్వేషన్స్ అమలు అవుతున్నాయని, 50 రిజర్వేషన్స్ ఎన్నికలలో అమలుచేయాలని డిమాండ్ చేశారు. చేనేత దినోత్సవ సందర్భంగా వారికి మెరుగైన పని కల్పించి వారికి ఎక్కువ మంది చేనేత రంగంలో ఉన్నవారికి ప్రత్యేక స్కిల్ డెవలప్మెంట్ రుణాలు ఇచ్చి మహిళా బజార్లు వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో శ్రీ. వి.గురునాధం, శ్రీ మీసాల రాజేశ్వరరావు, శ్రీ అన్సారీ, శ్రీమతి సునీత, శ్రీ నల్లమోలు శ్రీనివాసరావు, శ్రీ ఎండి.షరీఫ్, శ్రీ అశోక్ కుమార్, శ్రీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ బంగారం ఆశ చూపి మోసగించిన మహిళ అరెస్ట్

**తెనాలి ఆగస్ట్7(ప్రభాతవార్త):** నకిలీ బంగారం ఆశ చూపి మోసగిస్తున్న మహిళను తెనాలి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, అంగలకుదురు గ్రామ కాపురస్తుడు పిన్నింటి మురళీకృష్ణ(50)అనే ప్రైవేట్ ఉద్యోగి,తన స్నేహితుల ద్వారా తక్కువ రేటుకు బంగారం వస్తుందని తెలుసుకొని సుమారు 110 గ్రాముల బరువు గల బంగారం పూసలను, ముగ్గురు వ్యక్తులు కలిసి మాయ మాటలు చెప్పి, నమ్మించి, మోసం చేసి 5 లక్షల, 50 వేల రూపాయలు ఇచ్చి బంగారం పూసలు తీసుకొని తరువాత సదరు బంగారు పూసలను కలిగించి అవి బంగారం కాదు అని మోసపోయానని తెలుసుకొని తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెనాలి రూరల్ పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం అంగలకుదురు గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద కేసులోని 3 ముద్దాయిగా గుర్తించిన, వడ్లమూడి గ్రామానికి చెందిన,బండి సువర్ణ కుమారి(55)(ప్రస్తుత నివాసం డోన్ పట్టణం, కర్నూల్ జిల్లా)అను ఆమెని అదుపులోనికి తీసుకొని విచారించగా చేసిన నేరమును మధ్యవర్తుల సమక్షంలో ఒప్పుకొని బాధితులు వద్ద నుండి తీసుకున్న 5,50,000 ను నగదును స్వాధీనం చేసుకుని, సదరు



కేసులో ఈ మహిళను మూడవ ముద్దాయిగా గుర్తించి అరెస్టు చేయడం జరిగినదని,మిగిలిన ఇద్దరు గోపాల్ , ప్రసాద్ ముద్దాయిలను కూడా త్వరలో అరెస్టు చేస్తామని రూరల్ ఎస్సీ ఆనంద్ తెలిపారు. ప్రజలు తక్కువ రేటుకు బంగారం, ఇతర విలువైన వస్తువులు అమ్ముతామనే ఆశలకు లొంగి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని,

# పేదలను ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### -మండల టీడీపీ అద్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి

**కొల్లివర,అగస్టు 7 ప్రభాతవార్త:** గ్రామాభివృద్ధి..ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని మండల టీడీపీ అద్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి



అన్నారు.శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నాయకులతో కలసి నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చిన కోటిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు జీవన విధానం మెరుగుపర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు.పేద ప్రజలను అన్ని విధాల ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.నాడు సూపర్‌సిక్స్‌లో ఏమైతే చెప్పాయో వాటిని అన్నింటినీ ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు.కార్యక్రమంలో గుడిబండి గోవర్ధనరెడ్డి,ఆరిమండ శివనాగమల్లీశ్వరరెడ్డి,కంచర్ల అమృతరాజు,బొంతు చంద్రిక,ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి,శ్యామల బుచ్చిరెడ్డి,జొన్నల నాగిరెడ్డి,జొన్నల శ్రీనివాసరెడ్డి,పిల్లి సత్యానందం,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు లేమితో వరికి బదులు

# అపరాల పంటలు వేసుకోవాలి : ఏడిఏ మోహన్రావు

ప్రత్తిపాడు, ఆగస్టు 7, ప్రభాతవార్త : ఈ వ్యవసాయ సీజన్లో రైతులు సాగునీరు లేనందున వరి పంటకు బదులు అపరాల పంటలకు ప్రాధాన్యత నివ్వాలని వ్యవసాయ శాఖ ఏడిఏ ఎన్.మోహన్రావు సూచించారు. మండలంలోని వంగిపురం గ్రామంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేయించుకోవాలని వివరించారు. కృషి విజ్ఞాన కీటక శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ మాట్లాడుతూ..వరి పంటను ఆశించే ప్రధాన కీటకాలు కాండం తొలచే పురుగు, సుడిదోమ, ఆకు ముడత పురుగు, తామర పురుగు, నల్ల, తెల్ల దోమ వాటి గుర్తింపు చిహ్నాలు మరియు వ యాజమాన్య నివారణ పద్ధతుల గురించి



నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ ఏడిఏ యన్. మోహన్రావు, కృషి విజ్ఞాన కీటక శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ హాజరైనారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ..ఈ ఏడాది సాగునీరు ఇవ్వనందున రైతులు వరికి బదులుగా మినుము, పెసర, ఇంకా ఆలస్యమైతే మిల్లెట్స్ పంటలు వేసుకోవాలని సూచించారు. కౌలు రైతులందరు తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డులు తీసుకోవాలని తెలియజేశారు. కౌలు కార్డు ద్వారా రైతులు ఎరువులు కొనుగోలు, పంట నమోదు, ఇన్సూరెన్సు వంటివి చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.ఈనెల15వ తేదీ లోపల వరి, మిరప, మినుము పంటలు సాగుచేసే రైతులు వరికి రూ.800లు, మిర్చి పంటకు రూ.2700లు, మినుము పంటకు రూ.200లను మీ దగ్గరలోని సిఎస్సి సెంటర్ ను సంప్రదించి పంటల భీమా వివరించారు. మండల వ్యవసాయాధికారి షేక్.సుగుణ బేగం మాట్లాడుతూ..ఎలినినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు నష్ట పోకుండా తక్కువ నీటితో సాగుచేసే ప్రత్యామ్నాయ పంటలైన మినుము, కంది పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఏపీసీఎస్ఎఫ్ ద్వారా అందించే పీఎండీఎస్ విత్తనాలను కూడా సాగుచేసుకుని అదనపు ఆదాయాన్ని పొందాలని తెలియజేశారు.హార్టికల్చర్ ఆఫీసర్ పి.సుజాత మాట్లాడుతూ..ప్రస్తుత డిపార్ట్మెంట్ స్కీమ్స్ గురించి వివరించారు. టైవాన్ స్ప్రేయర్ రూ.10వేలు, ఫార్మ్ పాండ్ రూ. 90వేలు సబ్సిడీలతో రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ రైతులు మరియు ఏపీసియన్యఫ్ సుబ్బారావు, రైతుసేవా కేంద్ర సిబ్బంది వై.నవ్య, వై.నీలంబరం, ఏఈఓలు, గ్రామ ఆదర్శ రైతులు, తదితరులు

# ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

**చెరుకుపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త :** గర్భిణీలు, బాలింతలు ఆరోగ్య మరియు అంగన్వాడీ కార్యకర్తల సూచనలు తప్పక పాటించాలని అంగన్వాడి సిడిపిఓ ఎం.అనసూయ అన్నారు. శుక్రవారం గుల్లపల్లి రజక పేట



అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఓ మాట్లాడుతూ పుట్టిన వెంటనే మరియు కనీసం ఆరు నెలల వరకు తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని, జింక్ ఫుడ్ చెక్కర పనీయాలు పిల్లలకు ఇవ్వవద్దని ఆమె సూచించారు. ముఖ్యంగా మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక శృతి నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో వినోద రీతిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ధనలక్ష్మి, స్థానిక కళాశాల ప్రిన్సిపల్ రోజా, ఆశా వర్కర్ శివ పార్వతి, అంగన్వాడి వర్కర్లు నాగరాజా కుమారి, శిరీష ,సక్కుబాయి, షహనాజ్ , ధనలక్ష్మి శ్రీ, రమాదేవి ,నాగలక్ష్మి పలువురు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించండి

### - జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు

**కొల్లివర,అగస్టు 7 ప్రభాతవార్త:** ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందివటం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు అన్నారు.శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ నిర్వహించి మౌళిక సదుపాయాలపై ఆరాతీసారు.ఈ సందర్భంగా డాక్టర్ రంగారావు మాట్లాడుతూ రోగులకు వైద్యసేవలు అందించే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెబుతూ ఎటువంటి అజాగ్రత్త పనికి రాదన్నారు.24 గంటలు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు.వైద్యశాలలో ఎక్కువ మంది కాన్పులు అయ్యేవిధంగా చూడాలన్నారు.తనిఖీలో ఆయన వెంట వైద్యాధికారులు,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



# వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి : మండల ప్రత్యేక అధికారి రమణప్ప

**కొల్లివర,అగస్టు 7 ప్రభాతవార్త:** రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు..సలహాలు పాటించాలని మండల ప్రత్యేక అధికారి రమణప్ప అన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం–నివారణ కార్యాచరణ ప్రణాళికపై జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి అద్యక్షతన జరిగిన సమావేశంలో రమణప్ప మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంటల భీమా చేయించుకోవాలన్నారు.తహాశీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు..నేలలో తేమ తగ్గటం వలన పంటలు వత్తిడికి గురై దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మీ,డిప్యూటి ఎంపీడీవో భార్గవ్,వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వాషింగ్టన్ సదస్సుకు తెనాలికి చెందిన రీసెర్చ్ స్కాలర్ విష్ణు ఎంపిక

**తెనాలి ఆగస్ట్7(ప్రభాతవార్త):** తెనాలి పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది వేములపల్లి శ్రీనివాస్,రజని దంపతుల కుమారుడైన యువ పిహెచ్‌డి రీసెర్చ్ స్కాలర్ విష్ణు మెహెర్ వేములపల్లి అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో జరగనున్న ప్రతిష్టాత్మక ఐజిఏఆర్ఎస్ఎస్2026 (అంతర్జాతీయ భూవిజ్ఞాన శాస్త్ర మరియు సుదూర సంవేదన సదస్సు) లో పాల్గొని రెండు పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. ఈ సదస్సు పరిశోధనా పత్రాలను సమర్పించడానికి ఉద్దేశించబడినది కాగా, ఆయన సమర్పించిన రెండు పరిశోధనా పత్రాలు కూడా ఆమోదం పొందడం విశేషం. ఈ సదస్సుకు ఆయన భారతదేశం నుండి పాల్గొంటున్న వారిలో ఒకరుగా హాజరవుతున్నారు. ప్రస్తుతం ఆయన కర్నూలులో కంప్యూటర్ సైన్స్ పిహెచ్‌డి రీసెర్చ్ స్కాలర్‌గా తన పరిశోధనలు సాగిస్తున్నారు. సుదూర సంవేదన (రిమోట్ సెన్సింగ్) రంగంలో ఉపగ్రహ చిత్రాల విశ్లేషణపై, ముఖ్యంగా క్లాస్ ఇంబాలెన్స్ (క్లాస్ ఇంబాలన్స్ వర్గ అసమతుల్యత) సమస్యల నివారణపై ఆయన ఈ పరిశోధన పత్రాలను రూపొందించారు. వీటిని ఆయన మార్గదర్శకులు, సహరచయితలైన డాక్టర్ శౌనక్ చక్రవర్తి, డాక్టర్ కొర్ర సత్యబాబుల పర్యవేక్షణలో సిద్ధం చేశారు. గతంలో ఆస్ట్రేలియాలో జరిగిన ఐజిఏఆర్ఎస్ఎస్ సదస్సుకు హాజరైన ఆయన, ఇప్పుడు వాషింగ్టన్ వేదికపై జరగనున్న సదస్సుకు ఎంపిక కావడం విశేషం.ఈ ప్రయాణానికి సంబంధించి ఐఈఈఈ జిఆర్ఎస్ఎస్ సొసైటీ పాక్షిక ప్రయాణ నిధులను (పార్టీయల్ ట్రావెల్ గ్రాంట్ ) సమకూరుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన 417 ట్రావెల్ గ్రాంట్ దరఖాస్తులలో కేవలం 143 మందిని మాత్రమే ఎంపిక చేయగా, అందులో విష్ణు మెహెర్ ఒకరుగా నిలిచి ఈ నిధులను సాధించారు. ఈ సందర్భంగా ఆయన సోదరుడు డాక్టర్ వేములపల్లి జిష్ణు మెహెర్ తో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు హైకోర్టు న్యాయవాది పెరికల డేనియల్, న్యాయవాది జి. శ్రీనివాస్ గౌడ్ ఆయన్ను అభినందించారు.



# చెరుకుపల్లిలో కూటమి నాయకులకు నేతన్నలు పాలాభిషేకం

**చెరుకుపల్లి ,ఆగస్టు 7, ప్రభాతవార్త:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన చెరుకుపల్లిలో నేతన్న సేవలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నేత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం 25వేల రూపాయలు



ఆర్థిక సహాయాన్ని అందించడం పట్ల మండలంలోని నేత కార్మికులు హర్షవర్తం చేశారు. ఈ సందర్భంగా చెరుకుపల్లిలోని దివి రాంబాబు షాపు వద్ద రాష్ట్ర ప్రభుత్వ నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి చేనేత కుటుంబానికి 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం పట్ల ఎంతో సంతోషంగా ఉందని ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పలువురు చేనేత సొసైటీ ప్రతినిధులు నేత కార్మికులు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరంభాగ చేనేత సహకార సంఘం అధ్యక్షులు దివి రాంబాబు, పార్లమెంటరీ పార్టీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, మండల పార్టీ కార్యదర్శి దివి శ్రీనివాసరావు, రత్తయ్య, భవన ఋషి చెరుకుపల్లి, చుట్టుప్రక్కల గ్రామాల్లోని నేత కార్మికులు పలువురు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

### సంకల్పం అవగాహన కార్యక్రమంలో సీఐ రాంబాబు.

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్టు7(ప్రభాతవార్త):** తెనాలి1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నరావూరు పార్కులో శుక్రవారం మత్తు పదార్థాలకు




వ్యతిరేకంగా "సంకల్పం" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతతో పాటు ప్రజల్లో మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం, డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై చైతన్యం కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెనాలి1 టౌన్ సీఐ సిహెచ్.రాంబాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈగల్ టీమ్ ఎస్ఐ సునీల్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ ప్రత్యేకంగా పాల్గొని ప్రజలకు మత్తుపదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక దుష్ప్రభావాలపై వివరించారు.ఈ సందర్భంగా సీఐ సిహెచ్.రాంబాబు మాట్లాడుతూ, మత్తుపదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబ సంబంధాలు, విద్య, ఉద్యోగం, ఆర్థిక పరిస్థితి మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు ఆకర్షితులు కాకుండా మంచి స్నేహాలు, క్రీడలు, వ్యాయామం, విద్య మరియు సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు.మత్తుపదార్థాలను మొదటిసారి సరదాగా ప్రయత్నించడం కూడా భవిష్యత్తులో వ్యసనానికి దారితీసే అవకాశం ఉందని, అందువల్ల "ఒక్కసారి మాత్రమే" అనే ఆలోచనకు కూడా దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగానికి లేదా సరఫరాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసినప్పుడు ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని, డ్రగ్స్ నిర్మూలనలో పోలీసులతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిన్నరావూరు పార్కులో వాకింగ్‌కు వచ్చిన సుమారు 50 మంది వాకర్స్ పాల్గొన్నారు. వారికి డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.పోలీసులు వాకర్స్‌కు "డ్రగ్స్ వద్దు – జీవితం ముద్దు", "మత్తుకు దూరంగా – ఆరోగ్యానికి దగ్గరగా", "డ్రగ్స్‌కు నో – జీవితానికి ఎస్ " వంటి నినాదాల ద్వారా చైతన్యం కల్పించారు.ప్రజలు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు ముఖ్యంగా యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండేలా ప్రోత్సహించాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పోలీసులు పిలుపునిచ్చారు.

డ్రగ్స్ నిర్మూలన అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించగలమని అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వాకర్స్ కూడా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తమ మద్దతును తెలియజేస్తూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములుగా ఉంటామని తెలిపారు.

# కీటక జనితవ్యాధులపై విద్యార్థులకు అవగాహన

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్టు7(ప్రభాతవార్త):** స్థానిక జగ్గడిగుంటపాలెం లోని పిఎంసి కేంద్రీయ విద్యాలయ నందు కీటక జనితవ్యాధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సంగంజాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ రమావత్ శ్రీలతాభాయ్ ప్రారంభించారు.దోమల వలన మలేరియా,ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడువాపు వ్యాధులువస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, నిల్వ ఉన్న వర్షపునీటిలో మడ్డి ఆయిల్ కానీ వాడిన వంట నూనెను కానీ పిచికారి చేసినట్లయితే దోమలను నివారించవచ్చున్నారు. గృహాలలో నిల్వ ఉన్న నీటిలో డెంగ్యూ వ్యాధికి సంబంధించిన లేడీస్ ఈజిప్టై అనే దోమలు అభివృద్ధి చెందుతాయని కావున వారానికి ఒకసారి తప్పకుండా నీటి నిల్వలను పారబోయాలని తెనాలి పట్టణ సబ్ యూనిట్ ఆఫీసర్ అందే బాలచంద్రమోళి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ జిఆర్ మీనా, పిహెచ్ఎన్ ఆంథోనీ చిన్నారిరోజి, మలేరియా సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు,బండారు మల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్స్ కె.శ్రీనివాసరావు, రషీద్, నవీన్, సయ్యద్ కరిముల్లా, వేణుగోపాల్, శ్రీనివాస్ ,శరత్ తదితరులు పాల్గొన్నారు.



# రైతన్న మీ కోసం

కాకుమాను ఆగస్టు 7 (ప్రభాత వార్త)

మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో "రైతన్న మీకోసం" కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించబడ్డాయినీ మండల పశువైద్య అధికారి శుక్రవారం తెలిపారు. ఈ సభలలో సాగు చేయబోయే పంటల వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకుని వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం, ఎల్‌నినో ప్రభావం, తక్కువ



వర్షపాతంతో పండే పంటల ఎంపిక, ప్రకృతి వ్యవసాయం, పశుగ్రాస యాజమాన్యం మరియు పశుసంవర్ధక శాఖ ద్వారా సబ్సిడీపై అవసరమైన పశుగ్రాస విత్తనాల సరఫరా వంటి అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సురేష్ , కాకుమాను పశువైద్యులు, గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ.

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 7(ప్రభాతవార్త):** న్యాయ వివాదాలకు త్వరితగతిన, సామరస్యపూర్వకంగా పరిష్కారం పొందేందుకు మధ్యవర్తిత్వం (మెడియేషన్) అత్యుత్తమ మార్గమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వెల్లడించింది. శుక్రవారం తెనాలిలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నిస్పక్షపాత, తటస్థ మధ్యవర్తి సహాయంతో ఇరు పక్షాలు స్వచ్ఛందంగా చర్చించుకొని పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడమే మధ్యవర్తిత్వ ప్రక్రియ అని అధికారులు తెలిపారు.సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్–89 ప్రకారం, న్యాయస్థానం అవసరమని భావించిన కేసులను మధ్యవర్తిత్వ కేంద్రాలకు పంపవచ్చని పేర్కొన్నారు. అలాగే కక్షిదారులు లేదా వారి న్యాయవాదులు స్వచ్ఛందంగా మధ్యవర్తిత్వాన్ని కోరినా అవకాశం కల్పించబడుతుందని తెలిపారు.మధ్యవర్తిత్వం ద్వారా తక్కువ సమయంలో, ఎలాంటి అదనపు ఖర్చులు లేకుండా వివాదాలను పరిష్కరించుకోవచ్చని, కుటుంబ, వ్యాపార, వ్యక్తిగత సంబంధాలు దెబ్బతినకుండా సామరస్యపూర్వక పరిష్కారం లభిస్తుందని వివరించారు. మధ్యవర్తిత్వంలో పరిష్కారమైన వ్యాజ్యాలకు న్యాయస్థానంలో చెల్లించిన కోర్టు ఫీజు చట్టపరమైన నిబంధనల మేరకు తిరిగి పొందే అవకాశం కూడా ఉందన్నారు. అప్పీళ్ల అవసరం లేకుండా వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడం ఈ విధానంలోని ప్రధాన విశేషమని తెలిపారు. మధ్యవర్తిత్వ సేవలకు సంబంధించిన వివరాల కోసం గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేదా చైర్మన్‌ను 94409 01048 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు ప్రజలకు సూచించారు.

# రైతులు అధికారుల సూచనలు పాటించాలి

### -మండల ప్రత్యేకాధికారి జయలక్ష్మి

**పొన్నూరు, ఆగస్టు 7,ప్రభాతవార్త:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు రైతులు వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని మండల ప్రత్యేకాధికారి జయలక్ష్మి సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి గ్రామంలో రైతన్నా మీకోసం....ఎల్‌నినోను ఎదుర్కొందాం ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ



సందర్భంగా మండల ప్రత్యేకాధికారి జయలక్ష్మి మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల వల్ల పంటలకు ఎదురయ్యే ఒత్తిడిని క్షేత్రస్థాయిలో గుర్తించి, రైతులకు పంటల వారీగా తగిన సాంకేతిక సూచనలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధశాఖలు, ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది, డిఆర్‌డిఏ, వెలుగు సిబ్బంది, నీటి వినియోగదారుల సంఘాల సభ్యులు, పిఎసిఎస్ సభ్యులతో ఎల్‌నినో కాంబాట్ టీములను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎడిఏ వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, అనుబంధశాఖల సిబ్బంది వెలుగు సిబ్బంది బృందాలుగా ఏర్పాటుచేసి పరిస్థితులను చక్కబెట్టేందుకు సిద్దంగా ఉన్నట్లు చెప్పారు.మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శని మాట్లాడుతూ ప్రతి రైతు తమ మొబైల్ ఫోన్‌లో ప్లేస్టోర్ ద్వారా ఏపి ఎయిమ్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ కళ్ళెం శ్రీనివాసశర్మ, సచివాలయ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# యూనివర్సిటీ పరీక్షా ఫలితాలలో

# హిందూ ఫార్మసి కళాశాల బి ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య ఆగస్టు 7 ప్రభాతవార్త :** హిందూ ఫార్మసీ కళాశాల బి ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వారు విడుదల చేసిన పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. బి.ఫార్మసీ చివరి సంవత్సరం పరీక్షలకు 106 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 105 మంది ఖిఓఖి గ్రేడ్ (90100 శాతం మార్కులతో) ఉత్తీర్ణత సాధించినట్లు తెలియ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు , కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య తమ అభినందనలు తెలిపారు.

# దేహాలు,సంపదలు శాశ్వతం కాదు

**గుంటూరు కల్చరల్,ఆగస్టు 7,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై వ్యాస మహర్షి రచించిన విశ్వనాధాష్టకం పై సుందర సత్సంగ్ సభ్యులు,ఆధ్యాత్మిక ప్రవచకులు,సుందర చైతన్యానంద శిష్యులు కె.వి.కోటేశ్వరరావు ప్రవచనం ముగింపురోజు ప్రవచనాన్ని ప్రారంభిస్తూ శరీరాలు శాశ్వతం కాదు,సంపదలు శాశ్వతం కాదు,ఈరెండు శాశ్వతం కానప్పుడు వీటినుంచి లభించే సుఖం శాశ్వతం కాదన్నారు.సుఖ హేతువు,సుఖ స్తానం భగవంతుడే. అనిత్యమైన వాటినుంచి జీవితాంతం శ్రమించిన శాశ్వత సుఖం లభించదు.ఆ జ్ఞానాన్ని కలిగినప్పుడు మనసు అనిత్యమైన వాటినుంచి శాశ్వతమైన సుఖాన్నిచ్చే భగవంతుడి వైపు తిరుగుతుంది.నువ్వు కోరుకునే శాశ్వతమైన సుఖం ప్రసాదించేవాడు భగవంతుడే అన్నారు.తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,ఉపాధ్యక్షులు లంకా విజయబాబు,సహాయ కార్యదర్శి పూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.కార్యక్రమంలో పి.శివారెడ్డి,తూనుగుంట్ల సుందరరామయ్య,వి.ఏకాంబరేశ్వరరావు,వి.అరుణకుమారి పాల్గొన్నారు.వలేటి అంకినీడు ప్రసాద్,బి.యశోధ పాల్గొన్నారు.

8MN 11 PG-GNT_8MN 11 PG-GNT.qxd 08-08-2026 AM 12:02 Page 1



## మెడికల్ కాలేజీకి సింగిల్ బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలి

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి నరసరావుపేట, వినుకొండ ఆర్టీసీ డిపోల నుంచి సింగిల్ బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలని పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కుంచాల స్వామి కోరారు ఈ మేరకు రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ శాఖ మినిస్టర్ ఎం రాంప్రసాద్ రెడ్డి కి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కుంచాల స్వామి మాట్లాడుతూ మెడికల్ కాలేజీకి వెళ్లే విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఉద్యోగులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నరసరావుపేట, వినుకొండ డిపోల నుంచి నేరుగా మెడికల్ కాలేజీ వరకు సింగిల్ బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తే ఎంతోమందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే బస్సు సర్వీసులు ప్రారంభించాలని కోరారు. తమ విజ్ఞప్తిపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి సానుకూలంగా స్పందించారని స్వామి తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారికి ఫోన్ చేసి సమాచారాన్ని తెలిపారు. సమస్యను వేగంగా పరిష్కరించాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. తమ విజ్ఞప్తిపై ప్రజా అవసరాల కోసం తక్షణమే స్పందించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డికి అధికారులకు పట్టణ వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు కుంచాల స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

## మిర్చి సాగుపై శిక్షణా కార్యక్రమం

**పిడుగురాళ్ల, ఆగస్టు 7, ప్రభాతవార్త :** మండలంలోని కామేపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో శుక్రవారం సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకంలో భాగంగా ఉద్యానశాఖ ఆధ్వర్యాన మిర్చి నారు పెంపకం, మిరపలో వచ్చే తెగుళ్లు, పురుగులుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నర్సరీ చట్టం, పీఎంఎఫ్‌బీవై, పిఎండిఎస్ పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్, జిల్లా ఉద్యాన అధికారి వెంకట్రావు, ఏవో సంధ్యారాణి, ఉద్యానవన అధికారి అంజలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హసీనాలు పలు సూచనలు చేశారు. యాజమాన్య, పీఎండీఎస్ పద్ధతుల వలన కలిగే ప్రయోజనాలు, ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం రామ్మోహనరావు, సత్యగోపాల్, నర్సరీ యజమానులు, రైతులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

### -నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: వైసీపీ విష సంస్కృతి మానుకోవాలి -ఎమ్మెల్యే యరపతినేని

**పిడుగురాళ్ల, ఆగస్టు 7, ప్రభాతవార్త :** గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి లోకేష్‌లు రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గత వైసీపీ పాలనలో ప్రభుత్వ సర్వే పేరిట ఒకరి భూమిని మరొకరికి మార్చి ఇష్టానుసారం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో పేద రైతుల నుంచి ఎన్నో అర్జీలు అందాయని, వాటన్నిటిని రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరిస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో నేతలు చేసిన తప్పుడు పనులకు వత్తాసు పలుకుతూ అక్రమాలకు పాల్పడిన అధికారులపై తగిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి విషయంలో రివ్యూ నిర్వహించి ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. పల్నాడు ప్రాంతాభివృద్ధికి ఎంతగానో కష్టపడుతున్నానని, దీనికి ప్రజలు సహకరిస్తున్నారని అన్నారు. గురజాల నియోజకవర్గంలో శ్రీసిమెంట్, చెట్టినాడ్ సిమెంట్ వచ్చాయని, ఎంతో మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. మెగా జాబ్ మేళా నిర్వహించి 700మందికి ఉద్యోగాలను త్వరలో కల్పిస్తామన్నారు. జగన్‌రెడ్డి రెండు నాలుకల దోరణితో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడడమే కాకుండా రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు వెనక్కు వెళ్లాయన్నారు. భోగాపురానికి ఎర్రబస్సు రావడమే ఎక్కువన్న జగన్‌రెడ్డి ఇప్పుడు శంకుస్థాపన చేసింది మేమేనని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేని జగన్‌రెడ్డి విషం చిమ్ముతున్నారన్నారు. గత వైసీపీ హయాంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించడం చేతకాక ధర్నాలు అంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. వైసీపీ హాయంలో రైతులో ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పటికైనా వైసీపీ విష సంస్కృతిని వీడకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా తాను నడుస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పర్యటిస్తుంటే ఎంతోమంది పేదల నిస్సహాయ స్థితిని చూస్తుంటే తనకెంతో బాధేస్తుందని, అందుకే వారికి ప్రభుత్వ పథకాలతోపాటు తనకు చేతనైన సాయం చేస్తున్నానన్నారు. ఇటీవల మాచవరం మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నప్పుడు ఒక పేద వృద్ధుడు తన వద్దకు వచ్చి తన మనుమరాలుకు తల్లి,తండ్రి లేరని, సాయం అందించాలని కోరడంతో తన మనసుకు ఎంతో బాధ కలిగిందన్నారు. నియోజకవర్గంలో తాను చేసే అభివృద్ధి పనులతోపాటు పేదలకు అందిస్తున్న సహాయాన్ని వివరించడానికి ముఖ్య కారణం తనలాగే ఇంకా ఎంతోమంది పేదలకు సహాయం చేసి ఆదుకుంటారనే దృక్పథంతో వివరిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఎంతో మంది నిరుపేద కుటుంబంలో చదువు మధ్యలో ఆపి ఉద్యోగ, వసతులు లేక ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, మండల అధ్యక్షుడు గండికోట వెంకటేశ్వర్లు, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ తురకా వీరాస్వామి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలీ, జనసేన నేత రమేష్‌బాబు, షేక్ ఖాసీం, టీడీపీ నేతలు షేక్ బాబావలి, వడపల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి శ్రీనివాసరావు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.








**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**

గురజాల నియోజకవర్గ పరిధిలో అనారోగ్యాలతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన నగదు చెక్కులను శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందించారు. మొత్తం రూ.72,40,146 విలువైన చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఇప్పటి వరకు 896 మందికి రూ.8,74,89,645 విలువైన చెక్కులను అందించామన్నారు.

## తల్లిపాల వారోత్సవాల ముగింపు

**పిడుగురాళ్ల, ఆగస్టు 7 ప్రభాతవార్త :** పిడుగురాళ్ల పట్టణ, మండల పరిధితోపాటు, మాచవరం మండలంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పిడుగురాళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరి, వైద్య సిబ్బంది పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలో



కలిసి పట్టణంలో ర్యాలీ జరిపారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. శిశువు జన్మించిన తరువాత మొదటి ఆరు నెలలు తల్లిపాలను బిడ్డకు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అప్రీసియేషన్ అవార్డుకు డాక్టర్ భరత్‌కుమార్ ఎంపిక

**పిడుగురాళ్ల, ఆగస్టు 7 ప్రభాతవార్త :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ హెడ్ క్వార్టర్స్, హైదరాబాద్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెక్రటరీ అప్రిసియేషన్ అవార్డుకు డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కుమార్ ఎంపికయ్యారు. భరత్‌కుమార్ ప్రస్తుతం ఐఎంఏ అధ్యక్షునిగా ఐఎంఏఎంఎస్ శాఖ చైర్మన్‌గా సేవలందిస్తున్నారు. డాక్టర్ భరత్‌కుమార్ అందించిన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు కార్యదర్శి డాక్టర్ సాయిరాం తెలిపారు. ఈ అవార్డును సెప్టెంబరు 5వ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని హుబ్బళ్లిలో జరగనున్న జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో అందించనున్నట్లు చెప్పారు. తన ఎంపిక కారణమైన రాష్ట్ర నాయకత్వానికి డాక్టర్ భరత్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.





శుక్రవారం చేనేత కార్మికులకు జాతీయ చేనేత దినోత్సవం కానుకగా 'నేతన్న సేవ'లో పథకం ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొనేందుకు చీరాలకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు హెలిపాడ్ వద్ద స్వాగతం పలికిన మంత్రి అనగాని, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ

## వికటించిన ప్రేమాయణం: యువతి దారుణ హత్య

**కారంపూడి,ఆగస్టు 7, ప్రభాతవార్త :** నమ్మకంగా చదువుకున్నారు కలిసిమెలిసి తిరిగారు చివరకు ప్రేమగా మారింది ఐదు సంవత్సరాలుగా ఇరువురు సహిన, బాల సైదులు ప్రేమించుకున్నారు గుంటూరులో బీటెక్ చదువుతూ ఇద్దరు మధ్య ప్రేమాయణం కొనసాగింది. ఇటీవల కాలంలో హసీనా చెన్నైలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. అయినప్పటికీ ఇద్దరి మధ్య ప్రేమ కొనసాగుతూనే ఉంది చిలకలూరిపేట కు చెందిన. షేక్ హసీనా 25, జిలుగు బాల సైదులు కారంపూడి మండల ్ల ఇనుపు రాజు పల్లె గ్రామానికి చెందిన వ్యక్తి. గత ఐదు రోజుల క్రితం హసీనాకు ఫోన్ చేసి కారంపూడి కి రావాలని నమ్మ సక్యంగా పిలిచాడు ఆలోచించని ఆ యువతి (హసీనా) కారం పూడి మండలం పేట సన్నిగండ్ల గ్రామ సమీపంలో ఉన్న ఎన్ఎస్పి కాలువ కట్ట వద్దకు చేరుకుంది గతంలోనే బాల సైదులకు అనుమానం వచ్చింది అనుమానం పెనుభూతింగా మారింది యువతి సెల్ఫోన్లో ఉన్న ఫోటోలను చూసి ఎలాగైనా హతమార్చా లనే పథకం పన్నాడు పథకం ప్రకారమే ఎన్ఎస్పి పేట సన్నిగండ్ల కట్ట వద్దకు వచ్చిన హసీనా పొలిమేరల చివరి వరకు తీసుకుని వెళ్లి చిత్రహింసల గురిచేసి అతి దారుణంగా హత్య చేసి ఈ ఘటన శుక్రవారం పోలీసులకు వెలుగు లోనికి వచ్చింది బాల సైదులు హత్య చేసిన అనంతరం హైదరాబాద్కు వెళ్లాడు రెండు రోజులు పాటు సమయాన్ని కేటాయించి అక్కడ నుండి నంద్యాలకు వెళుతూ తండ్రి జిలుగు యలమందకు ఫోన్ చేశాడు హసీనాను హతమార్చాను నేను కూడా చనిపోతున్నాను అంటూ తండ్రికి తెలిపాడు ఈ నేపథ్యంలోనే హసీనా తల్లిదండ్రులు తన కుమార్తె కనిపించడం లేదని చిలకలూరిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు అనుమానమైన వ్యక్తి జిలుగు బాల సైదులు పేరుతో ఫిర్యాదు చేశారు స్పందించిన పోలీసులు ఎలమందను అదుపులోనికి తీసుకొని విచారణ చేశారు తన కుమారుడు ఫోన్ చేశాడని హసీనాను హతమార్చానని నేను కూడా చనిపోతున్నాను అని తెలపడంతో పోలీసు యంత్రాంగం నంద్యాల లో నిందితుడని అదుపులోనికి తీసుకున్నట్లు తెలుస్తుంది బాల సైదులను పూర్తిస్థాయిలో విచారించగా పథకం ప్రకారం హసీనాను హత్య చేశానని సంఘటన స్థలమైన కారంపూడి మండలం ఎన్ఎస్పి కాల్వకట్ట వద్దకు చిలకలూరిపేట పోలీసులను తీసుకొని వచ్చాడు పోలీసులు పూర్తిస్థాయిలో విచారించారు చిలకలూరిపేట సీఐ రమేష్, ఎస్సై, హజరతయ, సోమేశ్వరరావు, మృతి చెందిన హసీనా మృతదేహాన్ని పరిశీలించారు డాగ్ స్క్వాడ్, క్లోజ్ టీం, పర్యవేక్షించింది గురజాల ప్రభుత్వ వైద్యాధికారి అరవింద్ తన సిబ్బందితో శవ పంచనామ చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు ఈ సందర్భంగా సిఐ రమేష్ విలేకరులతో మాట్లాడుతూ విషయమై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుగుతుందని ఆయన తెలిపారు.





హసీనా ఫైల్ ఫోటో , ఎంఎస్పీ కాల్ కట్ట వద్ద దారుణంగా హత్య చేసి పెట్రోల్ పోసి దహనం చేసిన సంఘటన

## మా కుమార్తెకు జరిగినట్టు ఏ ఆడబిడ్డకు జరగకూడదు..

### హసీనా తల్లిదండ్రులు రహన, మస్తాన్ వల్లి

**కారంపూడి,ఆగస్టు 7, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని మృతి చెందిన హసీనా తల్లిదండ్రులు షేక్ రహనా మస్తాన్ వలీ శుక్రవారం తమ ఆవేదన వ్యక్తం చేశారు హసీనా మృతదేహం వద్ద వారు బోరుణ విలపిస్తూ ఈ రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ కరువైందని వారు తెలిపారు చదువుకొని చెన్నైలో ఉద్యోగ చేస్తున్న తన కుమార్తె ఇనుప రాజు పల్లె గ్రామానికి చెందిన బాల సైదులు హత్య చేయడం ఒక పథకం ప్రకారమే జరిగిందని వారన్నారు మెడ నిండా బంగారం వేసుకొని ఆడుతూ పాడుతూ తిరుగుతున్న తన కుమార్తె చనిపోయే ముందు కూడా అమ్మ చనిపోతున్న అంటూ చెప్పిన మాటలు కుదిపి వేస్తున్నాయని బోర్న రోదిస్తూ వినిపించారు పోలీసులు ఎందుకు హత్య చేసిన వ్యక్తిని దాచి పెట్టారంటూ మండిపడ్డారు ఆడపిల్లల రక్షణ ఎక్కడ ఉంది ప్రభుత్వ ఏం చేస్తుంది అంటూ వారు తెలిపారు మాలాంటి నా కుమార్తెకు జరిగిన సంఘటన ఏ ఆడపిల్లకు జరగకూడదని ప్రభుత్వం తక్షణమే కఠినంగా శిక్షించాలని వారు వేడుకున్నారు సామాన్యులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వారు అన్నారు పరీక్ష రాస్తాను అని చెప్పి అనంత లోకాలకు వెళ్ళింది అమ్మ చదువుకున్నాను పరీక్ష రాసి వస్తానని చెప్పిన కుమార్తె హసీనా అనంత లోకాలకు వెళ్లిందని తండ్రి మస్తాన్వలి ఆవేదన వ్యక్తం చేశారు పగడ్బందీ పథకం ప్రకారమే తన కుమార్తెను హత్య చేశారని తెలిపారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లో స్పందించి నిందితుడి కఠినంగా శిక్షించాలని వారు కోరుతున్నారు .



## ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన

**మాచర్ల టౌన్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** ఎల్ నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించి,పంటల నష్టాన్ని తగ్గించడంతో పాటు ఆదాయ భద్రత కల్పించే లక్ష్యంతో శుక్రవారం మాచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో "రైతన్న మీకోసం – ఎల్ నినో ప్రభావం నివారణ కార్యచరణ ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతుల పొలాలను సందర్శించి పంటల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడం, సమగ్ర వ్యవసాయ సలహాలు, సాంకేతిక మార్గదర్శకాలను రైతులకు వివరించారు. అలాగే ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించి రైతులకు ఆదాయ భద్రత కల్పించే చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి పంటకుంటల్లో నిల్వ చేసుకుని జీవనాధార తడుల కోసం వినియోగించాలని సూచించారు. బిందు, తుంపర సేద్య విధానాలను ప్రోత్సహిస్తూ, అంతర పంటలు, మిశ్రమ పంటల సాగు, ఆరుతడి పంటలు మరియు తక్కువ కాల పరిమితి కలిగిన పంట రకాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## దుర్గి మండలంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**దుర్గి, ఆగస్టు 7, ప్రభాతవార్త:** దుర్గి మండలంలోని 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనులతో పాటు ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో రెండవ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. దుర్గి మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. ఈ మేరకు దుర్గి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ జి. సీతారాం తెలిపారు.

## వైసీపీ రాష్ట్ర యూత్ కన్వీనర్ నవులూరి చెన్నారెడ్డి దారుణ హత్య

**రెంటచింతల, ఆగస్టు 7, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రెంటచింతలలో వైసీపీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి నవులూరి భాస్కర్ రెడ్డి తనయుడు వైసీపీ రాష్ట్ర యూత్ కన్వీనర్ నవులూరి చెన్నారెడ్డి(36)దారుణ హత్యకు గురయ్యారు. నియోజకవర్గంలో కీలక నేతగా వ్యవహరిస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ నిన్న జరిగిన ఏపీ జెన్ జెడ్ వార్ రిలే నిరాహార దీక్షలో కూడా నవ్వులూరి చెన్నారెడ్డి పాల్గొన్నారు. గురువారం రాత్రి సుమారు 9 గంటలకు తన కార్యకలాపాలు ముగించుకొని రెంటాల స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో రెంటచింతలరెంటాల మార్గం మధ్యలో ముందు నుంచి ఒక కారు వెనకనుంచి ఒక కారు అడ్డగించి స్కూటీని బలంగా గుద్ది పక్కనే పడి ఉన్న నవులూరి చెన్నారెడ్డిని అతి కిరాతకంగా కళ్ళలో కారం చల్లి గొంతు కోసి హత్య చేసి అగంతకులు పారిపోయారు. ఈ వార్త విన్నతండ్రి భాస్కరరెడ్డి అనుమానితుల ఇళ్ల వద్దకు వెళ్లగా తాళాలు వేసి సెల్ ఫోన్స్ స్విచ్ఛాఫ్ చేయడంతో అనుమానం బలపడి ఫలానా వారే హత్య చేశారనే నిర్ధారణకు వచ్చారు. అర్ధరాత్రి వేళ గురజాల డీఎస్పీ బి.మహేశ్వరరావు, కారంపూడి సీఐ,ఎస్ఐ సీహెచ్ నాగార్జునలు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబీకులను ఓదార్చారు.



## కాలుజారి... రైలు కిందపడి ఒకరికి గాయాలు

**రెంటచింతల, ఆగస్టు 7, ప్రభాతవార్త :** శుక్రవారం మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న రైలు కింద సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో రైలుక్రింద పడ్డ వ్యక్తి గురజాల మండలం జంగమహేశ్వరపురం గ్రామానికి చెందిన షేక్ ఈసబ్ గా రైల్వే పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో ఈసబ్ ఎడమ చేయి పూర్తిగా విరిగిపోయి రైలు పట్టాల మధ్యన పడిపోయింది. గురజాల రైల్వే స్టేషన్ వచ్చిందనుకుని రెంటచింతలలో దిగుతున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.. అపస్మారక స్థితిలోకి వెళ్ళిన ఈసోబును 108లో గురజాల ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి నరసరావుపేటకు తరలించారు.

## నరసరావుపేటలో రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమంపై ఇంటింటా ప్రచారం..

**నరసరావుపేట, ఆగస్టు 7 ప్రభాతవార్త :** ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి, సంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నరసరావుపేట పట్టణంలోని 27వ వార్డులో కొనసాగింది. శివుని బొమ్మ వద్ద ప్రారంభమైన కార్యక్రమం మహాలక్ష్మమ్మ చెట్టు వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, నరసరావుపేట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బరాయ గుప్తా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, నాయకులు అంకమ్మ చౌదరి, అత్తలూరి సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



## 'మున్సిపల్ చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి'

**నకరికల్లు, ఆగస్టు 7, ప్రభాతవార్త:** నరసరావుపేట మున్సిపల్ ఎన్నికల్లో ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, ఎస్సీ వర్గాల్లో అధిక సంఖ్యలో ఉన్న మాదిగ సామాజిక వర్గానికి మున్సిపల్ చైర్మన్ పదవి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు గుండాల నగేష్ కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆదేశాల మేరకు శుక్రవారం పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసరావుపేట మున్సిపాలిటీ 1915 జూన్ 18న ఏర్పడిందని, 1922 జనవరి 8న తొలి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 24 మంది చైర్మన్లుగా కొనసాగినా, ఎస్సీ సామాజిక వర్గానికి ఒక్కసారి కూడా అవకాశం దక్కలేదన్నారు. ఈసారి మున్సిపల్ చైర్మన్ పదవిని మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యేను కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసన్నకుమార్, దేవదానం, తిమోతి, శ్యాంబాబు, బాబు , వరుణ్, వెంకటేశ్వర్లు , మల్లవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి అమ్మవారికి ఆషాఢమాస సారె

**రొంపిచర్ల,ఆగస్టు 7 ప్రభాతవార్త :** నరసరావుపేట పట్టణంలోని ఎన్జీవో కాలనీలో ఉన్న శ్రీ అభయ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా శుక్రవారం



నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పద్మావతి అమ్మవారికి (అలివేలు మంగమ్మ) సంప్రదాయబద్ధంగా సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని మహిళలు ప్రార్థించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

## 9న ఎస్ .హెచ్.ఓ.లో ఉచిత ఇఎన్‌టి వైద్య శిబిరం

**గుంటూరు మెడికల్,ఆగస్టు7, ప్రభాతవార్త:** సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ ,మానవత స్వచ్ఛంద సేవా సంస్థసంయుక్తంగా ప్రతినెల రెండో ఆదివారం స్పెషలిస్టుల ఉచితవైద్య శిబిరాల లో భాగంగా 9 వ తేదీ ఆదివారం చెవి ముక్కు గొంతు వ్యాధుల ఉచిత వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్ , వి.వి. నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్ .హెచ్. ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో చెవి ముక్కు గొంతు వ్యాధుల వైద్య, శస్త్ర చికిత్సల నిపుణులు డాక్టర్ చలమలశెట్టి నీలిమ పాల్గొంటారన్నారు. ఈ శిబిరానికి ముందు చెవి, ముక్కు, గొంతు సంబంధ వ్యాధులు , చికిత్స విధానాలపై శాస్త్రీయ అవగాహన సభ ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా వారు కోరారు.

## రక్త, జీర్ణాశయ వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

### ప్రారంభ దశలో గుర్తిస్తే క్లిష్టమైన సమర్థవంతమైన చికిత్స సాధ్యం: గుంటూరులో యశోద హాస్పిటల్స్ మలక్‌పేట్, సికింద్రాబాద్ యూనిట్ల వైద్య నిపుణులు ఫరాజ్ అహ్మద్,కృష్ణచౌదరి

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 7, ప్రభాతవార్త:** రక్త సంబంధిత వ్యాధులు, జీర్ణాశయ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స అందించి మెరుగైన ఫలితాలు సాధించవచ్చని యశోద హాస్పిటల్స్ మలక్‌పేట్ యూనిట్ హెమటాలజిస్ట్ డాక్టర్ ఫరాజ్ అహ్మద్, సికింద్రాబాద్ యూనిట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చౌదరి తెలిపారు. గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, రక్తహీనత, లుకేమియా, లింఫోమా, ప్లేట్‌లెట్ లోపాలు, మల్టిపుల్ మైలోమా వంటి రక్త వ్యాధులు, అలాగే జీర్ణాశయ అవయవాలకు సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. తరచూ అలసట, జ్వరం, రక్తస్రావం, నీలి మచ్చలు, గడ్డలు, కడుపునొప్పి, ఆహారం మింగడంలో ఇబ్బంది, మలంలో రక్తం, అకారణంగా బరువు తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులను సంప్రదించాలని సూచించారు. యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక రక్త పరీక్షలు, బోన్ మ్యారో పరీక్షలు, లక్ష్యిత చికిత్సలు, కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, బోన్ మ్యారో మార్పిడి సేవలతో పాటు లాపరోస్కోపిక్, రోబోటిక్ శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, సమతుల్య ఆహారం, వ్యాయామం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ హెడ్ వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న యశోద ఆసుపత్రి వైద్యులు ఫరాజ్ అహ్మద్ ,కృష్ణచౌదరి...

## సౌమ్య నర్సింగ్ కళాశాలలో ఉద్రిక్తత

### ప్రిన్సిపాల్‌పై విద్యార్థినుల ఫిర్యాదు: డీఎంహెచ్‌వోను ఆశ్రయించిన విద్యార్థులు మానసిక వేధింపులు, అదనపు వసూళ్లు, విధుల నిర్వహణపై ఆరోపణలు.. విద్యార్థినుల భద్రత కోసమే గట్టిగా మాట్లాడా: పిన్సిపాల్ సమీర్

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 7, ప్రభాతవార్త:** పాత గుంటూరులోని సౌమ్య నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ వ్యవహారశైలిపై విద్యార్థినులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) విజయలక్ష్మిని ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. కళాశాలలో తమను మానసికంగా వేధిస్తున్నారని, అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని ఆరోపిస్తూ విద్యార్థినులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు భయరహిత వాతావరణం కల్పించాలని వారు కోరారు. విద్యార్థినుల ఫిర్యాదు ప్రకారం, పల్నాడు ప్రాంతానికి చెందిన పేద కుటుంబాల విద్యార్థులను తక్కువ ఖర్చుతో విద్య అందిస్తామని చేర్పించుకుని, అనంతరం ఆహార వ్యయాల పేరుతో ప్రతి నెల అదనంగా రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఒక రోజు సెలవు తీసుకున్నా రూ.500 చొప్పున చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా, ప్రైవేటు ఆసుపత్రులకు విధుల కోసం పంపిస్తూ ఆయా ఆసుపత్రుల నుంచి కళాశాల యాజమాన్యం ఆర్థిక ప్రయోజనం పొందుతున్నప్పటికీ, విద్యార్థినులకు ఎలాంటి పారితోషికం చెల్లించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వసతి గృహంలో నాసిరకం భోజనం అందిస్తున్నారని, కళాశాలలో విద్యార్థుల సంక్షేమం కంటే ఒత్తిడికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఆరోపణలను ఖండించిన ప్రిన్సిపాల్ ఈ ఆరోపణలపై కళాశాల ప్రిన్సిపాల్ సమీర్‌ను వివరణ కోరగా, అన్ని ఆరోపణలను ఆయన ఖండించారు. ఘటన జరిగిన రోజు రాత్రి విద్యార్థినులను యథావిధిగా విధులకు పంపించినప్పటికీ, వారు విధులకు వెళ్లకుండా రాత్రి 11 గంటల వరకు రోడ్డుపక్కన చెట్టు కింద కూర్చొని ఉన్నారని తెలిపారు. విద్యార్థినుల భద్రత, వారి తల్లిదండ్రులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత తనపై ఉండటంతో గట్టిగా మందలించి కళాశాలకు తీసుకువచ్చినట్లు చెప్పారు. పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు. కేవలం విద్యార్థినుల భద్రత దృష్ట్యా కఠినంగా వ్యవహరించానని, అదే విషయాన్ని వక్రీకరించి తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని సమీర్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై డీఎంహెచ్‌వో కార్యాలయం ఫిర్యాదును స్వీకరించినట్లు తెలిసింది. విద్యార్థినుల ఆరోపణలు, ప్రిన్సిపాల్ వివరణ నేపథ్యంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టిన అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



డాక్టర్ విజయలక్ష్మి కి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థినీలు

8-8pg10exHMNWJQEBL_8-8pg10exHMNWJQEBL.qxd 07/Aug/26 10:48 PM Page 1



## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్.. టీమిండియాకు డూ ఆర్ డై




### మిగిలిన 9 మ్యాచ్‌లూ కీలకం

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ (డబ్ల్యూటిసి) 2025-27 ఫైనల్ రేసులో భారత్ నిలవడం అత్యంత సంక్లిష్టంగా మారింది. ప్రస్తుతం టీమిండియా ఆడిన 9 టెస్టుల్లో 4 విజయాలతో 48.15 శాతం పాయింట్లతో (డబ్ల్యూటిసి) ఐదో స్థానానికి పరిమితమైంది. అంతేకాకుండా, పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ కంటే కూడా వెనుకబడి ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఆస్ట్రేలియా 87.50 గెలుచుకున్న పాయింట్ల శాతంతో అగ్రస్థానంలో ఉండగా, సౌతాఫ్రికా (75), న్యూజిలాండ్ (72.22), బంగ్లాదేశ్ (58.33) వరుసగా భారత్ కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఖాతాలో ఇంకా 9 టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉండటంతో ఇకపై ఎలాంటి పొరపాట్లకు తావులేదు. టీమిండియా తన మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తే పాయింట్ల శాతం 74.07కు చేరి ఫైనల్ బెర్త్ దాదాపు ఖాయమవుతుంది. అయితే, ఒక మ్యాచ్ ఓడితే పాయింట్ల శాతం 68.5కు, రెండు ఓటములతో 62.9కు, మూడు ఓటములు ఎదురైతే 57.41కి పడిపోతుంది. డబ్ల్యూటిసి నిబంధనల ప్రకారం ప్రతి విజయానికి 12 పాయింట్లు, డ్రాకు 4 పాయింట్లు లభిస్తాయి, కాబట్టి ఒక్క ఓటమి కూడా భారీ ప్రభావం చూపుతుంది. టీమిండియా ముందున్న షెడ్యూల్ ఎంతో సవాలుతో కూడుకున్నది. ఇక టీమిండియా మొదట శ్రీలంక పర్యటనలో రెండు టెస్టులు ఆడనుంది. అక్కడ స్పిన్ ఎదుర్కోవడం పెద్ద పరీక్షగా మారనుంది. ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనలో మరో రెండు టెస్టుల్లో పోటీపడాల్సి ఉంటుంది. చివరగా, ప్రపంచ నంబర్1 టెస్ట్ జట్టు ఆస్ట్రేలియాతో స్వదేశంలో 5 మ్యాచ్‌ల సుదీర్ఘ సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ కేవలం తన మ్యాచ్‌లను గెలవడమే కాకుండా, ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుభమన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఇకపై ఆడే ప్రతి మ్యాచ్ నాకౌట్‌గా భావించి వరుస విజయాలు సాధిస్తేనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ కలను నిజం చేసుకోగలదు.



## సెయింట్ లూయిస్ రాపిడ్.. బ్లిట్జ్ ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద

**న్యూఢిల్లీ:** భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద, జవోఖిర్ సిందరోవ్‌తో జరిగిన చివరి ముఖాముఖి పోరులో కీలకమైన డ్రా సాధించి, ఒక రౌండ్ మిగిలి ఉండగానే గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ రాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌గా నిలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ చెస్ టోర్నమెంట్‌లో 20 యేళ్ల భారత స్టార్ 35 పాయింట్లకు గాను 23 పాయింట్లతో ఛాంపియన్‌షిప్‌ను ముగించగా, సిందరోవ్ 22 పాయింట్లతో టోర్నమెంట్‌లో రెండో స్థానంలో నిలిచాడు. ఐదురోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్ అంతటా ప్రజ్ఞానంద తన పట్టును కొనసాగించాడు. చివరి దశలలో సిందరోవ్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఈ ఉజ్బెక్ గ్రాండ్‌మాస్టర్ భారత ఆటగాడి కంటే కేవలం 1.5 పాయింట్ల తేడాతో ఓటమి పాలయ్యాడు. ఈ బ్లిట్జ్ టోర్నమెంట్‌లో 10మంది అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడ్డారు. ఈ ఈవెంట్‌లో తొమ్మిది రాపిడ్ రౌండ్లు, 18 బ్లిట్జ్ రౌండ్లు జరిగాయి. సింక్‌ఫీల్డ్ కప్, జిసిటి గ్రాండ్ ఫైనల్స్‌కు ముందు విలువైన గ్రాండ్ చెస్ టూర్ పాయింట్లకోసం మొత్తం 135గేమ్‌లు ఆడబడ్డాయి. ఈ పోటీలో రెండు ఫార్మాట్‌లలో మొదటిది, 25నిమిషాల కాలపరిమితి, మొదటి ఎత్తునుండి 10సెకన్ల అదనపు సమయంతో కూడిన 9 రౌండ్ల సింగిల్ రౌండ్‌రాబిన్ ర్యాపిడ్ ఈవెంట్, రెండవది ఐదు నిమిషాల కాలపరిమితి, ప్రతి ఎత్తుకు రెండు సెకన్ల అదనపు సమయంతో ఆడే 18 రౌండ్ల డబుల్ రౌండ్‌రాబిన్ బ్లిట్జ్ ఈవెంట్. స్కోరింగ్ విధానంలో వేగవంతమైన విజయాలకు రెండు పాయింట్లు, డ్రాలకు ఒక పాయింట్ లభించగా, బ్లిట్జ్ విజయాలకు ఒక పాయింట్, డ్రాలకు అర పాయింట్ లభించింది.






## కొరియా మాస్టర్స్.. సెమీఫైనల్‌కు అష్మిత, రక్షిత

**న్యూఢిల్లీ:** భారత్ ప్లేయర్లు అష్మిత, రక్షిత కొరియా మాస్టర్స్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన తమతమ క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 50వ ర్యాంకర్ అష్మిత, ఆసన్ యి సన్‌సిన్ జిమ్నాసియంలో జరిగిన ఉత్కంఠభరితమైన క్వార్టర్ ఫైనల్‌లో, టాప్ సీడ్ మరియు ప్రపంచ 22వ ర్యాంకర్ అయిన జపాన్‌కు చెందిన హినా అకేచిని 20-22, 21-15, 21-19 తేడాతో ఓడించి, ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సంచలనాన్ని సృష్టించింది. గంటకు పైగా సాగిన పోరులో, ఒక గేమ్ వెనుకబడిన స్థితి నుండి పుంజుకున్న రక్షిత, మూడో సీడ్, తన స్వదేశీయురాలైన తన్వి శర్మను 18-21, 21-19, 21-18 స్కోరుతో ఓడించి సంచలనం సృష్టించింది. అష్మిత ఎండ్స్ తర్వాత అష్మిత బలంగా పుంజుకుంది. స్కోరు 7-7తో సమంగా ఉన్నప్పుడు, ఆమె వరుసగా ఆరు పాయింట్లు సాధించి 13-7 ఆధిక్యానికి దూసుకెళ్లింది. హినా తేడాను 14-16కు తగ్గించినప్పటికీ, భారత క్రీడాకారిణి సంయమనం కోల్పోకుండా, తర్వాతి ఆరు పాయింట్లలో ఐదింటిని కైవసం చేసుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. నిర్ణయాత్మక గేమ్ కూడా అష్మిత అదే రీతిలో సాగి చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. అలాగే తొలి గేమ్‌లో రక్షిత 138 ఆధిక్యంతో దూసుకెళ్లగా, ఆ తర్వాత తన్వి అద్భుతంగా పుంజుకుని, తర్వాతి తొమ్మిది పాయింట్లలో ఎనిమిదింటిని వరుసగా సాధించి 8-13 నుంచి 16-14కు చేరుకుని గేమ్‌ను ముగించింది. తర్వాత గేమ్ కూడా మరో హోరాహోరీ పోరుగా సాగింది. కీలక దశలో తన్వి తడబడి, మూడు అనవసర తప్పిదాలు చేయడంతో రక్షిత 19-16 ఆధిక్యాన్ని సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది.

## టీమిండియా బౌలర్లు విఫలం


### భారీగా 363 పరుగులు చేసిన శ్రీలంక




**న్యూఢిల్లీ:** శ్రీలంక ఎలెవన్‌తో జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత బౌలర్లు తేలిపోయారు. కొలంబో వేదికగా తొలి రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు నష్టానికి 363 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆతిథ్య జట్టు వికెట్లు పడగొట్టేందుకు టీమిండియా బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు ఓపెనర్లు నిశాన్ మధుష్క (66), రవిందు రసంత (71) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. వారిద్దరూ వన్డే తరహాలో బ్యాటింగ్ చేసి తొలి వికెట్‌కు ఏకంగా 110 పరుగు భాగస్వామ్యం నెలకొల్పి భారత్ బౌర్లను ఒత్తిడిలోకి నెట్టారు. అయితే సమన్వయ లోపం కారణంగా మధుష్క రనౌట్ కావడంతో భారత్‌కు తొలి వికెట్ దక్కింది. నిశాన్ స్థానంలో క్రీజులోకి వచ్చిన వన్‌డౌన్ బ్యాటర్ పసిందు సూరియబండారా కూడా రాణించాడు. అయితే రసతంత, సూరియబండరా (35)లను వరుస ఓవర్లలో ఔట్ చేసి టీమిండియా కాస్త కమ్‌బ్యాక్ ఇచ్చినట్లు కన్పించింది. కానీ ఆ తర్వాత వచ్చిన పవన్ రత్నాయకే (39), అహన్ విక్రమ సింఘే( 31), కెప్టెన్ సోనల్ దినుష (52), రమేష్ మెండిస్ (32) నిలకడగా ఆడి జట్టు స్కోర్‌ను 350 పరుగుల మార్క్ దాటించారు. ప్రస్తుతం క్రీజులో కేశర సువాంత (9), సుదీరా (1) ఉన్నారు. భారత్ బౌలర్లలో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ తలా రెండు వికెట్టు పడగొట్టారు. వీరితో పాటు గుర్నూర్ బ్రార్‌ఖు ఓ వికెట్ తీశాడు. సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్ 13 ఓవర్లు బౌటింగ్ చేసినప్పటికీ ఒక్క వికెటన కూడా తీయలేదు.

## వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్.. ఫైనల్‌కు అష్ఫాక్, బసంత్






**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన మహమ్మద్ అష్ఫాక్, 2026 ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్ పురుషుల 400 మీటర్ల పోటీలో ఫైనల్‌కు చేరుకున్నాడు. అలాగే హై జంప్‌లో బంసత్ విజయంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. శుక్రవారం నాడు ఈ పోటీల్లో 19 యేళ్ల అష్ఫాక్ హీట్ 5లో 45.81 సెకన్ల సమయం నమోదు చేసి రెండో స్థానంలో నిలిచాడు. సెమీఫైనల్ హీట్ 3లో 46.00 సెకన్ల పరుగుతో మూడవ స్థానంలో నిలిచి ఫైనల్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకున్నాడు.

మరో భారత్ అథ్లెట్ పీయూష్ రాజ్, హీట్ 6లో 47.78 సెకన్ల టైమింగ్‌తో ఐదవ స్థానంలో నిలిచి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయాడు. ఇక పురుషుల హై జంప్‌లో, బసంత్ 2.14 మీటర్ల ఎత్తును అధిగమించి ఫైనల్‌కు అర్హత సాధించగా, 2.05 మీటర్ల అత్యుత్తమ జంప్ చేసిన ఏకే అంబ్రీష్ గ్రూప్ బిలో 12వ స్థానంలో నిలిచి అర్హతను కోల్పోయాడు. ఇక అన్షు మహిళల షాట్‌పుట్ ఫైనల్‌కు తృటిలో అర్హత కోల్పోయింది. ఆమె 15.24 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో అర్హత మార్కుకు 21 సెం.మీ. దూరంలో నిలిచింది. తను చౌదరి కూడా మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో తన హీట్‌లో 1:00.03 సమయంతో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయింది. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో, అమిత్ కుమార్ తన హీట్‌లో 54.01 సెకన్ల సమయంతో చివరి స్థానంలో నిలిచాడు.

## మరింత పెరిగిన వెండి, బంగారాలు

### వెండి రూ.8,000 పెరుగుదల, బంగారం రూ.1.50 లక్షలకు చేరిక




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** దేశీయ కమోడిటీ మార్కెట్‌లో విలువైన లోహాల ధరలు శుక్రవారం భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు బలపడటం, అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలు దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపాయి.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సెప్టెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ధర 1.54 శాతం లేదా రూ.2,271 పెరిగి 10 గ్రాములకు రూ.1,49,793కు చేరింది. సెప్టెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ ఏకంగా 3.56 శాతం లేదా రూ.8,040 ఎగిసి కిలోకు రూ.2,33,876 వద్ద ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర సుమారు 1.9 శాతం పెరిగి ఔన్సుకు 4,300 డాలర్లకు చేరువైంది. దీంతో బంగారం, వెండి వరుసగా బలమైన వారపు పనితీరును నమోదు చేసే దిశగా సాగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 81.74 డాలర్లకు తగ్గింది. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ సుమారు 76 డాలర్ల వద్ద ఉంది. క్రూడ్ ధరలు తగ్గడం ద్రవ్యోల్బణ ఆందోళనలను తగ్గిస్తుంది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తక్కువగా ఉంచడం లేదా తగ్గించే అవకాశాలు పెరుగుతాయని మార్కెట్ భావిస్తుంది. వడ్డీ ఆదాయం ఇవ్వని బంగారానికి తక్కువ వడ్డీ రేట్లు అనుకూలంగా ఉంటాయి. అమెరికా కరెన్సీ విలువ స్వల్పంగా తగ్గడం కూడా బంగారం ధరలకు మద్దతుగా నిలిచింది. బంగారం అంతర్జాతీయంగా డాలర్లలో ధర నిర్ణయించబడుతుంది. డాలర్ బలహీనపడితే ఇతర కరెన్సీల కొనుగోలుదారులకు బంగారం చౌకగా మారడంతో డిమాండ్ పెరుగుతుంది. హర్ముజ్ ద్వారా నౌకాయానాన్ని పునరుద్ధరించేందుకు ఒప్పందం సమీపంలో ఉందన్న సంకేతాలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా అమెరికా ఇరాన్ యుద్ధం త్వరలో ముగిసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. చమురు ధరల తగ్గుదల బంగారం ధరలకు మద్దతునిచ్చింది. ఇక మార్కెట్ దృష్టి ఇప్పుడు అమెరికా నాన్‌ఫార్మ్ పేరోల్స్ గణాంకాలపై ఉంది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలపై ఈ డేటా కీలక ప్రభావం చూపనుంది. అంచనాల కంటే బలహీనమైన ఉద్యోగ గణాంకాలు వెలువడితే వడ్డీ రేట్ల తగ్గింపుపై అంచనాలు పెరిగి బంగారం, వెండి ధరలకు మరింత మద్దతు లభించే అవకాశం ఉంది. అదే సమయంలో బలమైన ఉద్యోగ గణాంకాలు వెలువడితే ఇటీవలి లాభాల్లో కొంత లాభాల స్వీకరణ చోటుచేసుకోవచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

## ఆర్థిక, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగాల ఒత్తిడి



### నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 7:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో నష్టాలు చవిచూసాయి. ఫైనాన్షియల్, ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా మార్కెట్ ప్రారంభం నుంచి ఒడిదొడుకులకు లోనైంది. దిగ్గజ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో బలహీనత కారణంగా ప్రధాన సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 455.59 పాయింట్లు క్షీణించి 78,499.17 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ 65.35 పాయింట్లు నష్టపోయి 24,570.65 వద్ద ముగిసింది. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తగ్గించుకోవడంతో మార్కెట్ సెంటిమెంట్ రోజంతా బలహీనంగానే ఉంది. ముఖ్యంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయి మార్కెట్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. నిఫ్టీ షేర్లలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ టాప్ లూజర్లుగా నిలిచాయి. ప్రధాన సూచీలు నష్టపోయినప్పటికీ బ్రాడర్ మార్కెట్ కొంతమేర తట్టుకుని నిలబడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.22 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.05 శాతం స్వల్పంగా నష్టపోయింది. రంగాల వారీగా చూస్తే ఆటో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లు మార్కెట్‌కు కొంత మద్దతు నిచ్చాయి. నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఐటీ సూచీలు ప్రధాన రంగాల్లో టాప్ గెయినర్లుగా నిలిచి, సూచీల నష్టాలను కొంతవరకు పరిమితం చేశాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.18 పెరిగితే స్మాల్‌కాప్ సూచీ స్థిరంగాను కొనసాగాయి. కమోడిటీ మార్కెట్‌లోబ్రెంట్ ముడిచమురు అక్టోబరు సెటిల్‌మెంట్‌దర 33 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 82.16 డాలర్లుగా కొనసాగింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 95.19 వద్ద ముగిసింది. అంతకుముందురోజు 95.22కంటే కొంతమేర మెరుగుపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు అక్టోబరు ఐదునాటి ధరలు 1.56శాతంపెరిగి రూ.1,51,176కి చేరాయి.




## ఇఎంఐ బకాయిలున్నా ఫోన్ లాక్‌కు ఆర్బీఐ నో

**ముంబయి, ఆగస్టు 7:** స్మార్ట్‌ఫోన్‌కోసం తీసుకున్న రుణాలు బకాయిలుంటే ఫోన్ లాక్‌చేసే సంస్థలకు ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు జారీచేసింది. ఇవి వచ్చే యేడాది జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఇఎంఐ చెల్లించలేదని వెంటనే ఫోన్‌ను లాక్ చేయడానికి వీల్లేదు. ఫోన్ కొనుగోలు కోసం తీసుకున్న రుణం 30 రోజుల పాటు బకాయిగా ఉంటేనే పరిమితులు విధించవచ్చు. పూర్తిగా ఫోన్‌ను లాక్ చేయాలంటే బకాయి 60 రోజులు దాటాలి. ఈ నిబంధనలు ఫోన్, ట్యాబ్లెట్, ల్యాప్‌టాప్ కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకే వర్తిస్తాయి. వ్యక్తిగత రుణం లేదా ఇతర రుణాల పేరుతో ఇప్పటికే ఉన్న ఫోన్‌ను రిమోట్ ద్వారా లాక్ చేసే అధికారం రుణదాతలకు ఉండదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. ఫోన్‌పై పరిమితులు విధించినా కొన్ని సేవలు తప్పనిసరిగా పనిచేయాలని ఆదేశించింది. ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్, అత్యవసర ఎస్‌వోఎస్ సదుపాయం, ఉద్యోగానికి అవసరమైన కీలక ఫీచర్లు అందుబాటులో ఉండాలి. దీంతో రుణగ్రహీత పూర్తిగా ఇబ్బంది పడకుండా చూడాలని సూచించింది.

## 682.35 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ ఖజానా




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** భారత్ విదేశీ మారక నిల్వలు మరోసారి భారీగా పెరిగాయి. జూలై 31తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 8.75 బిలియన్ డాలర్లు పెరిగి 682.354 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు వారంలో నిల్వలు 6.118 బిలియన్ డాలర్లు పెరిగి 682.354 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 728.494 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకాయి. ఆ తర్వాత పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో రూపాయి ఒత్తిడికి గురికావడంతో నిల్వలు పలు వారాల పాటు తగ్గాయి. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్లో డాలర్లను విక్రయించాల్సి వచ్చింది. జూలై 31తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 8.75 బిలియన్ డాలర్లు పెరిగి 564.68 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్ విలువలో లెక్కించే ఎఫ్‌సిఎల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాయేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే మార్పుల ప్రభావం కూడా ఉంటుంది. దేశంలోకి మరిన్ని విదేశీ మారకద్రవ్య ప్రవాహాలను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ గత నెలలో పలు చర్యలు చేపట్టాయి. ఇందులో ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) డిపాజిట్లకు సంబంధించిన చర్యలు కూడా ఉన్నాయి. ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు భారత్‌కు సుమారు 32 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య ప్రవాహం వచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.వారంలో బంగారం నిల్వల విలువ 1.685 బిలియన్ డాలర్లు పెరిగి 104.743 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్ 48 మిలియన్ డాలర్లు పెరిగి 18.666 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అంతర్జాతీయ ద్రవ్య నిధిసంస్థలో భారత్ రిజర్వ్ పొజిషన్ కూడా 28 మిలియన్ డాలర్లు పెరిగి 4.778 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

## మెటాకు అమెరికా కోర్టు రూ.5400 కోట్ల జరిమానా

**న్యూమెక్సికో, ఆగస్టు 7:** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి భారత కరెన్సీలో సుమారు రూ. 5,400 కోట్లకు పైగా జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది.

## అగ్రిబిజినెస్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై ఎఫ్ఎస్ఎస్ఏఐ జరిమానా

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ప్రముఖ వంటనూనెల తయారీ సంస్థ ఎడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్‌కు ఆహార నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ జరిమానా విధించింది. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని ఫోర్టిఫైడ్ సన్‌ఫ్లవర్ వంటనూనెను తయారు చేసి, విక్రయించినందుకు ఈ చర్య తీసుకుంది.ఎడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ ఫార్చ్యూన్ బ్రాండ్ పేరుతో వంటనూనెలను విక్రయిస్తోంది. గోవాలో సేకరించిన ఫార్చ్యూన్ ఫ్రయోలా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ సీడ్ ఆయిల్ నమూనా ప్రయోగశాల పరీక్షల్లో విఫలమైంది. నూనెలో విటమిన్ డి స్థాయి నిర్దేశిత ప్రమాణాల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు తేలింది.ఈ విషయాన్ని ఎఫ్ఎస్ఎస్ఎఐ శుక్రవారం సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించింది. ఎడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్ (మంగళూరు) పై అడ్జుడికేషన్ ఆర్డర్ జారీ చేసి జరిమానా విధించినట్లు తెలిపింది. గోవాలోని తాజ్ ఫోర్ట్ అగ్వాడా రిసార్ట్ అండ్ స్పా నుంచి ఎఫ్ఎస్ఎస్ఎఐ అధికారులు ఒక లీటర్ ఫార్చ్యూన్ ఫ్రయోల్గా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ నమూనాను సేకరించారు. ప్రాథమిక ఆహార ప్రయోగశాల పరీక్షల్లో ఈ ఫోర్టిఫైడ్ నూనె ఫోర్టిఫికేషన్ ఆఫ్ ఫుడ్స్ రెగ్యులేషన్స్, 2018లో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేలింది.నమూనాలో విటమిన్ ఎ, విటమిన్ డి స్థాయిలు నిర్దేశిత పరిమితుల కంటే తక్కువగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఎఐ తెలిపింది. దీంతో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ల ప్రకారం ఉత్పత్తిని నాసిరకంగా గుర్తించారు.కంపెనీ అప్పీల్ చేయడంతో నమూనాను రెఫరల్ లేబొరేటరీలో మరోసారి పరీక్షించారు. ఈ పరీక్షల్లోనూ విటమిన్ డి పరిమాణం నిర్దేశిత స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయింది.దీంతో సెంట్రల్ లైసెన్సింగ్ అథారిటీ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వగా, అడ్జుడికేషన్ దరఖాస్తు దాఖలైంది. అనంతరం గోవా అడ్జుడికేటింగ్ అధికారి అగ్రి బిజినెస్‌పై చర్యలు తీసుకుని, నాసిరకం ఫోర్టిఫైడ్ ఎడిబుల్ ఆయిల్ తయారీ, మార్కెటింగ్‌కు సంబంధించి జరిమానా విధించారు.అయితే జరిమానా మొత్తం ఎంత అన్నది ఎఫ్ఎస్ఎస్ఎఐ వెల్లడించలేదు.ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై గత కొన్ని నెలలుగా ఎఫ్ఎస్ఎస్ఎఐ కఠిన చర్యలు చేపడుతోంది. ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు ఎనర్జీ డ్రింక్స్, ఆల్కహాలిక్ బెవరేజెస్ తయారీదారులపైనా నియంత్రణ సంస్థ దృష్టి సారించింది

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14